: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఖమ్మం

16-8-2025
శనివారం సంపుటి: 31
సంచిక: 196 పేజీలు:
8+16 వెల: 6.50

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam





శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటనుంచి ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ



శుక్రవారం గోల్కొండ కోటనుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

# 'సుదర్శనం' శత్రు దుర్భేద్యం

## బహుళ అంచెలతో దేశ రక్షణ కవచం

## ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్, అమెరికా గోల్డెన్ డోమ్ కంటే ఇది అధునాతనం

## 100 గంటల పాటు పాక్‌ను వణికించిన 'సూపర్ చక్రం'

## స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 15:** ఇతర అభివృద్ధిచెందిన దేశాల తరహాలోనే దేశ రక్షణ కవచంగా సుదర్శన్‌చక్ర బహుళ అంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. 79వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎర్రకోట బురుజునుంచి మాట్లాడిన మోడీ అత్యాధునిక సమీకృత నిఘా వ్యవస్థ, సైబర్ రక్షణ, భౌతిక దాడులనుంచి ఈ రక్షణ వ్యవస్థ పరిరక్షిస్తుందని పేర్కొన్నారు. మన పౌరుల భద్రతతోపాటు, మన మౌలికవనరుల పరిరక్షణ, శత్రుదాడులను చాకచక్యంగా ఎదుర్కొనడం వంటివి ఈ రక్షణ వ్యవస్థ మూలశక్తులని అన్నారు. ఉగ్రదాడులుసైతం ఎదుర్కొనే శత్రుదుర్భేధ్యంగా ఈసుదర్శన చక్ర వ్యవస్థ ఉంటుందన్నారు. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్, అమెరికా ప్రతిపాదించిన గోల్డెన్ >>2

**దేశ యువతకోసం లక్ష కోట్లతో ప్రణాళిక** 2లో

**నీటి వాటాపై ఎలాంటి రాజీ లేదు..**

**ప్రపంచ నగరాలకు దీటుగా ముందుకు**

**సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన**

**స్వాతంత్ర్య దినోత్సవ గోల్కొండ ప్రసంగంలో సిఎం రేవంత్**

# బనకచర్లను సాగనివ్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఎపి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై పరోక్షంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం గోల్కొండలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం సిఎం రేవంత్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.కృష్ణా, గోదావరి నదుల్లో నీటివాటా హక్కుపై రాజీలేదని తేల్చి చెప్పారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా దక్కించుకుంటాం అని స్పష్టం చేశారు.మన అవసరాలు తీరాకే మిగతా రాష్ట్రాలకు నీరు అంది స్తామని అన్నారు. గత ప్రభుత్వం లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి. పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. తెలంగాణలో చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం అని హామీ ఇచ్చారు. గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, అహింసే అస్త్రంగా మహా సంగ్రామాన్ని గెలిచి ప్రపంచానికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేసిందన్నారు.. మహాత్మాగాంధీ సారథ్యంలో బయట శత్రువులైన బ్రిటీషర్లపై యుద్ధం గెలిచాం, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సారథ్యంలో ప్రజాస్వామ్య >>2

# ట్రంప్-పుతిన్ చరిత్రాత్మక భేటీ



శుక్రవారం అలస్కాలో సమావేశమైన ట్రంప్, పుతిన్

## ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు స్వస్తి పలికే యత్నం

## శాంతి ఒప్పందం దిశగా చర్చలు

**అలాస్కా, ఆగస్టు 15:** మూడేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను నిలిపివేసి శాంతిని నెలకొల్పేందుకు అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ చేస్తున్న కసరత్తులు షురూ అయ్యాయి. అలాస్కాలోని మారుమూల యాంకరేజి పట్టణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. అటునుంచి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ తన ప్రతినిధిబృందంతో చేరుకోగా ఇటునుంచి ట్రంప్‌తోపాటు పలువురు మంత్రులు సిఐఎ డైరెక్టర్ జనరల్ తదితరులు అలాస్కాకు చేరుకున్నారు. యుద్ధవిరమణ, శాంతినెలకొల్పడం ఏకైక లక్ష్యంగా జరిగే ఈచర్చలపై ఇపుడు ప్రపంచదేశాలు ఎంతో ఆసక్తితో ఉన్నాయి. జాయింట్‌బేస్ ఆండ్రూస్‌నుంచి అలాస్కాకు బయలుదేరిన ట్రంప్ చర్చలపై తనకు ఎంతో నమ్మకం ఉందని ఇదే ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు జరుపుతున్న కీలక చర్చలని పేర్కొన్నారు. చర్చలు సజావుగా సాగకుంటే ఒక్కనిమిషానికే వెనక్కి వచ్చేస్తామని, అలాకాని పక్షంలో 20 గంటలపాటు అయిన చర్చలు కొనసాగుతాయన్నారు. పుతిన్, ట్రంప్ ముఖాముఖి చర్చలు ఏడేళ్లలో మొదటిసారి జరుగుతున్నాయి. అంతకుముందుఐదుగురు అమెరికా అధ్యక్షులతో భేటీ అయిన అనుభవం పుతిన్‌కు ఉంది. ట్రంప్ లక్ష్యం ముందు ఉక్రెయిన్‌పై దాడులు వెంటనే నిలిపివేయాలని భావిస్తున్నారు. అనంతరం రష్యా ప్రతిపాదనలు, డిమాండ్లు, ఉక్రెయిన్‌వైపునుంచి వచ్చే డిమాండ్లు, ప్రతిపాదనలపై చర్చలుకొనసాగుతాయని చెపుతున్నారు. యుద్ధవిరమణకు ఇదే సరైన అదను అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటనపైనే ఎంతో ఆసక్తిగా ఉన్నామని అధ్యక్షుడు వోలోదిమిర్‌జెలెన్‌స్కీ అన్నారు. ముఖాముఖి చర్చల్లో యుద్ధవిరమణపైనే కీలకంగా ఉంటుంది. పుతిన్ అంగీకరించనిపక్షంలో పరిస్థితులు వెనువెంటనే మారిపోతాయని మరిన్ని ఆంక్షలు ఉంటాయని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అలాగే పుతిన్ అంగీకరించకపోతే భారత్‌పై మరిన్ని సుంకాలువేస్తామని ఆర్థికమంత్రి బెస్సెంట్‌కూడా హెచ్చరించిన సంగతి తెలిసిందే. అలాగే జెలెన్‌స్కీ కూడా రష్యా ఆక్రమించిన ప్రాదేశిక ప్రాంతాన్ని అప్పగించేందుకు జెలెన్‌స్కీ కూడా అంగీకరించడంలేదు.

# వెయ్యేళ్లు చెప్పుకునేలా చేస్తా



శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ షోలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి

## రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం

## ప్రభుత్వ పాలసీ, కన్‌స్ట్రక్షన్ అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్లు

## పెట్టుబడులకు రక్షణ, లాభాలు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం

## 'క్రెడాయ్' సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు15:** అపోహలు, అనుమానాలను దాటుకుని రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాలసీ, కన్‌స్ట్రక్షన్ రెండూ రాష్ట్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్స్‌లాంటివి పాలకులు మారినా, పాలసీ పెరాలసిస్ లేకుండా చూడటం వల్లే మనం ప్రపంచంతో పోటీ పడగలుగుతున్నామని చెప్పారు. శుక్రవారం హైటెక్స్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షోను సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ షో కొనసాగనుంది. పారదర్శక పాలసీలతో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. పెట్టుబడులకు రక్షణ కల్పించడమేకాదు.. లాభాలు వచ్చేలా ప్రోత్సహించే బాధ్యత మా ప్రభుత్వానిది, మాది. అని స్పష్టంచేశారు. రాజకీయ నాయకులు సృష్టించే అపోహలకు మీరు ఊతం ఇస్తే నష్టపోయేది మీరే. అలాంటి అపోహలను తొలగించడానికే ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. ఇతర దేశాల ప్రతినిధులను ఇక్కడ పెట్టుబడులకు ఆహ్వానించే మేము.. ఇక్కడే ఉన్న మిమ్మల్ని ఎందుకు వదులుకుంటాం? అని ప్రశ్నించారు. పెట్టుబడుల విషయంలో మీకే మా మొదటి ప్రాధాన్యత, నేను సగటు మధ్యతరగతి ఆలోచనలు ఉన్న ముఖ్యమంత్రిని కొల్లగొట్టి విదేశాలకు తరలించుకుపోవాలన్న విశాల దృక్పథం ఉన్న వాడిని కాదని పేర్కొన్నారు.

సమాజ శ్రేయస్సుకోసమే నేనుఆలోచిస్తా.. అందుకే మీరు అడిగిన కొన్నింటికి నేను అంగీకరించక పోవచ్చు, నేను ఎప్పటికీ మీకు ఆరకంగా సహకరించను.. పారదర్శక విధానంలో ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధికి సహకరించేందుకు నాకు అభ్యంతరం లేదు అని స్పష్టం చేశారు. జైపాల్ రెడ్డి చొరవతో హైదరాబాద్ నగరానికి మెట్రో వచ్చింది పదేళ్లుగా మెట్రో విస్తరణ జరగలేదు అలా జరిగి ఉంటే హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య కొంతైనా పరిష్కారమయ్యేదని పేర్కొన్నారు. జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో మల్టీ యూనిట్ ఉండే ట్రాన్స్‌పోర్టేషన్ ఉండాలి అని చెప్పారు.

లాస్ట్ మైల్ కనెక్టివిటీ చేయడానికి నేను శాయశక్తులా ప్రయత్నిస్తున్నా.. షామీర్ పెట్, మేడ్చల్ వరకు మెట్రో విస్తరణకు కృషి చేస్తున్నాం అని చెప్పారు. మన నగరం ప్రతిష్ట పెంచడానికే మా ప్రయత్నం మాటిమాటికీ ఢిల్లీకి వెళుతున్నారని కొందరు మాట్లాడుతున్నారు..మెట్రో, మూసీ, ఇతర అనుమతులు ఇవ్వాల్సింది కేంద్ర ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోఉంటే అక్కడికి కాకుండా ఎక్కడికి వెళతారు అని ప్రశ్నించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రికి బంగళా ఇచ్చింది నెలకు నాలుగురోజులు వెళ్లి కేంద్రంతో అనుమతులు తెచ్చుకోవడా >>2



## భారీ వర్షాలతో కూలిన దర్గా పైకప్పు

### ఐదుగురు మృతి, 11 మందికి గాయాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కుంభవృష్టి వర్షాలతో దేశరాజధాని నగరంలోని ఓ చారిత్రకకట్టడం ప్రాంగణంలోని దర్గా కుప్పకూలింది. నిజాముద్దీన్ ప్రాంతంలోని ముఘల్‌చక్రవర్తి హుమాయూన్ సమాధి సమీపంలో ఉన్న షరీఫ్ పట్టేషా దర్గా పైకప్పు శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా కూలిపోయింది.

ఈ ఘటనలో ఐదుగురు పర్యాటకులు మృతిచెందారు. వారిలో ముగ్గురు మహిళలున్నారు. మరో ఏడుగురు శిథిలాలకింద చిక్కుకున్నారు. ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలుచేపట్టి ఇప్పటివరకూ 11 మంది పర్యాటకులను రక్షించి ఆసుపత్రికి తరలించారు. 16వ శతాబ్దంనాటి హుమాయూన్ సమాధికి సమీపంలోనే ఈ దర్గా ఉంది. ప్రార్థనలకోసం ఇమామ్ సహా కొందరు యువకులు అక్కడకు వచ్చారు. హటాత్తుగా పైకప్పు కూలడంతో పలువురు గాయపడ్డారు. సుమారు 15నుంచి 20 మందివరకూ ఉన్నట్లు సమాచారం. వీరందరి వయసు 25 నుంచి 30 ఏళ్లమధ్య ఉంటుందని చెపుతున్నారు.

## భారత్‌కు ప్రపంచ దేశాల శుభాకాంక్షలు

## 100 మీటర్ల జాతీయ పతాకంతో సైనికుల తిరంగా యాత్ర

5లో

# ఏదయా! యూరియా?



## క్యూల్లోనే తెల్లారుతున్న బతుకులు

## మహిళలు సైతం పడిగాపులు

## కొందరికే రెండు బస్తాలు!

## రోడ్డెక్కుతున్న అన్నదాతలు

**హైదరాబాద్, అగస్టు 15, ప్రభాతవార్త :** తెలంగాణలో అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి.రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో సాగు పనులు ముమ్మరం చేశారు. ఈ మేరకు వరి, పత్తి, మొక్కజొన్న వేస్తున్న అన్నదాతలు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి క్యూలో నిల్చున్నా రెండు, మూడు బస్తాలు మాత్రమే ఇస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ బస్తాలకుకూడా పోలీస్ పహారాలో పంపిణీ కొనసాగుతుండగా, మరికొన్ని చోట్ల యూరియా ఎక్కడంటూ రైతన్నలు ఆందోళనల బాట పడుతున్నారు. సరిపడా ఎరువులు సరఫరా చేయకపోవడంతో రైతాంగమంతా రందిపెట్టుకున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ ఎరువుల విక్రయం 12వేల టన్నుల నుంచి 2357 టన్నుల స్థాయికి పడిపోయిన దుస్థితి నెలకొన్నది. వ్యవసాయ పనులు వదిలేసి ఎరువుల కోసం రోజుల తరబడి దుకాణాల ముందు పడిగాపులు కాస్తున్నారు. యూరియా కోసం వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ సెంటర్ల వద్ద చెప్పులు, రాళ్లు ఇలా ఏదుంటే అది లైన్లలో పెడుతున్నారు. జిల్లాలకు అంతంత మాత్రంగా సరఫరా అవుతున్న యూరియాను ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఒక్కో బస్తా రూ.420 నుంచి రూ.450వరకు విక్రయిస్తున్నారు. జిల్లాల్లో అరకొరగా పంపిణీ చేయడంతో ఇది సరిపోదని సిబ్బందితో వాదనకు దిగుతున్నారు. ఇండెంట్ పెట్టాం వస్తుందని చెప్పడంతో పిఎసిఎస్‌ల వద్దే పడిగాపులు పడుతున్నారు. సిరిసిల్ల జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రుద్రంగి మండలంలో అర్ధరాత్రి వరకు మహిళా రైతులు క్యూ లైన్‌లో నిలుచొని యూరియా కోసం అవస్థలు పడ్డ విషయం మరవకముందే చందుర్తిలో చెప్పులతో >>2

## పేదల ఆత్మ గౌరవానికి ప్రతీక

# రేషన్ కార్డులు

## ప్రజా సంక్షేమమే అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ పాలన

## ఇందిరా మహిళాశక్తి కింద ఆడపడుచుల ఆర్థిక వృద్ధికి చేయూత

## ఖమ్మంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో డి.సిఎం భట్టి

**ఖమ్మం బ్యూరో ఆగస్టు 15, ప్రభాతవార్త:** ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం ముఖ్య అతిథి పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ముఖ్యఅతిథి తన సందేశాన్ని తెలియజేసారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, అహింసే అస్త్రంగా మహా సంగ్రామాన్ని గెలిచి ప్రపంచానికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేసిందని, స్వాతంత్రం తరువాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సారథ్యంలో అంతర్గత శత్రువులైన పేదరికం, అసమానతలు, అంటరానితనంపై పోరాటానికి నాంది పలికామని అన్నారు. 70 ఏళ్ళుగా పి.డి.ఎస్ వ్యవస్థ పేద



శుక్రవారం ఖమ్మంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రసంగిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజల ఆహార భద్రతకు భరోసా ఇస్తుందని, అదే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిందని అన్నారు. పేదల ఆత్మగౌరవానికి మరో ప్రతీక రేషన్ కార్డులను అర్హులైన పేద కుటుంబాలు అందరికీ పంపిణీ చేస్తున్నామని, ఖమ్మం జిల్లాలో నూతనంగా 24 వేల 818 కుటుంబాలకు రేషన్ కార్డ్ లు జారీ చేశామని అన్నారు. రైతు సంక్షేమా >>2


శుక్రవారం న్యూఢిల్లీలోని అమరవీరుల స్తూపంవద్ద వర్షంలోనే నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము


శుక్రవారం న్యూఢిల్లీలో స్కూల్ విద్యార్థులతో కలిసి స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఢిల్లీ సిఎం రేఖా గుప్తా


శుక్రవారం న్యూఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న రాహుల్ గాంధీ

# 'సుదర్శనం' శత్రు దుర్భేద్యం

>> డోమ్ వ్యవస్థలకంటే అధునాతన వ్యవస్థలతో సుదర్శన్‌చక్ర వ్యవస్థ ఉండగలదని ప్రధాని పేర్కొన్నారు. ఇప్పటికే సమీకృత ఎయిర్‌కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్) పనిచేస్తోందని, అందువల్లనే 100 గంటలపాటు ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్ క్షిపణులు మనల్ని ఏమీచేయలేకపోయాయన్నారు. అయితే సుదర్శన్‌చక్ర మిషన్ ఒక హిందూ సైద్ధాంతిక వ్యవస్థల ప్రకారం ఏర్పాటయింది. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు జయద్రథుడిని వధించేందుకు వీలుగా సూర్యునిపైకి సుదర్శన చక్రాన్ని రక్షణ వలయంగా శ్రీకృష్ణుడు ప్రయోగించారని, ఇపుడు అదే తరహా రక్షణ వ్యవస్థలో మన రక్షణ వ్యవస్థకు సుదర్శన చక్ర నిలుస్తుందన్నారు. అందుకే ఈ మిషన్‌కు 'సుదర్శన్ చక్ర' అని పేరుపెట్టామన్నారు. 2035నాటికి ఇంకా ఈ సుదర్శన చక్ర వ్యవస్థను మరింత విస్తరించి శక్తివంతంచేసి మరింత ఆధునీకరణచేసే రక్షణ చట్రంగా మారుస్తామన్నారు. ఈ మొత్తం వ్యవస్థ భారత్‌లోనే తయారీ అనంతరం రూపకల్పన, ఏర్పాటు ఉంటుందని, ఆత్మనిర్భర్‌భారత్‌కు నిదర్శనంగా సుదర్శన్‌చక్ర నిలుస్తుందన్నారు. ఈ వ్యవస్థతో ప్రతిపౌరుడు కూడా పూర్తిభద్రతతో ఉంటాడన్న భరోసా ఇచ్చారు. ఒక రక్షణ కవచంగానే కాకుండా శత్రుదాడులను శక్తివంతంగా అడ్డుకుంటుందన్నారు.సైబర్ ముప్పునుకూడా అరికడుతుంది. హ్యాకింగ్, ఫిషింగ్ వంటివి ఇక ఎంతమాత్రం వీలుకావు. రక్షణరంగ పరిశోధన ఏజెన్సీలు, మిలిటరీ, ప్రైవేటు రంగ సృజనాత్మక పరిశోధనలతో కూడుకుని ఈ వ్యవస్థ ఉందని మోదీ చెప్పారు. పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో సుమారు 100 గంటలపాటు పాకిస్తాన్ మన మిలిటరీబేస్‌లను ధ్వంసంచేయాలని చూసిందని, భారత్ యుద్ధవిమానాలను కూల్చాలని చూసిందని, భారత పట్టణాలు,నగరాలను ధ్వంసంచేసే కుట్రలువేస్తే భారత్ ప్రస్తుతం ఉన్న గగనతల రక్షణ వ్యవస్థతో నిర్వీర్యంచేసిందన్నారు. ఇపుడు వస్తున్న సుదర్శన చక్ర వ్యవస్థల్లో మన విద్యుత్‌గ్రిడ్‌లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, ఆహార జలవనరుల సరఫరా, మెడికల్‌కేర్, రక్షణ వ్యవస్థలు వంటివాటికి పూర్తి రక్షణ లభిస్తుందన్నారు. ఆపరేషన్‌సిందూర్‌లో ఐఏసీసీఎస్ కీలకపాత్ర పోషించింది. పాకిస్తాన్ కుట్రలను నిర్వీర్యంచేసిందని ప్రధానిమోదీ చెప్పారు. ఆర్మీలోని గగనతల రక్షణ వ్యవస్థలను జోడించడం, ఎయిర్‌పోర్స్, నేవీని ఒకే వ్యవస్థగొడుగులోకి తీసుకువచ్చింది. ట్రాకింగ్, నిర్మూలించడం ఇపుడు తేలిక అయింది. రాడార్లు, నిఘా వ్యవస్థలైన అవాక్స్, యుద్ధవిమానాలను సైతం ట్రాక్‌చేసే సత్తా ఈ ఐఏసీసీఎస్‌కు ఉంది. ముప్పు తీవ్రతను బట్టి ఆర్మీ, ఇతర వ్యవస్థలన్నింటినీ అప్పటికప్పుడు సిద్ధంచేయగల సత్తా ప్రస్తుత ఐఏసీసీఎస్‌కు ఉందన్నారు. మన సుదర్శనచక్ర తరహాలోనే అమెరికా గోల్డెన్‌డోమ్ ఏర్పాటు చేస్తోంది. గగనతల క్షిపణి రక్షణ వ్యవస్థను రూపొందిస్తుంది. అమెరికాతోపాటు కెనడాకూడా ఇదే డోమ్‌లు ఏర్పాటుచేసుకుంటున్నది. అమెరికా 175 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని చెపుతున్నారు. ఇప్పటికే ఇలాంటి వ్యవస్థలు రష్యా, చైనాలకు ఉంది. 'హెచ్‌క్యూ9 దీర్ఘశ్రేణి ఉపరితలంనుంచి గాలిలోనికి, యాంటి బాలిస్టిక్ క్యాపబుల్ సిస్టమ్‌లు హాక్, మొరాక్, ఈజిప్టు, తుర్క్‌మెనిస్తాన్; ఉజ్బెకిస్తాన్‌లకు ఉన్నాయని. అయితే వీటన్నింటికంటే మరింత శక్తివంతంగా భారత్ సుదర్శన్ చక్ర వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రధానిమోదీ అన్నారు.

# బనకచర్లను సాగనివ్వం

>> పాలనకు పునాదులు వేసుకున్నామన్నారు. స్వాతంత్రం సిద్ధించే సమయానికి దేశం అల్లకల్లోల పరిస్థితుల్లో ఉంది. శూన్యం నుండి మన ప్రయాణం మొదలైంది. శిఖరాలే లక్ష్యంగా సంకల్పం తీసుకుని మన పెద్దలు ఈ దేశాన్ని ముందుకు నడిపించారని పేర్కొన్నారు. ఈ రోజు మనం చూస్తున్న ఆధునిక భారతం ఐదేళ్లలోనో... పదేళ్లలోనో సాధించిన విజయం కాదు. దీని వెనుక 79 ఏళ్ల కఠోర శ్రమ ఉంది.ఎందరో గొప్ప నాయకుల త్యాగం, చెమట, రక్తం ఉందన్నారు. 2023 డిసెంబర్ 7న మేము బాధ్యతలు స్వీకరించగానే రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం. ప్రజలు, ఉద్యమకారులు, అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకున్నామన్నారు.రైతులు, మహిళలు, యువత భవితకు పెద్దపీటవేశాం,. సామాజిక తెలంగాణ ఆవిష్కరణకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కులగణనతో బలహీనవర్గాల వందేళ్లకలను నిజంచేశాం. ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల నిరీక్షణకు తెరదించాం. ఇవి గొప్ప నిర్ణయాలు మాత్రమే కాదు, అత్యంత సాహసోపేత నిర్ణయాలు అని చెప్పారు. ఒక వైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలు నిర్దేశించుకున్నాం, మరో వైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం..ద్విముఖ విధానంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. మా ఆలోచనలో స్పష్టత ఉంది..అమలులో పారదర్శకత ఉంది. ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. రూ.13 వేల కోట్ల వ్యయంతో, 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. ఈ రోజు ధనికులతో సమానంగా పేదవారు సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారు.ఇది కేవలం ఆకలి తీర్చే పథకం కాదు, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే పథకం. ఈ పథకం అమలు తీరును నేను స్వయంగా పర్యవేక్షించా. ఆ రోజువారి కళ్లలో కనిపించిన ఆనందం, ఆత్మగౌరవం నాకు శాశ్వతంగా గుర్తుంటుందన్నారు. రేషన్ కార్డు... ప్రజల ఆత్మగౌరవానికి మరో ప్రతీక. ఒక భరోసా...భావోద్వేగం...ఆ భరోసా కోసం రాష్ట్ర ప్రజలు పదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఆ ఎదురు చూపులకు పరిష్కారం లభించిందన్నారు. ఈ ఏడాది జూలై 14 నుంచి రాష్ట్రం వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం. పదేళ్లతర్వాత చేతిలో రేషన్‌కార్డుతో... రేషన్ షాపుల వద్ద సందడి కనిపిస్తోంది. పేదవాడి ఆశలు, ఆకలి తీర్చే భరోసా కేంద్రంగా నేడు గ్రామాల్లో రేషన్ షాపు పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. ఇది మేం తెచ్చిన మార్పు అని చెప్పారు. తెలంగాణ రైతుకు 2022, మే 6న వరంగల్ వేదికగారూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మేం మాట ఇచ్చాం. గత ఏడాది ఇదే ఆగస్టు 15న రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి కొత్త చరిత్ర రాశాం. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, గత పాలకుల పాపాలు శాపాలై వెంటాడుతున్నా... రైతుల విషయంలో రాజీ పడలేదు. తెలంగాణ రైతును రుణ విముక్తి చేసి, దేశంలో అత్యధిక పంట పండిచే దిశగా ప్రోత్సహించాం. ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం ప్రకటించాం. రాష్ట్రంలోని 70 లక్షల, 11 వేల, 184 మంది రైతులకు ఈ సాయం అందించాం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 1.2 లక్షల మంది రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించాం. 7,178 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి చివరి గింజ వరకు ధాన్యం కొన్నాం. సన్నాలకు క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తున్నాం. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. అని వివరించారు.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ లో భాగంగా 29 లక్షల పంపు సెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీని కోసం రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్తు సంస్థలకు చెల్లిస్తున్నాం. ఇది రైతుల పట్ల, వ్యవసాయం పట్ల మాకున్న చిత్తశుద్ధి.

మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యవసాయ చరిత్రను తిరగ రాశాం అన్నదాతల సంక్షేమానికి రూ.1 లక్ష 13 వేల కోట్లను ఖర్చు చేశామని చెప్పారు. తొలి విడతగా ప్రతి నియోజక వర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. దీనికి రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నాం. రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏ ప్రాంతాల్లో 22,016 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం.సామాజిక న్యాయం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉంది. స్థానిక సంస్థలలో...విద్యా, ఉద్యోగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించుకున్నామని చెప్పారు. 50 రోజుల పాటు సమగ్ర కులగణనను యజ్ఞంలా చేపట్టాం. దీని ఆధారంగా వారికి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించాం రాష్ట్ర శాసన వ్యవస్థ ఆమోదించిన ఈ బిల్లులను ఆమోదించి,రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని కేంద్రానికి పంపాం. మనంపంపిన బిల్లులపై సత్వరం నిర్ణయం చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా మరోసారి డిమాండ్ చేశారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలోని ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించాం గ్రూప్ 1 లో 15, గ్రూప్ 2 లో 18, గ్రూప్ 3 లో 26 కులాలను చేర్చాం. ప్రతి ఏటా ఫిబ్రవరి 4ను తెలంగాణ సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని నిర్ణయించామని చెప్పారు. మసకబారిన ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వవైభవం తెచ్చాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 నుండి 10 లక్షలకు పెంచాం. 27 ఎకరాల విస్తీర్ణంలో 2,700 కోట్ల రూపాయల వ్యయంతో నయా ఉస్మానియా ఆస్పత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో అనేక చోట్ల వైద్య విద్యా కళాశాలలు నిర్మిస్తున్నాం. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్యారోగ్య రంగంపై 16 వేల 521 కోట్ల రూపాయలు వ్యయం చేశామని చెప్పారు. మహిళా ఉన్నతితెలంగాణ ప్రగతి అనే నినాదంతో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మేం పని చేస్తున్నాం. బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాం.ఈ పథకం కింద ఆడబిడ్డలకు రూ.6790 కోట్లు ఆదా అయ్యింది. ఇటీవలే 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటడం మా విజయాలలో మరో మైలురాయని చెప్పారు. రాష్ట్రంలో ఆడబిడ్డల సంక్షేమం, అభివృద్ధి కోసం మా ప్రభుత్వం మొత్తంగా 46,689 కోట్లు సమకూర్చింది. యువత తెలంగాణ శక్తికి ప్రతీక. గడచిన పదేళ్లలో యువతను మత్తుకు బానిసలను చేసే కుట్ర జరిగింది. ఆ కుట్రను మేం ఛేదించాం అని చెప్పారు. ఇవ్వాళ తెలంగాణలో డ్రగ్స్ అనే మాట వినబడటానికి వీలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తున్నాం.

ఈగల్ పేరుతో ఏర్పాటైన వ్యవస్థ రాష్ట్రం మూల మూలలా నిశితంగా నిఘా పెట్టింది. డ్రగ్స్ మాయగాళ్ల వెన్నులో వణుకు పుట్టిస్తోందన్నారు. 20 నెలల కాలంలో దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ఇప్పటి వరకు హైడ్రా 13 పార్కులు, 20 సరస్సులను ఆక్రమణల నుంచి రక్షించిందన్నారు. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ,హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం, తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో విజనరీ డాక్యుమెంట్ ఏర్పాటు చేశామని, వచ్చే డిసెంబర్ 9న ప్రజల ముందు ఉంచుతామన్నారు. భారత్‌గేమ్ ఛేంజర్‌గా హైదరాబాద్ నగరం నిలుస్తుందని, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# రేషన్ కార్డులు

>> నికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పించిందని,ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేసామని అన్నారు. రైతులకు అందించే పెట్టుబడి సహాయాన్ని 12 వేల రూపాయ లకు పెంచి, వానాకాలం పంటకు ఖమ్మం జిల్లాలో 3,37,898 మంది రైతుల ఖాతాలో 427 కోట్ల 38 లక్షల రూపాయలు రైతు భరోసా నిధులు జమ చేసామని డిప్యూటీ సీఎం అన్నారు. మద్దులపల్లిలో 19కోట్ల 95 లక్షల రూపాయలు ఖర్చు చేసి నూతన వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేశామని, ఖమ్మంలో 155 కోట్లతో మోడల్ మిర్చిమార్కెట్ నిర్మిస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో 16 వేల 153 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిం దని, ఇంటి నిర్మాణ పురోగతి ప్రకారం నాలుగు దశలలో గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు నేరుగా 5లక్షల రూపాయలు జమ చేస్తుందని డిప్యూటీ సిఎం తెలిపారు. ఆడబిడ్డలు ఆనందంగా ఉన్న ఇంట మహాలక్ష్మి ౖ తాండవి స్తుందనీ, మహాలక్ష్మి ౖ పథకంక్రింద మహిళలకు ఆర్టీసీబస్సులలో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, నేటి వరకు జిల్లా వ్యాప్తంగా మహిళలు 4 కోట్ల 22 లక్షల 98 వేల 507 ఉచిత బస్సు ప్రయాణాలు చేయడం వల్ల 198 కోట్ల 34 లక్షల 49 వేల రూపాయలను ఆదా చేశారని అన్నారు.

మహాలక్ష్మి ౖ పథకం క్రింద 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నామని, దీని ద్వారా జిల్లాలో 2 లక్షల 29 వేల 34 కుటుంబాలు లబ్ధి పొందినట్లు తెలిపారు. గృహజ్యోతిపథకం క్రింద జిల్లాలో 150కోట్ల రూపాయల సబ్సీడి చెల్లించి 2 లక్షల 48 వేల 995 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం విద్యుత్ అంబులెన్స్‌లను డివిజన్లలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద ఎర్రుపాలెం మండలం రాజుల పాలెం గ్రామం, కల్లూరు మండలం చిన్న కోరుకొండి గ్రామంలో మహిళా సంఘాల ద్వారా 2 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఉత్పత్తికి ప్రణాళికలు చేపట్టాం. బోనకల్ మండలంలోని 22 గ్రామాలను సోలార్ విద్యుత్ సరఫరా చేసి సోలార్ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇందిరా సౌర గిరి జల వికాస పథకం క్రింద జిల్లాలో రాబోయే 3 సంవత్సరాలలో జిల్లాలోని 11 వేల 785 రైతులకు చెందిన 27వేల 447 ఎకరాలను అభివృద్ధి చేస్తామని అన్నారు.నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పించే రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద 35 వేల 645 మందికి 93 కోట్ల 50లక్షల 82 వేల 840 రూపాయల వైద్య ఖర్చులను ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. మధిర, సత్తుపల్లి పట్టణాలలో 34 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ 100 పడకల ఆసుపత్రులు, కల్లూరులో 10 కోట్ల 50 లక్షలతో 50 పడకల కమ్యూనిటి హెల్త్ సెంటర్, పెనుబల్లినందు 7 కోట్ల 50 లక్షలతో 30 పడకల కమ్యూనిటి సెంటర్ నిర్మాణం పూర్తి చేశామని అన్నారు. పాలేరు, సత్తుపల్లి పట్టణాల్లో 25 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, వైరా పట్టణంలో 37 కోట్ల 50 లక్షలు ఖర్చు చేస్తూ 100 పడకల ఆసుపత్రి భవనం, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నందు 23 కోట్ల 50 లక్షలతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు.యువత ఉద్యోగ, ఉపాధికి పెద్ద పీట వేస్తున్నామని, బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం టీజీపీఎస్సీని సంస్కరించామని, 20 నెలల కాలంలో దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు. తెలంగాణ మాగాణాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇచ్చే ప్రణాళికలతో పెండింగ్ ప్రాజెక్టులను లక్ష్యాలు నిర్దేశించుకుని పూర్తి చేస్తున్నామని, కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాల సాధనలో రాజీ పడబోమని, శాశ్వత హక్కుల సాధనలో విజయం సాధించేలా మన ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికతో పని చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్, లాఅండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ యువత కోసం
# లక్ష కోట్లతో ప్రణాళిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశంలో యువతకోసం రూ.లక్ష కోట్లతో కొత్తప్రణాళిక రూపొందించామని ప్రధాని మోదీ వెల్లడించారు. వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనకింద ఈ పథకం అమలుచేస్తామన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని ప్రైవేటు కంపెనీల్లో కొత్తగాచేరే ఉద్యోగులకు ప్రభుత్వం తరఫున నెలకు రూ.15 వేలు ఇస్తామన్నారు. స్వయంసమృద్ధి అంటే డాలర్లు, పౌండ్లు కాదని, సమున్నతంగా నిలబడటం అన్నారు. ఎగుమతిదిగుమతులు, ఆదాయ వ్యయాలే కాదని, మేకిన్ ఇండియా ఏంటో ఆపరేషన్ సిందూర్ చెప్పిందన్నారు. భారత్ తయారీ నినాదం రక్షణరంగంలో మిషన్‌మోడ్‌లో ఉందని, టెక్నాలజీసొమా, సాయంకోసమే భారత్ అర్ధించలేదని, సెమీకండక్టర్లసహా అనేక విషయాల్లో సొంతశక్తిపై నిలుస్తోందన్నారు. 50-60 ఏళ్లక్రితమే చిప్ తయారీ ఆలోచన ఉందని, త్వరలో మేడిన్ ఇండియా చిప్‌లు మార్కెట్లను ముంచెత్తుతాయని మోదీ వివ రించారు. అన్ని రంగాల్లోను సంస్కరణలు తెస్తున్నామని, జిఎస్టీపై రాష్ట్రాలతో చర్చించి సవరణచేసా మని, దీపావళిలోపు కొత్త సంస్కరణలు వస్తాయన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు15:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మానవ జీవితంలో గీత బోధనలు ఎంతో ప్రభావశీలమైనవనీ, మానవుడి ప్రతి దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటారని అన్నారు. శ్రీమహావిష్ణువు దశావతారాలలో శ్రీకృష్ణావతారం చాలా ప్రత్యేకమైనది. దుష్ట సంహారం కోసం మానవుడిగా జన్మించి మానవాళికి ఎంతో అవసరమైన భగవద్గీతను ప్రభోదించారన్నారు. శ్రీకృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి పనిలో విజయం సాధించవచ్చు అని అభిప్రాయపడ్డారు. కృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు.

## వారం - వర్జ్యం

16-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
అష్టమి రా.9.35
భరణి ఉ.6.05, కృత్తిక తె.4.38
వర్జ్యం : మ.12.14-మ.3.14
దు.తె.5.52-7.31
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.

**వృషభం :** శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. ఆకస్మిక ధనలాభం.

**మిథునం:** వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. పెద్దల సలహాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** సెంటిమెంటు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. వస్తు కొనుగోలు చేస్తారు.

**సింహం:** ఆర్థికపరిస్థితి మెరుగు పడుతుంది. కొత్త పెట్టుబడులకు అనుకూలంగా వుంటుంది.

**కన్య:** ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**తుల :** సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి. రెండు మూడు విధాలుగా ధనలాభం పొందుతారు.

**వృశ్చికం:** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**ధనుస్సు:** ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. కీలక విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**మకరం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కుంభం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం.

**మీనం:** ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న కార్యాన్ని విజయవంతంగా పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సింధు ఒప్పందం రద్దు.. రద్దే!

-ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు త్రివిధ దళాలనుంచి ప్రధాని గౌరవ వందనం స్వీకరించారు. రాజ్‌ఘాట్‌వద్ద నివాళి అర్పించారు. ఈ వేడుకకోసం ఎర్రకోట పరిసరాల్లో 11 వేలమంది భద్రతా సిబ్బందిని మోహరించారు. నయాభారత్ ఇతివృత్తంతో ఈ స్వాతంత్ర్యదినోత్సవం నిర్వహించారు. ప్రధానిమోదీ వరుసగా 12వ పర్యాయం ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేశారు. రెండు ఎంఐ 17 హెలికాప్టర్లు ఇక్కడ పూలవర్షం కురిపించాయి. తన ప్రసంగంలో మోదీ మాట్లాడుతూ సింధుజలాల ఒప్పందంపై మరో మాటలేదని, వాటిని భారత భూభాగానికి మళ్లించాలన్న ఆలోచనలో మార్పులేదన్నారు. నీటికొరత ఉన్న ప్రాంతాలకు వాటిని తరలిస్తామని, వాటిపై సంపూర్ణ అధికారం భారతదేశానిదే, భారత రైతులకు మాత్రమేనని అన్నారు. ఆ ఒప్పందం పునరుద్ధరణ ఇక ఎప్పటికీ జరగదని, దీనిపై ఎప్పటికీ చర్చలు ప్రసక్తేలేదని ఆయన పాక్‌కు స్పష్టంచేశారు. అణుబాంబులకు భారత్ భయపడదనడానికి అంశాన్ని తేల్చిచెప్పామని, నీరు రక్తం కలిసి ప్రవహించవని మళ్లీ చెపుతున్నామన్నారు. ఉగ్రవాదం మానవాళి మనుగడకే ముప్పు అని పహల్గాంలో మతంపేరిట దాడిచేసిన ఉగ్రవాదులకు గట్టిగుణపాఠం చెప్పామన్నారు. యావద్దేశం ఆగ్రహంతో రగిలిపోయిందని, దానికి సమాధానంగానే ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిశత్రువును ఊహించనిరీతిలో దెబ్బకొట్టామన్నారు. శత్రుమూకలను మట్టుబెట్టే స్వేచ్ఛ త్రివిధ దళాలకే ఇచ్చామన్నారు.


శుక్రవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ దంపతులు, సిఎం రేవంత్, సిజె అపరేష్ కుమార్‌సింగ్

# రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్'

## హాజరైన సిఎం, బిఆర్ఎస్ దూరం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో గురువారం ఎట్ హోమ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,పొన్నం ప్రభాకర్ తదితర మంత్రులు హాజరయ్యారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు,ఐపిఎస్,ఐఏఎస్ అధికారులు, ఇతర నగర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మంత్రి వర్గ సహచరులను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పేరు పేరున పరిచయం చేశారు. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన నేతల వద్దకు వెళ్లి వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి పలకరించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఆ పార్టీ నుంచి ఒక ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్ రావును సీఎం రేవంత్ రెడ్డి పలకరించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మరోవైపు.. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నుంచి ఒక్క ప్రజాప్రతినిధి సైతం హాజరు కాలేదు. కాగా, శుక్రవారం నాడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పుట్టిన రోజు కావడంతో ఆయనను సిఎంతో సహా మంత్రులు, ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# వెయ్యేళ్లు చెప్పుకునేలా చేస్తా

>> నికే, దాన్ని నేను సద్వినియోగం చేసుకుంటున్నా అని చెప్పారు. అది ఫామ్ హౌస్‌లా వాడుకుని దావత్‌లు చేసుకునేందుకు కాదు.. 26 వేల కోట్లు రుణాలను 35 ఏళ్లకు 7.5 శాతం వడ్డీకి రీస్ట్రక్చర్ చేయించా, అలా 2 లక్షల కోట్ల రుణాలకు రీ స్ట్రక్చర్ కోసం ప్రధానిని కోరుతున్నా ఇదినా ఒక్కడి కోసం చేస్తున్నది కాదు.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే నా తాపత్రయం అని స్పష్టం చేశారు. తెలంగాణకు మరిన్ని విమానాశ్రయాలు తెచ్చుకోవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. మెట్రో, ఎయిర్ పోర్ట్, రీజనల్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రైల్ అనుమతులు అడిగినా రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు 11 కొత్త రేడియల్ రోడ్లు ఏర్పాటు చేయబోతున్నాం అని చెప్పారు. వాటర్, రోడ్డు కనెక్టివిటీ లేకుండా ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఎలా అభివృద్ధి అవుతుందన్నారు. హైదరాబాద్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్టు ఏర్పాటు చేయబోతున్నాం, ఇందుకోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం.. త్వరలోనే అనుమతులు రాబోతున్నాయన్నారు. తెలంగాణను మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నాం కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయబోతున్నామన్నారు. నీళ్లుండే చోటుకు మనం వెళితే నీళ్లు ఎక్కడికి వెళతాయి.. అందుకే హైడ్రాతో చెరువులను పునరుద్ధరిస్తున్నాం. నాలాల ఆక్రమణలు తొలగిస్తే ఒక పెద్దమనిషి సోషల్ మీడియా ద్వారా మాపై దుష్ప్రచారం చేస్తున్నారు దానికి మీరు మద్దతుగా నిలిస్తే మీకే నష్టం అని చెప్పారు. తెలంగాణ కోసం ప్రణాళికలు మేం సిద్ధం చేస్తాం.. మీరు ప్రమోట్ చేయండి ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉంది అని చెప్పారు. కులీ కుతుబ్ షా చార్మినార్ కట్టారు, ఔటర్ రింగ్ రోడ్డును వైఎస్ నిర్మించారు, హైటెక్ సిటీని చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేశారు.. వాళ్లు ఇక్కడ లేకపోయినా వారి పేర్లు చెప్పుకుంటున్నామని పేర్కొన్నారు. వారిని గుర్తు చేసుకుంటున్నాం సంపాదించింది ఎవరైనా తీసుకెళతారేమో కానీ సమాజానికి ఇచ్చింది ఎవరూ తీసుకెళ్లలేరు నాకు వేరే కోరికలేం లేవు.. హైదరాబాద్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దుతా.. భవిష్యత్ లో వందేళ్లు, వెయ్యేళ్లు చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. నాకు తెలంగాణను అభివృద్ధి చేయాలన్న చిత్తశుద్ధి, తపన ఉంది నాకు వయసు ఉంది, ఓపిక ఉంది.. అందరం కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం అని చెప్పారు.

# ఏదయా! యూరియా?

>> క్యూలైన్ పెట్టారు. చందుర్తి సహకార సంఘంలో యూరియా పంపిణీ విషయం తెలుసుకున్న రైతులు ఉదయమే చేరుకొని చెప్పులు క్యూ లైన్ పెట్టారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఒకవైపు అధికారులు ప్రకటనలు ఇస్తుండగానే యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. ఒక ఎకరానికి ఒకే బస్తా యూరియా మాత్రమే ఇస్తుండడంతో తీవ్ర ఇబ్బంది పడుతూ గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో యూరియా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా కేంద్రం వద్దకు పరుగులు తీశారు. భారీగా రైతులు రావడంతో పోలీసుల సమక్షంలో టోకెన్ చిట్టీలను అందజేసి రైతులకు ఆగ్రోస్ కేంద్రం వద్ద పంపిణీ చేశారు. ప్రభుత్వం సరిపడా యూరియా అందుబాటులో ఉంచడం లేదని రైతులు మండిపడ్డారు. తొగుట వ్యవసాయ సహకార సంఘం వద్ద ఉదయం 8 గంటల నుంచి రైతులు యూరియా కోసం క్యూలో నిరీక్షి ంచారు. గంటల పాటు లైన్‌లో ఉంటే ఒక పట్టా పాస్‌బుక్కు పైన రైతుకు రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇచ్చారు. కొందరు రైతులకు యూరియా దొరక్క పోవడంతో నిరాశతో వెనుదిరిగారు. భూంపల్లి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చిందని సమాచారం అందగానే ఆయా గ్రామాల రైతులు తరలివచ్చి క్యూకట్టారు. గంటల పాటు నిలుచుంటే పట్టా పాస్‌బుక్‌కు రెండు యూరి యా బస్తాలు మాత్రమే నిర్వాహకులు ఇచ్చారు. చాలామంది రైతులకు యూరియా బస్తాలు దొరక లేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇదేరకమైన ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు.

## రాష్ట్ర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు

**రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. కర్తవ్య దీక్షను జీవన సూత్రంగా తెలిపిన గీతాచార్యుడు కృష్ణుడు.. ధర్మాన్ని స్థాపించి, అధర్మాన్ని, అన్యాయాన్ని అంతం చేసిన పవిత్ర జగద్గురువు శ్రీకృష్ణుడు అని కొనియాడారు. అన్ని విషయాల్లో మనకు స్ఫూర్తినిచ్చే శ్రీకృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే.. ప్రతి అంశంలో విజయం సాధించవచ్చన్నారు.. శ్రీకృష్ణభగవానుడు ప్రజలకు ఆయు రారోగ్యాలు, సకల సౌభాగ్యాలు ప్రసాదించాలని మంత్రి కోరుకున్నారు. రాష్ట్ర ప్రజలందరిపై శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులు కృపా కటాక్షాలు ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## ఎంపి రఘునందన్‌రావుకు బెదిరింపు కాల్ కేసు టిజిసిఎస్‌బికి బదిలీ

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మెదక్ ఎంపి రఘునందన్ రావుకు మావోయిస్టుల పేరుతో వచ్చిన బెదిరింపు కాల్‌పై నమోదైన కేసును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిఎస్‌బి)కు బదిలీ చేశారు. జూన్ నెల 23వ తేదీన రఘునందన్ రావు శివార్లలోని దమ్మాయిగూడలో వుండగా ఆయన సెల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి చంపేస్తానంటూ బెదిరించాడు. ఇందుకోసం మధ్యప్రదేశ్ నుంచి మావోయిస్టుల బృందం కూడా బయలుదేరిందని, నీవు ఎక్కడ వున్నా చంపడం ఖాయమని ఫోన్ చేసిన వ్యక్తి హెచ్చరించాడు. కాగా ఈ ఫోన్ కాల్‌ను ఎంపి రఘునందన్ రావు రికార్డు చేసి రాచకొండ కమిషనరేట్‌లోని జవహర్‌నగర్ పోలీసులకు అందించి ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా దీనిని టిజిఎస్‌బికి బదిలీ చేస్తూ పోలీసు శాఖ శుక్రవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. ఇదే విధంగా ఈ నెల ఎనిమిదవ తేదీన బంజారాహిల్స్‌లో తన కుమారై నివాసంలో వున్న సమయంలోనూ రఘునందన్ రావుకు ఇదే రకంగా బెదిరింపులు రావడంతో దీనిపై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. రఘునందన్ రావుకు మూడు నెలల వ్యవధిలో ఆరుసార్లు పలు ఫోన్ల నుంచి ఇలా బెదిరింపులు రావడంతో ఈ మొత్తం వ్యవహారంపై నిగ్గు తేల్చాలని టిజిఎస్‌బికి పోలీసు శాఖ ఆదేశించింది.

## నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ అయ్యర్ కన్నుమూత!



**కోహిమా, ఆగస్టు 15:** నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ అయ్యర్ కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూనే తుది శ్వాస విడిచారు. చెన్నైలోని ఆసుపత్రిలో ట్రీట్ మెంట్ తీసుకుంటున్న గణేశన్ శుక్రవారం తనువు చాలించారని రాజ్‌భవన్ అధికారి తెలిపారు. ఆయన మరణవార్త తమను ఎంతో విషాదంలోకి నెట్టిందని ఉపముఖ్యమంత్రి యన్‌తుంగో పట్టోన్ అన్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు గవర్నర్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తున్నారు. నాగాలాండ్ గవర్నర్, లా గణేశన్ ఇకలేరనే విషయం తెలిసి చింతిస్తున్నాను. జీవితమంతా ప్రజ కోసమే పాటుపడిన ఆయన విలువలకు కట్టుబడి జీవించారు. అంతేకాదు ప్రజా శ్రేయస్సు, సంక్షేమం విషయంలో ఏమాత్రం రాజీపడలేదాయన' అని నాగా లాండ్ ఉప ముఖ్యమంత్రి యన్‌తుంగో పట్టోన్ ట్వీట్ చేశారు. ఈ నెల 8న గణేశన్ చెన్నైలోని తన నివాసంలో కిందపడిపోయారు. ఆ సమయంలో ఆయన తలకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబసభ్యులు గవర్నర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు ఐసీయూలో చేర్పుకున్నారు. వారం రోజులుగా ఐసీయూలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే శుక్రవారం ఒక్కసారిగా ఆరోగ్యం విషమించడంతో గణేశన్ కన్నుమూశారు. ఆయన రెండేళ్లక్రితం అంటే ఫిబ్రవరి 12న నాగాలాండ్ 21వ గవర్నర్‌గా నియమితులయ్యారు. 1945 ఫిబ్రవరి 16న తంజావూరులో జన్మించిన గణేశన్ చిన్నవయసులోనే ఆర్ఎస్సెస్ భావజాలంతో కొనసాగారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేళ పెరేడ్‌గ్రౌండ్స్, గోల్కొండకోట వద్ద భారీభద్రత

**పోలీసు విభాగాల్లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు**

**డిజిపి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అదనపు డిజి అనిల్‌కుమార్**

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెరేడ్‌గ్రౌండ్స్‌తో పాటు గోల్కొండకోట వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. పెరేడ్ గ్రౌండ్స్‌లో అమరవీరుల స్తూపం వద్ద సిఎం రేవంత్‌రెడ్డిసహా ప్రముఖులు, త్రివిధదళాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరవడంతో ఉదయం నుంచే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీని తరువాత రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికా రికంగా పంద్రాగస్టు వేడుకలు జరిగిన గోల్కొండ కోట వద్ద కూడా ఇంతే స్థాయిలో భద్రతను కల్పించారు. గోల్కొండకోటలో జాతీయ పతాకాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ఎగుర వేశారు. దీంతో పాటు రాజ్‌భవన్ సహా ఇతర ప్రాంతాలలోనూ భద్రతను పటిష్ఠం చేశారు. మరోవైపు రాష్ట్ర పోలీసు విభాగాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డిజిపి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో అదనపు డిజి పర్సనల్ అనిల్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఐజి రమేష్, ఏఐజి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. దీంతోపాటు లక్డికాపూల్‌లోని నిఘా విభాగం, బంజారా హిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల సిటీ పోలీసు కమిష నరేట్, నేరేడ్‌మెట్‌లో గల రాచకొండ కమిషనరేట్, గచ్చిబౌలిలో గల సైబరాబాద్ కమిషనరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా విభాగాల్లో ఉన్నతాధికారులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

# శ్రీశైలం డ్యామ్‌కు స్థిరంగా వరద

**3 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**

**కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి**

**జూరాల 18 గేట్లు ఎత్తివేత**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 15, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయానికి వరద స్థిరంగా కొనసాగుతున్నది. సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో 3గేట్లు 10అడుగుల మేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6గంటల సమాచారం మేరకు శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 34,590క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1,13,920క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 12,621 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,61,381 క్యూసెక్కులు దిగువకు విడుదల వుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గానూ 882.10 అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు ప్రస్తుతం 199.2737 టీఎంసీలకు చేరింది. డ్యాంకు 1,80,688 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతు న్నది. విద్యుత్ ఉత్పత్తి కోసం 66,242 క్యూసె క్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసా గుతున్నది. అదేవిధంగా ఉమ్మడి పాలమూరులోని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. ఎగు వన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద పోటె త్తుతున్నది. దీంతో 18 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1,45,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరా లలో 5.161 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 34,590 క్యూ సెక్కులు, స్పిల్‌వే ద్వారా 1,26,954క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జూరాల నుంచి 1,61,591 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.



సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేసిన దృశ్యం

## సింగూరు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

**ఇన్‌ఫ్లో 11,083 క్యూసెక్కులు**

**పుల్‌కల్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు పెద్దఎత్తున వరద నీరు చేరుకుంటుండటంతో ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాలకు శుక్రారం ప్రాజెక్టులోకి వరద ఉధృతి అంత కంతకూ పెరుగుతూ వస్తోంది. వరద ప్రవాహం అధికంగా ఉండటంతో గురువారం 11వ నెంబర్ క్రెస్ట్‌గేట్‌ను ఎత్తిన నీటి పారుదల శాఖ అధికారులు, దిగువకు వరద ఉధృతి ఎక్కువ కావడంతో శుక్రవారం ఉదయం 9.55 గంటలకు 9వ నంబరు క్రస్ట్ గేట్‌ను 2 మీటర్లకు, సాయంత్రం 6 గంటలకు 8వ నంబరు క్రెస్ట్‌గేట్‌ను 1.5 ఎత్తు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 8,9, 11వ నంబర్ క్రస్ట్ గేట్ల ద్వార 25,433 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తికి ఉత్పత్తి కేంద్రంలోని రెండు టర్బైన్ల ద్వారా 2,491 క్యూసెక్కులు వదులుతున్నారు.మొత్తం 28,557 క్యూ సెక్కులు అవుట్‌ఫ్లో నమోదయింది. పూర్తిస్థాయి నీటి నిల్వలు చేస్తే ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందంటూ డ్యాంసేఫ్టీ అధికారులు నివేదిక నేపథ్యంలో అధికారులు 22 టిఎంసిల మేరకు నీటి నిల్వలు చేస్తూ వచ్చిన వరదను వచ్చినట్లుగా మంజీర జలాశయానికి వదులుతున్నారు.సింగూరు,మంజీర జలాశయాల గేట్లు ఎత్తడంతో వరదనీటి ప్రవాహంతో మంజీర నది ఉధృతంగా పరవళ్లు తొక్కుతోంది.

# ఐడిఎఫ్ దాడుల్లో హమాస్ సీనియర్ నేత హతం!



**గాజాసిటీ, ఆగస్టు 15:** గాజా హస్తగతమే లక్ష్యంగా సాగిస్తున్న ఇజ్రాయెల్ దాడులు రోజురోజుకూ ఉధృతం అవుతున్నాయి. ఐడిఎఫ్‌తోపాటు మొస్సాద్ విభాగాలు ఒక్కసారిగా మూకుమ్మడి దాడులు చేస్తోంది. తాజాగా గాజా స్ట్రిప్‌లో హమాస్‌కు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ భద్రతా దళాలు (ఐడీఎఫ్) దక్షిణ గాజాలో వైమానిక దాడి జరిపాయి. ఖాన్ యూనిస్ ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో హమాస్‌కు చెందిన సీనియర్ నేత నాసెర్ మోస్సాను అంతంచేసారు. ఈనెల 9న జరిగిన ఈ దాడి ఒక వ్యూహాత్మక ఆపరేషన్‌గా సాగింది. ఐడీఎఫ్ సైన్యం, షిన్ బెట్ నిఘా విభాగం కలిసి ఈ దాడిని అమలు చేశాయి. దాడితాలూకు వీడియో ఫుటేజీని కూడా ఇజ్రాయెల్ విడుదల చేసింది. నాసెర్ మోస్సా హమాస్ రఫా బ్రిగేడ్‌కు అత్యంత కీలకమైన నేత. అతను ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తుండేవాడు. పైగా, ఇజ్రాయెల్‌పై దాడుల కోసం వ్యూహాలు రూపొందించే వ్యవహారంలో ముందుండేవాడు. మోస్సా గతంలో హమాస్ గూఢచారి విభాగంలో పనిచేశాడు. అలాగే, రఫా బ్రిగేడ్ నిఘా వ్యవస్థ లోనూ కీలక పాత్ర పోషించాడు. అతని మృతితో హమాస్ కార్యకలాపాలు మందగిస్తాయని ఐడీఎఫ్ పేర్కొంది.ఈ దాడికి ముందు రోజు కూడా ఇజ్రాయెల్ దళాలు ఒక రాకెట్ నిల్వ కేంద్రాన్ని ధ్వంసం చేశాయి. ప్రస్తుతం గాజా మొత్తం మీద భూతల, వైమానిక దాడులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఖాన్ యూనిస్‌లో హమాస్ స్థావరాలు ధ్వంసమవుతుండగా, ఉత్తర గాజాలో సొరంగాలను గుర్తించి పేల్చుతున్నారు. ఈ చర్యలు ఉగ్రవాద శక్తులను నిర్మూలించడమే లక్ష్యంగా సాగుతున్నాయని ఐడీఎఫ్ పేర్కొంది.

## మంత్రాల నెపంతో నిజామాబాద్‌లో మహిళను గుంజకు కట్టేసిన వైనం

**నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు**

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మంత్రాల నెపంతో ఓ మహిళను ఆమెకు సమీపబంధువులే గుంజకు (రోడ్డు పక్కనున్న దుడ్డుకర్రకు) కట్టేసిన అమానవీయ ఘటన నిజామాబాద్‌లో వెలుగుచూసింది. జిల్లాలోని మోపాల్ గ్రామానికి చెందిన సవితకు ఆమె ఇంటికి సమీపంలో వుండే పెరిక పోశెట్టితో భూమికి సంబంధించి చిన్నపాటి వివాదం వుంది. వివాదంలో వున్న ఈ భూమిలో సవిత తోటి కోడలు లక్ష్మి పశువులను కట్టేస్తుంది. గతంలో గేదెలు, గొర్రెలు తమ ఇంట్లో వచ్చి బియ్యాన్ని పాడు చేశాయని, ఇదే తరహాలో మంగళవారం రాత్రి మళ్లీ పశువులు ఇంట్లోకి వచ్చా యని లక్ష్మికి చెప్పేందుకు సవిత ఆమె ఇంటికి వెళ్లింది. ఈ సందర్భంగా సవితపై లక్ష్మి తల్లి దుర్భాషలాడడంతోపాటు నీవు మంత్రాలు చేస్తున్నావని ఆరోపించింది. దీంతో ఆగ్రహం చెందిన సవిత ఒక గేదెను సమీపంలోని ఆంజనేయ దేవాలయం వద్ద గల గుంజకు కట్టేసి, ప్రమాణం చేయాలని నిలదీసింది. దీంతో ఆగ్రహం చెందిన లక్ష్మితోపాటు ఆమె భర్త గంగాధర్, వారి కుమా రుడు, కోడలు ఇతర కుటుంబసభ్యులు గుంజకుకట్టేసిన గేదెను వదిలివేసి సవితను కట్టేశారు. సవిత కుటుంబ సభ్యులకు తెలిసి వారంతా వచ్చి సవితను విడిపించి దీనిపై నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్యను కలిసి ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఈ ఘటనపై వెంటనే విచారణ చేయడంతోపాటు మహిళను గుంజకు కట్టేసిన నలుగురిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# అంగన్‌వాడీ గుడ్ల సరఫరా.. పాతవారికే దక్కిన టెండర్లు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేసే విషయమై అత్యధికంగా పాత కాంట్రాక్టర్లకే టెండర్లు దక్కాయి. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో అధికారులు టెండర్లు తెరిచారు. మరో రెండు జిల్లాల్లో టెండర్లు తెరచి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాల్సి ఉంది. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఇక టెండర్లు దక్కించుకున్న వారిలో ఏడుగురు కాంట్రాక్టర్లు పాత వారు కాగా, కొత్తగా ఇప్పుడు మరో ముగ్గురు పౌల్ట్రీ యజమానులు ఉన్నారు. కాగా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఈ ఏడాది మార్చి 30న జోనల్ స్థాయి టెండర్లు పిలిచింది. గుడ్ల పంపిణీలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ టెండరు నిబంధనలు కొత్తగా రూపొందించింది. అయితే ఈ నిబంధనలు కేవలం పెద్దలకు, ప్రస్తుతం పంపిణీ చేస్తునన పాత కాంట్రాక్టర్లకే అనుకూలంగా ఉన్నాయంటూ పౌల్ట్రీ యజమానులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పలుమార్లు టెండరు గడువును పొడిగిస్తూ వచ్చిన అధికారులు మూడున్నర నెలల తర్వాత టెండర్లను రద్దు చేశారు. తదుపరి మార్పులు చేసి జిల్లా స్థాయిలో జిల్లా కమీటీ నేతృత్వంలో టెండర్లు పిలిచి, వాటిని ఇప్పుడు ఫైనల్ చేశారు.

# మెరుపు వరదలొస్తే నష్టం అపారమే!

**ఉత్తరాది వరదలు రాష్ట్రానికి ఓ హెచ్చరిక**

**నదుల పరీవాహకాల్లో భారీగా కబ్జాలు**

**హైదరాబాద్‌లో కనుమరుగవుతున్న మూసీ**

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ఉత్తరాది రాష్ట్రాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాల వల్ల సంభవించిన వరదలు తెలం గాణకు హెచ్చరికగా నిపుణులు అభివర్ణించారు. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరఖండ్, జమ్మూ కాశ్మీర్‌లలో వరదల వల్ల నదీ తీర ప్రాంతాలలోని బహుళ అ ంతస్తుల భవనాలతో పాటు అనేక ఇళ్లు పేకమేడలను తలపించే విధంగా కుప్పకూలి వరదనీటిలో కొట్టుకు పోవడం తెలిసిందే. ఈ దుర్ఘటనల్లో పదు ల సంఖ్యలో ప్రజలు మరణించగా వందల సంఖ్యలో గల్లంతవడం విదితమే. రాష్ట్రంలో అంతటి వరదలు వచ్చే అవకాశాలు లేకున్నా ఈ ఏడాది ఇ ప్పటికే కొన్నిచోట్ల క్లౌడ్ బరస్ట్‌తో కురిసిన కుంభవృష్టి వానల కారణంగా అనేక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. క్లౌడ్ బరస్ట్‌లు మరిన్ని సంభవిం చి భారీ వరదలు వస్తే ఇక్కడ కూడా కృష్ణా, గోదావరి సహా పలు నదీ తీరాల్లో వున్న భవనాలకు ముప్పువాటిల్లడం ఖాయంగా నిపుణులు చెబుతునా న్రరు. హైదరాబాద్ వరకే వస్తే మూసీ నది నానాటికీ కుంచించుకు పోతూ కనుమరుగవుతున్న విషయాన్ని వారు ఉదహరించారు. మూడేళ్ల క్రితం అ క్టోబర్ నెలలో మూడు రోజుల పాటు మూసీ నది ఉగ్రరూపం దాల్చిన విషయాన్ని వారు ఎత్తిచూపారు. రెండు వేల సంవత్సరంలో హైదరాబాద్‌లో సంభవించినట్లుగా భారీ వరదలు తలెత్తితే పరిస్థితులు భయంకరంగా వుంటాయని నిపుణులు హెచ్చరించారు.

రాష్ట్రంలో గడచిన నాలుగేళ్లుగా జూన్ నెల నుంచే భారీ వర్షాలు కురవడం మొదలై నవంబర్ నెల వరకు కొనసాగడం తెలిసిందే. అయితే ఉత్తరాది రాష్ట్రాలను కొన్ని రోజులుగా వణికిస్తున్న భారీ వరదలు రాబోయే రోజుల్లో తెలంగాణను కూడా ఇబ్బందిపెట్టే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో నైరుతీ రుతుపవనాలు చురుకుగా వుండడం, దీనికి తోడు బంగాళా ఖాతంలో వాయుగుండాలు ఏర్పడుతు ండడంతో పది రోజులుగా వరుసగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో వానా కాలంలో వరదలు తలెత్తితే తట్టుకునేందుకు పౌర విభాగాలు సిద్దంగానే వున్నాయని సర్కారు చెబుతోంది. అంతవరకు భాగానే వున్నా ఉత్తరాదిలో సంభవించిన ఆకస్మిక వరదల తరహాలో రాష్ట్రంలో నదీ పరీవా హక ప్రాంతాలలో తలెత్తితే పరిస్థితి భిన్నంగా వుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఉత్తరఖండ్‌లో కురిసిన క్లౌడ్‌బరస్ట్ కారణంగా దరాళి అనే గ్రామం నామ రూపాల్లేకుండా పోగా వంద మంది వరకు గల్లంతయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లోని కిష్టావర్ జిల్లాలో గురువారం ఇదే తరహాలో కురిసిన కుంభవృష్టికి అనేక ప్రాంతాలు కొట్టు కుపోగా 60 మంది మరణించారు. 500 మంది వరకు గల్లంతయ్యారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల విషయం ఎలావున్నా హైదరాబాద్ మధ్య నుంచి వెళు తున్న మూసీ నది పరీవాహక ప్రాంతం, తీర ప్రాంతం గురించి పరిశీలిస్తే ఈ నదికి రెండు వైపులా అంతటా కబ్జాలే కనిపిస్తున్న విషయాన్ని నిపుణులు ఉదహరించారు. మూసీ నదికి రెండు వైపుల కబ్జాలు అందరికి తెలిసిన విషయమే అయినా ఈ కబ్జాలు ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతూనే వుండడం మరో విశేషం. గండిపేట్, హిమాయత్‌సాగర్ మొదలు కొని హయత్‌నగర్ దాటే వరకు ఈ కబ్జాలు బహిరంగ రహస్యమే అయినా వీటిని ఎవరూ ఆపకపోవడం మరో విశేషం. 2022 అక్టోబర్ నెలలో జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, గండిపేట్‌కు భారీ వరదలు సంభవించి వరద నీటిని దిగువకు వదిలినపుడు మూసీ నది మూడు రోజుల పాటు ఉగ్రరూపం దాల్చి ఈ నదిలో వున్న కబ్జాలన్నీ కొట్టుకు పోయాయి. చాదర్‌ఘాట్ కాజ్‌వేతోపాటు మలక్‌పేట్, మూసారాంబాగ్ బ్రిడ్జి చాలా వరకు ధ్వంసమయ్యింది. దీంతోపాటు ఇతర చోట్ల మూసీ నదికి రెండు వైపులను కలిపి నిర్మించిన చిన్నపాటి వంతెనలు కొట్టుకు పోయాయి. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

**2,000 సంవత్సరం తరహా వరదలొస్తే భారీ మూల్యం తప్పదు: నిపుణులు**

ఇదిలా ఉండగా ఉత్తరాది రాష్ట్రాలలో వచ్చినట్లుగా లేదా రెండు వేల సంవత్స రం తరహాలో భారీ వరదలు సంభవించినట్లుగా హైదరాబాద్‌ను భారీ వర్షాలు ముంచెత్తితే భారీ మూల్యం తప్పదని నిపుణులు హెచ్చ రించసాగారు. ముఖ్యంగా రెండు వేల సంవత్స రంలో కురిసిన భారీ వర్షం వల్ల ట్యాంక్‌బండ్ ఉప్పొంగడంతో దాని దిగువన వున్న అశోక్‌నగర్ నాలా ఒక్కసారిగా పొంగి అనేక బస్తీలు దాదాపు వారం రోజుల పాటు నీట మునిగాయి. ఉత్తరాదిలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల మాదిరిగా హైదరాబాద్‌లో వానలుపడితే పరిస్థితి ఏమిటనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.



## అమెజాన్ అధినేత మాతృమూర్తి కన్నుమూత

**వాషింగ్టన్, ఆగస్టు 15:** ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా పేరుగాంచిన అమెజాన్ అధినేత జెఫ్‌బెజోస్ మాతృమూర్తి కన్నుమూసారు. 14వ తేదీ తన తల్లి జాక్లిన్ గిస్‌బెజోస్ తమను వీడి వెళ్లిపోయారని అమెజాన్ వ్యవస్థాపకులు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసారు. 78 యేళ్ల వయసులో లెవీబాడీ డిమెన్షియాతో కన్నుమూసారు. లెవీబాడీ డిమెన్షియా అనే మెదడు సంబంధిత వ్యాధితో సుదీర్ఘ పోరాటం తర్వాత ఆమె మరణించారని తెలిపారు. ఆమెను ప్రేమించేవారు మనలో చాలామంది ఉన్నారని, ఆమెను ఎప్పటికీ నా గుండెల్లోనే దాచుకుంటానని ఐ లవ్‌యూ అమ్మ అంటూ బెజోస్ ఉద్వేగంగా పోస్టు చేసారు. 1946 డిసెంబరు 29న వాషింగ్టన్ డిసిలో జన్మించిన జాక్లిన్ న్యూమెక్సికోలోని బెర్నాలి, అల్బుకెర్కీలలో పెరిగారు. చదువుకునే వయసులోనే టెడ్ జోర్గెన్సెన్‌తో బిడ్డకు జన్మనిచ్చింది. రాత్రివేళ స్కూలులో చదువుతూ పగటిపూట పనిచేస్తూ జెఫ్‌ను పెంచింది. అయితే వీరు విడిపోయారు. 1968లో ఆమె క్యూబా వలసదారు మిగ్యుల్‌మైక్ బెజోస్‌ను పెళ్లాడింది. అతడు జెఫ్‌ను దత్తత తీసుకున్నాడు. తర్వాత జాక్లిన్ మైక్ జంటకు మార్క్, అండ్‌క్రిస్టినా అనే పిల్లలు జన్మించారు. బెజోస్ స్వయంకృషితో ఎదిగి అమెజాన్‌ను స్థాపించారు.

## జిఎస్టీ మోసం కేసులో స్టీల్ మేనేజింగ్ పార్ట్‌నర్ అరెస్టు

**కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్**

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్ర జీఎస్టీ అధికారుల ఫిర్యాదు మేరకు, సీసీఎస్ పోలీసులు అంబికా స్టీల్ మేనేజింగ్ పార్ట్‌నర్‌ను అరెస్ట్ చేసినట్లు కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దర్యాప్తులో, నిందితుడు సరుకుల వాస్తవ రవాణా లేకుండా ఈవే బిల్లులు సృష్టించి, నకిలీ ఇన్వాయిస్‌లు జారీచేసి, తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు తేలిందని,ఈ చర్యలు జీఎస్టీ చట్టానికి విరుద్ధమన్నారు.ఈ కేసులో 2025 జూలై 30న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో, జూన్ 2025 నుండి కదలికలేని, ఇప్పటికే అధికారులు స్వాధీనం చేసుకున్న ఏపి 29 టిఏ 7213 నంబరు గల వాహనాన్ని పలువురు పన్ను చెల్లింపుదారులు అనధికారికంగా ఉపయోగించి, సరుకుల రవాణా చేయకుండా అనేక ఈవే బిల్లులు సృష్టించినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు.ఎఫ్ఐఆర్ నమోదైన తరువాత,నిందితులు కేసును రద్దు చేయించుకోవడానికి హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేసిందన్నారు. పిటిషన్ రద్దు అనంతరం, గోవాకు పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు వారిని పట్టుకొని అరెస్ట్ చేసినట్లు తెలి పారు. ఈ కేసులో మరికొందరు నిందితులు ఇంకా పరారీలో ఉండగా, వారిని పట్టుకు నేందుకు పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నారని, దర్యాప్తు జరుగుతోందని రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ తెలిపారు.

# ఆర్‌టిసి సేవామూర్తులకు బస్‌భవన్‌లో ఘనంగా సన్మానం



**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా**

**ఉద్యోగులను సన్మానించిన ఎండి విసి సజ్జనార్**

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్‌టిసి సంస్థలో సమర్థ వంతంగా విధులు నిర్వహిస్తూనే సమాజ సేవ చేస్తున్న పలువురు ఉద్యోగులను టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మా నించింది. ఖమ్మం డిపో కండక్టర్ ఏ.అనిత, కరీంనగర్ జోనల్ వర్క్ షాప్ స్టోర్ అటెండెంట్ పి.సత్యనారాయణ, బస్‌భవన్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ బి. రాములు, కంటోన్మెంట్ డిపో డ్రైవర్ ఎం.రాములును ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండి విసి సజ్జనార్ సత్కరించి.. వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంస్థ ఎండి విసి సజ్జనార్ జాతీయ పత కాన్ని ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్ర్య వేడుకల్లో ఇడిలు మునిశేఖర్, వెంకన్న, సీటీఎంలు శ్రీధర్, శ్రీదేవి, సీపీఎం ఉషాదేవి, సీసీవోఎస్ ప్రభులత, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. సంస్థ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజా రవాణా వ్యవస్థను ఆదరిస్తున్న ప్రయాణికులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జాతిపిత మహాత్మ గాంధీ, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి త్యాగమూర్తుల ఫలితంగా భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పౌరుడు దేశ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ ఉద్యమంలో ఆర్‌టిసి ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని.. బస్ కా పయ్యా నహీ ఛలేగా" అంటూ ఉద్యమంలో ముందుండి పోరాడారని గుర్తు చేశారు. విధి నిర్వహణలోనూ సిబ్బంది ఉద్యమ స్ఫూర్తిని కనబరు స్తున్నారని అన్నారు. సంస్థను తమ కుటుంబం లాగా భావిస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం వల్లే ఎన్నో విజయాలు నమోదవుతు న్నాయని సంతోషం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలోనే కాదు.. సమాజ సేవలోనూ సిబ్బంది ముందంజలో ఉండటం అభినందనీయని కొనియాడారు. వారిని ఆదర్శంగా తీసుకుని సంస్థలో మరింతమంది సమాజ సేవకులుగా తయారయ్యాలనే ఉద్దేశంతోనే సేవా మూర్తులకు సన్మానం చేయాలనే సంప్రదాయానికి సంస్థ శ్రీకారం చుట్టిందని తెలిపారు. కండక్టర్ అనిత తన భర్త రవిచందర్‌తో కలిసి తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం నిస్వార్థమైన సేవలు అందిస్తున్నారు. వారి కోసం రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్తాన్ని సమకూర్చుతున్నారు. తలసేమియాతో బాధపడుతున్న 248 మంది చిన్నారులకు రక్తాన్ని అందజేశారు. ఆమె సేవను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 5 సార్లు ఉత్తమ వలంటీర్ అవార్డును అందజేసింది. సంస్థలో విధులు నిర్వహిస్తూనే పి.సత్యనారాయణ స్వచ్ఛందంగా మొక్కలు నాటుతున్నారు. కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్య ప్రదేశాలలో గత 10 ఏళ్ల కాలంలో లక్షకుపైగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. పచ్చదనాన్ని పెంపొందించాలన్న తన లక్ష ్యం గొప్పదని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వ అటవీ శాఖ.. హరిత మిత్ర అవార్డుతో సత్కరించింది. బొషపాక రాములు తన సతీమణితో కలిసి రాజేశ్వరీ సోషల్ సర్వీస్ సొసైటీ పేరుతో అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి నిరాశ్రయులైన అనాథలకు, శారీరక, మానసిక వికలాంగులకు ఆశ్రమం కల్పించి వారి బాగోగులు చూస్తున్నారు. తన నెలవారీ జీతంలో నుంచి కొంత మొత్తాన్ని అనాథలు, వికలాంగుల కోసం వెచ్చిస్తున్నారు. డ్రైవర్ ఎం. రాములు మహాకవి సినారె కళాపీఠం సంస్థను నెలకొల్పి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కవులకు సహాయ, సహకారాలు అందిస్తూనే మాతృ సంస్థయైన ఆర్‌టిసిలోని ప్రమాద రహిత డ్రైవర్లను సత్కరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. తాను చదివిన పాఠశాలను 2001 నుంచి దత్తత తీసుకుని అక్కడి పేద, అనాథ విద్యార్థులకు ఫీజు సహాయం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపారు.

వార్త

మనం ఎలక్ట్రానిక్స్ సమాచారం, కంప్యూటర్ల యుగంలో జీవిస్తున్నాం. రాబోయే పది సంవత్సరాల్లో ప్రపంచంలో ప్రతి వస్తువు మారిపోతుంది. ఆ ప్రపంచం కోసం ఇప్పటి నుంచే సంసిద్ధం కావడం తప్పనిసరి.

-ఎ.బెర్గ్

# ‘ఓటు’ హక్కు పారదర్శకత ప్రధానం!

ఓట్లపై సర్వాధికారాలు స్వయంప్రతిపత్తి ఉన్న ఎన్నికల కమిషన్‌కు కొత్త చిక్కొచ్చిపడింది. బీహార్ ఎన్నికలకు ముందే బీహార్ బీమార్ పట్టుకున్నట్టుంది. బీహార్‌లో ఇటీవల చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియలో లోపాలు సుప్రీంకోర్టు ముందుకొచ్చాయి. పద్ధతి, పాడు లేకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) నిర్వహించి తొలగించిన 65 లక్షల మంది పేర్లనూ వెల్లడించాలని,ఎందుకు తొలగించారో కారణాలు, వారి చిరునామాలు సైతం బహిరంగపరచాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీం ఆదేశించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం జిల్లాల వారీ ఎన్నికల అధికారులు తమతమ వెబ్‌సైట్లతోపాటు బీహార్ ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో కూడా ఆగస్టు 19లోగా ఈ వివరాలు అందించాల్సిందేనని స్పష్టంగా చెప్పింది. నిన్నమొన్నటి వరకు ఈ వివరాలను తాము ఎవరికీ ఇవ్వక్కర్లేదని, తామే ఫైనల్ అంటూ ఎన్నికల సంఘం భీష్మించుకు కూర్చొంది. విపక్షాలు తాము పట్టిన పట్టు విడవకుండా తాడోపేడో తేల్చుకోవాలని చూడటం వల్లనే జరుగుతున్న విధానపర లోపాలను బయట పెట్టగలిగింది. పిటీషన్‌లలో ‘ది అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్’ వారి అభ్యర్థన మేరకు జాబితా నుంచి తొలగించిన వారిపేర్లను ప్రచురించేందుకు తొలుత ఎన్నికల సంఘం అంగీకరించలేదు. కాలానుగుణంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు సవరణలు చేపట్టే బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. కాగా గుర్తింపు కార్డుల విషయంలో తకరారు పెట్టిన కమిషన్ తరపున తాజాగా కొత్త వాదనలు తెరపైకొస్తున్నాయి. పారదర్శకంగా ఉండాల్సిన ఎన్నికల సంఘం నిర్వంద్వంగా విపక్షాల వాదనను అంగీకరించకపోవడమే అసలు చిక్కు. సుప్రీంకోర్టు కూడా అదే చెప్పింది. ఇ.సి. మీద నమ్మకం లేకపోవడం వల్లనే రకరకాల అనుమానాలు తలెత్తుతున్నాయని మరణించిన వారి ఓట్లను తొలగించినప్పుడు, వేర్వేరు ప్రాంతాల్లో ఒకే వ్యక్తికి ఓట్లున్నప్పుడు, వేరే అసెంబ్లీ నియోజకవర్గాల్లో శాశ్వత స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారి జాబితాలుంటే బహిర్గతం చేయవచ్చు కదా! అని ఎన్నికల కమిషన్‌ను సుప్రీం న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఇవన్నీ బహిర్గతం చేసి ఆగస్టు 22న నివేదికను సమర్పించాల్సి ఉంటుందన్నది తేటతెల్లం. ఎలక్షన్ ఫొటో, ఐడెంటిటీ కార్డు (ఎపిక్) నంబరుతో ఆ జాబితాలో తమ పేరును వెతుక్కోగలిగేలా సెర్చ్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంచాలని సూచించింది. ఇలా పారదర్శక విధానం ద్వారా ఓటర్లలో నమ్మకం కలిగించవచ్చునని ధర్మాసనం పేర్కొంది. ఈ జాబితాలను రాజకీయ పార్టీలకు ఇచ్చామన్న ఎన్నికల సంఘం వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. రాజకీయ పార్టీలు, కార్యకర్తలపై ఓటరు తమ ఓటు హక్కును గుర్తించేందుకు ఆధారపడాల్సి రావడం సరైన విధానం కాదని ధర్మాసనం తేల్చింది. వెబ్‌సైట్‌లలో జాబితాలను పెట్టి పారదర్శకంగా వ్యవహరించమని ధర్మాసనం కోరింది. ఈ అనుమానాల నేపథ్యంలో ఓటు హక్కును ఏయే కారణాల చేత తొలగించారో విషయం తెలిస్తే ఆయా ఓటర్లు రెక్టిపై చేసుకునే అవకాశాన్ని తీసుకుంటారు. తొలగించిన జాబితా స్థానిక,ఇంగ్లీషు వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్, మీడియాలో ప్రచురణ చేయాలంటూ ఆదేశించింది. ఇవన్నీ పారదర్శకతకు మార్గాలే. నిజానికి ఈసారి ఎన్నికల కమిషన్ ఎందుకో విపక్షాల సందేహాలను తీర్చేందుకు పారదర్శకత విధానంలో జాబితాలను వెబ్‌సైట్‌లో ఉంచేందుకు కాస్త వెనుకబాటుతనాన్ని ప్రదర్శించింది. ఇందులో ప్రత్యేకించి అంతరార్థమేదీ లేకున్నా ఏదో దాయాలన్న ఆలోచనలో ఉందనే అభిప్రాయం మరింత బలపడే విధంగా వ్యవహరించింది. అందువల్లనే విషయం సుప్రీం కోర్టు వరకు చేరింది. తమ ఓట్లు గల్లంతైందని అనుకున్న వారు తగు ఆధారాలతో వెబ్‌సైట్‌లోకి వెళ్లి వెతుక్కొని కారణాలుంటే ఓటరు పోలింగ్ అధికారులందరికీ అందుబాటులో ఉండే అవకాశం లేని ధ్రువపత్రాలు ఎన్నుంటే ఏం,అసలు సిసలైన ఆధార్ ధ్రువీకరణ పత్రం లో ఆ జాబితాలో లేనప్పుడు అన్నది విపక్షాల మాట. కర్ణాటకలోని మహదేవ్‌పురం నియోజకవర్గంలో లక్ష నకిలీ ఓట్లను గుర్తించామని రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో ప్రకటించిన మరునాడే ‘సెర్చ్ ఆప్షన్’లు తీసేసారు. ఇదో కొత్త సందేహం.తమ ఓట్లు గల్లంతైందని అనుకున్న వారు తగు ఆధారాలతో వెబ్‌సైట్‌లోకి వెళ్లి వెతుక్కొని కారణాలుంటే ఓటరు పోలింగ్ అధికారుల వద్ద కెళ్లి తగు ధ్రువీకరణ పత్రంగా సమర్పించి ఓట్లను పునరుద్ధరించుకోవచ్చు. ఈ తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఓట్ల దొంగలకు సందేశంగా అభివర్ణించింది. ఒక పక్క ఓటు చౌర్యం జరిగిందంటూ రాహుల్ గాంధీ గొంతెత్తగానే ‘ఓటు చౌర్యం’ అని అనడానికి వీల్లేదని, ఇతరత్రా సందేహాలుంటే అడగాలని ఎన్నికల సంఘం కోరింది. ప్రజల ఓటు హక్కు కోల్పోనివ్వబోమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే స్పష్టం చేశారు.బీహారులో ‘సర్’ ఓటర్ల సవరణ జాబితా విషయంలో కాంగ్రెస్ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో ఒక సంతృప్తికరమైన పరిష్కారం లభించినట్లైంది. పార్లమెంటులో, బీహార్‌లో ఓట్ల సవరణ ప్రక్రియలో అవకతవకల విషయమై రాహుల్ గాంధీ చర్చ పెట్టమంటే స్పీకర్ వాయిదాలతో కాలం గడుపుతున్నారని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం బీహార్ విషయంలో సృష్టించిన సమస్యకు తెరపడడం ప్రజాస్వామ్యవాదుల విజయంగా భావిస్తున్నారు.ఇకపై బీహార్ నుంచి రాహుల్ గాంధీ ‘ఓటర్ అధికార్ యాత్ర’కు మార్గం సుగమం.

పరుగెత్తేవారు వెనక్కి చూడకుండా ఎలా పరుగెడతారో, విజయం వైపు పయనించేవారు కూడా ముందుకే కానీ వెనక్కి చూడకూడదు.



ఆస్కార్ వైల్డ్

చదవగలిగిన వాడికి, ధ్యానం చేయగలిగిన వాడికి సాయం కాలాలు సరదాగా గడుస్తాయి. జీవితం విసుగ్గా ఉండదు.



లోవెల్

# ప్రజావాక్కు



### శునకాలపై సుప్రీం తీర్పు సమంజసమే

పట్టణాలు, పల్లెల్లో గ్రామ సింహాలు హల్చల్ చేస్తూ చిన్నాపెద్దా అనకుండా అందరినీ వెంబడిస్తూ మూగజీవుల్నే కాక చిన్నపిల్లలను కూడా కుక్కలు చింపిన విస్తర్లలా చీరేస్తూ చంపుకు తింటూ,భయభ్రాంతులకు గురి చేస్తున్న విషయం ప్రతిదినం మాధ్యమికాలద్వారా, ప్రత్యక్షంగానూ మనం గమనిస్తూనే ఉన్నాం.భారతఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శునకాల గురించి ఇచ్చిన తీర్పు అందరికీ ఆమోదయోగ్యమే.కాని జంతు ప్రేమికుల పేరుతో రోడ్డుల మీదకు వచ్చి ర్యాలీలు చేస్తున్న వారికిమాత్రం వీధుల్లో అనుభవిస్తున్న ప్రత్యక్షనరకం కనబడలేదా? వారికే కాదు తీర్పునిచ్చిన ఉన్నత న్యాయాధిపతులకు కూడా పెంపుడు జాగిలాలు ఉంటాయి.వారెలా? దేశంలో ప్రతిచోటా శునక సంరక్షణా కేంద్రాలనేర్పాడు చేసుకొని గ్రామసింహాల గోల నుంచి ప్రజలకు ఇతర ప్రాణులకు రక్షణ కల్పించాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### తెలుగు, హిందీపై వివక్షత

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ గురుకులాలలో 5వ తరగతి నుండి10 వ తరగతి వరకు హిందీ తెలుగు భాషలపై విద్యార్థులకు చాలా అన్యాయం జరుగుతుంది. తెలుగు, హిందీ టీచర్స్ బోధించడం లేదు. వారు సమయపాలన పాటించడం లేదు. గ్రామర్ ఒత్తులు దీర్ఘాలు వంటి భాష నైపుణ్యాలను నేర్పించడం లేదు. ఆలస్యంగా గురుకులాలకు రావడం సంతకాలుపెట్టుకునివెంటనే ఇంటికి పోవడం జరుగుతుంది. ఈ విధానం వలన విద్యార్థులకు హిందీ, తెలుగు నాణ్యమైన బోధన అందడం లేదు.

- రాపాక. రవీందర్, జనగాం

### కల్తీలకు అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న నిత్యావసర వస్తువుల ఆహార పదార్థాల కల్తీ, నకిలీ సరుకులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి. ముఖ్యంగా ఆహారపదార్థాలు కృత్రిమంగా తయారు చేయడం జరుగుతుండడంవిచారకరం. ప్లాస్టిక్ బియ్యం, ప్లాస్టిక్ గుడ్లు ,కృత్రిమ మాంసం, నల్ల బియ్యం తదితర కృత్రిమ నిత్యావసర ఆహార పదార్థాల కల్తీలకు అడ్డుకట్ట వేయాలి. లేదంటే ప్రజల ఆరోగ్యంపై వీటి ప్రభావం పడుతుంది. కల్తీతో కూడిన పదార్థాలు ప్రజల ఆరోగ్యం పై దుష్ప్రభావం చూపుతుంది.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### ఎన్నికలపై నమ్మకమే ప్రజాస్వామ్యానికి ప్రాణం

బీహారులో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణలు స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూలో ఓటుచోరీ జరుగుతోందని,దాన్ని సరిదిద్దాలని కోరుతూ మూడు వందల మంది ప్రతిపక్ష ఎంపీలు ఢిల్లీలో నిరసన ర్యాలీ చెయ్యడం ప్రాముఖ్యత కలిగిన వార్త.వారిని ఎన్నికల కమిషన్ తమను కలిసేందుకు అనుమతినిస్తే సరిపోయేది..సబబుగా ఉండేది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గత కొంత కాలంగా, బీహారు అంశమే కాకుండా,గత సార్వత్రికఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు కొన్ని ఆధారాలతో బలంగా చెప్తున్నారు. కర్ణాటకలో ఒక పార్లమెంటు నియోజక వర్గంలో లక్ష ఓట్లకు పైగా మతలబు జరిగినట్లు, అలాంటి ఉదంతాలు దేశ వ్యాప్తంగా ఉన్నట్లు, తద్వారా అధికార పక్షానికి మేలు జరిగినట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ సందేహ నివృత్తి చేయాల్సింది.సరైన రుజువులతో ఆయన వాదన నిపూర్వపక్షం చేసి ఉంటే అది దేశ ప్రజలకు మంచి సందేశం ఇచ్చినట్లు ఉండేది.పైగా అలా చెయ్యడం దాని బాధ్యత కూడా.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### ఆలోచించి వేతనాలివ్వండి

అనేక పరీక్షలు వ్రాసి కఠినమైన అలజడిని వత్తిడిని తట్టుకొని పిల్లలతోట్రాన్సఫర్లు ఎదుర్కొని దీర్ఘకాల సర్వీస్‌చేసి రిటైర్ అయ్యేటువంటి వారికి వారు జీవితాంతం చేసిన సేవల గుర్తింపుకు పెన్షన్‌లు ఇవ్వడం ఒక మహాసహాయం.అంతేగాని పార్టీ నుంచి పార్టీలు మారి 5 సంవత్సరాలు కూడాసొంత ప్రయోజనాలకే సమయం కేటాయించి కోట్ల ఆస్తులు పెంచుకోనే ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు జీతాలు వరకూ బానేవుంది.ఎంత సర్వీస్ చేశారని అంతపెద్ద పెన్షన్లు సార్. ప్రభుత్వం కొంచెం ఆలోచించాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### ఉపాధి హామీ కల్పించాలి

తెలంగాణలో పెరిగిన నీటి వసతులు భూమి అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ కింద చేసేందుకు హామీ ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికి తుమ్మలు మొలిచిన నెలలు నేడు సాగు యోగ్యంగా మారడానికి ఉపాధి హామీ హామీ పడుతుంది. చిన్నచిన్న గూడెంలలో కూడా ఎక్కువలో ఎక్కువగా 10 నుండి 15ఎకరాలలో మాత్రమే పాడుబడ్డ భూములున్నాయి. అంటే మెరుగు పడిన పరిస్థితికి నిదర్శనం.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మాటల్లోనే వ్యవ‘సాయం’

**పూర్వపరాల్లోకి వెళ్లితే 1967లో దేశంలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా ‘ఝా’ కమిటీ సిఫారసు మేరకు వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా డాక్టర్ సేన్ కమిటీ సూచనల మేరకు ‘వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్’ను సంస్కరించారు. మద్దతు ధరను నిర్ణయించడంలో ఈ కమిషన్‌ది కీలకపాత్ర. ఏదిఏమైనా ఈ విధానం అమలులో ఉన్న లోపాల కారణంగా రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధర లభించడం లేదనేది వాస్తవం. అన్నదాతలకు ఇంత అన్యాయం కళ్లముందే జరుగుతుంటే తమది రైతుల ప్రభుత్వమని, తాము అన్నదాతల పక్షపాతి అంటూ, రైతుల కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకుంటూ వాచావాత్సల్యంతో కాలం గడపడం న్యాయం కాదు.**

దామెర్ల సాయిబాబ

మాటలు కోటలు దాటుతుంటే చేతలు గడప దాటడం లేదంటారు. వ్యవసాయం విషయంలో పాలకులు వ్యవహరిస్తున్న తీరు ఇందుకు అద్దం పడుతున్నది. కోట్లాది రూపాయలతో ఎన్నో రాయితీలతో పాటు రైతుల సంక్షేమం కోసం మరెన్నో పథకాలు చేపడుతున్నా రైతుల జీవనంలో ఆశించిన మార్పు రావడం లేదు. ఎవరెన్ని మాట్లాడినా ఎంత చేశామని చెప్పుకుంటున్నా దేశంలో రైతుల పరిస్థితి నానాటికీ దిగజారిపోతున్నది. కారకులు ఎవరైనా, కారణాలు ఏమైనా రైతులు ఎంతోకాలంగా బలైపోతూనే ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరెందరో అటు వ్యవసాయాన్ని వదలలేక, మరో వృత్తి చేతకాక అందులోనే కృంగికృశించిపోతున్నారు. రైతుల ఈ దుస్థితికి ఎంతో మంది మరెన్నో విభాగాలతోపాటు ప్రకృతి చేస్తున్న విన్యాసాలు కూడా కారణమవుతున్నాయి. ప్రకృతి ఎందుకో ఏమోకానీ రైతుల పట్ల పగబట్టి, పంతం బూని, దెబ్బ మీద దెబ్బ కొడుతున్నదేమోననిపిస్తున్నది. అయితే అతివృష్టి, కుంభవృష్టి లేకుంటే అనావృష్టి అన్నట్లుగా ప్రకృతి వ్యవహరిస్తున్నది. దేశంలోని కొన్ని రాష్ట్రాలు వరదల బీభత్సంతో అల్లాడిపోతుంటే మరి కొన్ని ప్రాంతాలు చుక్కనీటి కోసం అర్రులు చాస్తున్నాయి. వేసిన పంటలు చేతికి వచ్చేవరకు నమ్మకంలేని దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలు తెలుగు రాష్ట్రాలతో దేశంలోని అనేక ప్రాంతాల్లో జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. క్లౌడ్‌బరస్ట్‌లతో ప్రధానంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకాశ్మీర్ లాంటి రాష్ట్రాలకు జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. జమ్ముకాశ్మీర్ కొండల్లో నిన్న క్లౌడ్‌బరస్ట్ బీభత్సం సృష్టించింది. మచైల్ మాత ఆలయానికి వెళుతున్న యాత్రికులపై విరుచుకుపడింది. దాదాపు అరవై మందికిపైగా చనిపోగా, మరొక వంద మంది గల్లంతైనట్లు చెపుతున్నారు.మరెందరో క్షతగ్రాతులయ్యారు. అయితే ఐదువందల మందికిపైగా శిధిలాల కింద ఉన్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అభిప్రాయపడడం ఆందోళన కలిగిస్తున్నది. ఇక దేశవ్యాప్తం వ్యవసాయరంగం కుదేలైపోతున్నది. ఈ వానలు వరదలకు వేలాది ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. ముఖ్యంగా మిర్చి,పత్తి లాంటి వాణిజ్య పంటల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. ఇవన్నీ ప్రకృతి చేస్తున్న విన్యాసాలకు రైతులకు వస్తున్న కష్టాలు. ఇక తోటి మానవుడు చేసున్నదగా, దోపిడీ, మోసాలను అన్నదాతలు అధిగమించలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు కావాల్సింది మాటలు, వాగ్దానాలు కాదు. ఎవరి దయాదాక్షిణ్యాల మీదనో అన్నదాతలు బతకాలని కోరుకోవడం లేదు. కోరుకోరు కూడా. వారికి న్యాయబద్ధంగా రావాల్సింది, రాజ్యాంగబద్ధంగా కల్పించినవి వారికి సకాలంలో అందిస్తే చాలు. కానీ ఈ బాధ్యతను నిర్వహించ డంలో పాలకులు విఫలమవుతుండడం వల్లనే ఈ పరిస్థి తులు దాపురిస్తున్నాయి. ఈ విషయాలన్నీ విస్మరించి ఏదో చేస్తామన్నట్టు ప్రకటించడం ఎంతవరకు న్యాయమో ఆలోచించాలి. విత్తేదగ్గర నుండి విక్రయించే వరకు అన్నీ మోసాలే. మొత్తం వ్యవసాయరంగానికి మూలం విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధర. అలాగే మొలచిన మొక్కలకు చీడపీడలు ఆశించకుండా కాపాడే క్రిమిసంహారక మందులు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ అంశాలు వ్యవసాయరంగంలో అత్యంత ప్రధానమైనవి. నాణ్య మైన విత్తనాలు, సరసమైన ధరలకు సకాలంలో రైతులకు అందించాలి. ఈ విషయంపై ప్రయత్నం చేస్తున్నట్లు గత రెండు, మూడు దశాబ్దాలుగా పాలకులు చెబుతూనే

## ఒక్క మాట

ఉన్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. నాసిరకం, నకిలీ విత్తనాలు దేశమంతా సరఫరా అవుతు న్నాయి. నాసిరకం విత్తనాల విషయంలో కఠిన చర్యలు తీసుకోకపోవడంపై రెండేళ్లక్రితం తెలంగాణ హైకోర్టు జోక్యంచేసుకొని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విత్తనాలకోసం రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుందని, వారిపై ప్రభుత్వ నియంత్రణ లేదంటూ అందిన ఒక లేఖను హైకోర్టు ప్రజాప్రయోజన వాజ్యంగా పరిగణనలోకి తీసుకుంది. రాష్ట్రంలో రైతులు మంచి దిగుబడులు వస్తాయనే ఆశతో ప్రైవేట్ వ్యాపారుల మాట విని విత్తనాలు కొని నష్టపోతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ ఉత్తరంలోని అంశాలను పరిశీలించిన ధర్మాసనం ప్రభుత్వ కార్యదర్శి, వ్యవసాయరంగ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌తోపాటు మరికొందరు ఉన్నత అధికారులకు నోటీసులు ఇచ్చింది. వాస్తవానికి నకిలీ, నాసిరకం విత్తనాల సమస్య రానురాను తీవ్రరూపం దాల్చుతున్నది. తలతాకట్టు పెట్టి అప్పోసొప్పో చేసి మొత్తం పెట్టుబడి పెట్టి శ్రమంతా చేసిన తర్వాత చివరి దశకు వచ్చే సమయంలో అవి నాసిరకానివో లేక నకిలీవనో తేలితే అన్నదాత కుప్పకూలిపోతున్నాడు. మళ్లీ పెట్టుబడికి అప్పు తెచ్చే మార్గం లేక, మరో తోవకానరాక అప్పులవాళ్ల ముందు తలవంచుకోలేక ఎందరో అన్నదాతలు బలవన్మరణాలకు గురవుతున్నారు. ఇదేదో ఇప్పటి ప్రభుత్వాలు వచ్చిన తర్వాత మొదలు కాలేదు. గత, రెండు, మూడు దశాబ్దాలుగా జరుగుతూ వస్తోంది.రానురాను పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు. వ్యవసాయాన్ని ఇంతగా సంక్షోభంలోకి నెడుతున్న ప్రధాన కారణాల్లో ఒకటైన ఈ నకిలీ విత్తనాలను నిర్మూలించేందుకు గత రెండు, మూడు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నా, కేసులు పెడుతున్నా, చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా అవి ఆగడం లేదు. అసలు విత్తన చట్టంలోనే లోపం ఉంది. ఆ చట్టం అన్నదాతల కంటే దళారులకే ప్రయోజనకరంగా ఉందనే ఆరోపణను కొట్టివేయలేం. వాస్తవంగా ఆయా రాష్ట్రాల వ్యవసాయ శాఖా ధికారులు దుకాణాల నుంచి నమూనాలు సేకరించి పరీక్షిస్తే తప్ప విత్తనాల అక్రమ వ్యాపారం బయటపడే అవకాశం లేదు. అవసరం మేరకు ప్రయోగశాలలు లేకపోవడం, అవి నీతి చోటు చేసుకోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు రైతు లను పీడిస్తున్నాయి. విత్తన నాణ్యత నిర్ధారణ పరీక్షలు మొక్కుబడిగా మారాయి. ఇక క్రిమిసంహారక మందుల గురించి ఎంత తక్కువ చర్చిస్తే అంత మంచిదేమో. నకిలీ ఏదో నాసిరకం ఏదో తెలియని పరిస్థితి. మొన్న మామిడి పంటకు వచ్చిన బంకతెగులు ఎన్ని మందులు, ఎన్నిసార్లు పిచ్చికార్లు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. విత్తన చట్టాన్ని మరింత పటిష్టంచేసి రూపొందించిన ప్రతిపాదనలు దశాబ్దకాలంగా పెండింగ్‌లో పెట్టారు. దాదాపు అటకెక్కించారనే చెప్పొచ్చు. ఇవన్నీ ఒక ఎత్తైతే అన్నిటికంటే ముఖ్యమైనది, మూలమైనది గిట్టుబాటు ధర. వ్యవసాయరంగంలో పెట్టుబడికి అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.కేంద్ర పెద్దలు పెంచిన డీజిల్ ధర వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇక కూలీల రేట్లువిపరీతంగా పెరిగిపోయాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏమేరకు ఎవరికి ఉపయోగపడిందో ఏమో కానీ, వ్యవసాయరంగాన్ని కోలుకోలేకుండా చేస్తున్నది. దీంతో ఎంతో కష్టపడి మరెన్నో వ్యయప్రయాసలకు లోనై సాగు చేసినా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అమ్మినా ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. సాగు చేస్తే నష్టం వస్తుందనే ఆలోచనతో వ్యవసాయానికే మంగళం పాడిన రైతులు ఎందరోఉన్నారు.కాడి కింద పెడుతున్నారు. రానురాను ఈసంఖ్య పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ కనీస మద్దతు ధర ఏప్రాతిపదికపై నిర్ణయిస్తారో, ఖర్చులు ఎలా అంచనా వేస్తారో అన్నదాతలకే కాదు మరెవరికి అర్థంకాని నిగూఢ రహస్యంగా మారిపోయింది. కనీస మద్దతు ధర నిర్ణయించడానికి ఎలాంటి స్థిరమైన గణిత నమూనా లేదని, వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్‌కు 1998లో భాను ప్రతాప్ సింగ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పూర్వపరాల్లోకి వెళ్లితే 1967 లో దేశంలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా ‘ఝా’ కమిటీ సిఫారసు మేరకు వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా డాక్టర్ సేన్ కమిటీ సూచనల మేరకు ‘వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్’ను సంస్కరించారు. మద్దతు ధరను నిర్ణయించడంలో ఈ కమిషన్‌ది కీలకపాత్ర. ఏదిఏమైనా ఈ విధానం అమలులో ఉన్న లోపాల కారణంగా రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధర లభించడం లేదనేది వాస్తవం. అన్నదాతలకు ఇంత అన్యాయం కళ్లముందే జరుగుతుంటే తమది రైతుల ప్రభుత్వమని, తాము అన్నదాతల పక్షపాతం అంటూ, రైతుల కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకుంటూ వాచావాత్సల్యంతో కాలం గడపడం న్యాయం కాదు. •

# ప్రభుత్వ పాఠశాలల భద్రతపై నీలినీడలు

సి.హెచ్. ప్రతాప్

రాజస్థాన్‌లోని ఝలావార్ జిల్లాలో ఇటీవల జరిగిన విషాద ఘటనలో ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు కూలిపోవడంతో ఏడుగురు అమాయక చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇది ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల భద్రతాప్రమాణాల లోపం, నిర్లక్ష్యం,అవినీతి, పర్యవేక్షణలో తలెత్తిన లోపాలు ఈ ప్రమాదం వెనుక ఉన్న అసలు కారణాలు. ప్రభుత్వ పాఠశాలలు దేశంలో లక్షలాది చిన్నారులకు విద్యఅందిస్తున్నాయి. అయితే, భవనాల వయసు, పాడుబడిన నిర్మాణాలు, తగిన మరమ్మత్తుల లేమి, భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం వల్ల ప్రతిరోజూ విద్యార్థులు ముప్పులో ఉంటున్నారు. కొన్ని రాష్ట్రాలలో ఆయా విద్యాశాఖలు సుమారుగా మూడు వేలకు పైగా పాఠశాలల దుస్థితిని గుర్తించి వాటి మరమ్మత్తుల కోసం నిధులు కేటాయించినప్పటికీ, ప్రభుత్వ పరంగా వాటి విడుదలలో నెలల తరబడి ఆలస్యం జరుగుతోంది. ఇది పరిపాలనా వైఫల్యం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాల ప్రాణ భద్రత పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం. భద్రత కేవలం భవనాలకే పరిమితం కాదు.కొన్ని పాఠశాలలలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడం వల్ల పాఠశాలలు రాత్రివేళల్లో దోపిడీ, ధ్వంసం, అసాంఘిక కార్యకలాపాలకు వేదికవుతున్నాయి. ఇటీవల అమరచింత పట్టణ ప్రభుత్వ పాఠశాలలో తలుపులు, బెంచీలు ధ్వంసం చేయడం, కిటికీలు పగలగొట్టడం, పాఠశాల ఆవరణలో మద్యం తాగి సీసాలు పగలగొట్టడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. కంప్యూటర్లు, టీవీలు, రికార్డులు, ఇతర విలువైన సామాగ్రి ఉన్నందున, పాఠశాలల్లో రాత్రిపూట వాచ్‌మెన్ నియామకం అత్యవసరం. గ్రామీణ,పట్టణ అంచు ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. విద్యుత్, తాగు నీరు, మరుగుదొడ్లు, వికలాంగుల సౌకర్యాలు లేని పాఠశాలలు ఇప్పటికీ ఉన్నాయి. డిజిటల్ యుగంలో కూడా అనేక పాఠశాలల్లో కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయాలు లేవు. ఇది విద్యా అసమానతను పెంచుతోంది. భవనాల పటిష్టతపై పర్యవేక్షణ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదు. వర్షాకాలం ముందు భద్రతా పరీక్షలు తప్పనిసరిగా జరగాలని నిబంధన ఉన్నా, అనేక చోట్ల అవి పత్రాలపైనే పూర్తవుతున్నాయి. టెండర్లలో అవినీతి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం వంటి అంశాలు సమస్యను మరింత పెంచుతున్నాయి. ఝలావార్ ఘటన అనంతరం మంత్రి మదన్ దిలావర్ చేసిన వ్యాఖ్యలు పాలక వర్గం బాధ్యతారాహిత్యానికి ఉదాహరణగా నిలిచాయి. ఇటువంటి వ్యాఖ్యలు బాధిత కుటుంబాల వేదనను పెంచడమే తప్ప, సమస్య పరిష్కారానికి దోహదం చేయవు. విద్యా భద్రతలో బాధ్యత స్పష్టంగా నిర్ణయించబడాలి. ప్రైవేట్/అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల రక్షణ బాధ్యత యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉంటుంది.ప్రభుత్వ/ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌ఛార్జి, ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది బాధ్యత వహించాలి. పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. నూతనవిద్యా విధానం, సమగ్ర శిక్షా, పీఎంశ్రీ స్కూళ్లు వంటి పథకాలను కేవలం ప్రచారపూరితంగా కాకుండా, కఠిన పర్యవేక్షణతో అమలు చేయాలి. నిధుల విడుదల వేగవంతం చేయాలి. ప్రజా పర్యవేక్షణను తప్పనిసరి చేయాలి. ప్రతి సంవత్సరం పాఠశాల భవనాల భద్రతా సర్టిఫికెట్‌ను పునరుద్ధరించాలి. ఝలావార్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు నిజమైన నివాళి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడమే అవుతుంది. భద్రత, నాణ్యమైన విద్య అందించడం పిల్లల ప్రాథమిక హక్కు. •

# మానవ హక్కులపై అగ్రరాజ్యం ద్వంద్వనీతి

మహమ్మద్ ఆరిఫ్

తనను తాను అగ్రరాజ్యంగా చెప్పుకుంటూ.. ప్రపంచ దేశాలకు పెద్దన్నలా వ్యవహరిస్తున్నానని భావిస్తున్న అమెరికా రష్యా,ఉక్రెయిన్, ఇజ్రాయెల్, గాజా యుద్ధాల పట్ల ద్వందనీతిని ప్రదర్శిస్తున్నది. ఉక్రెయిన్ పై రష్యా దాడికి పరోక్ష సహకారం అందిస్తున్నారనే ఆరోపిస్తూ ట్రంప్ ఇప్పటికే భారత్‌పై 25శాతం సుంకాలు విధించారు. అయినా ఇండియా వెనకడుగు వేయకపోవడంతో తాజాగా మరో 25 శాతం సుంకాలను పెంచుతున్నట్లు ప్రకటించారు.అంటే భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం సుంకాలు అమలవుతాయన్న మాట. అంతేకాకుండా రష్యాకు సహకరించే చైనాతోపాటు ఇతర దేశాలపైనా చర్యలుంటాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో సామాన్య పౌరుల మరణాల గురించి ప్రస్తావిస్తున్న అమెరికన్ ప్రెసిడెంట్‌కు ఇజ్రాయెల్, గాజా యుద్ధంలో మరణిస్తున్న చిన్నారులు, మహిళలు, వృద్ధుల మృత్యుఘోష వినిపించడం లేదా? ఆకలితో అలమటిస్తూ పోషకాల లోపంతో మరణిస్తున్న చిన్నారుల ఆర్తనాదాలు చెవికెక్కడం లేదా? స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అంటూ ప్రపంచానికి ప్రవచనాలు బోధించే అమెరికా రెండు ప్రధాన యుద్ధాల పట్ల ద్వందనీతిని ప్రదర్శిస్తున్నది. అగ్రరాజ్యం మాటలు, చేతల మధ్య స్పష్టమైన వైరుధ్యం కనిపిస్తున్నది. దీంతో అగ్రరాజ్యం నైతికతలో రాజకీయ ప్రయోజనాలే ప్రధానమని స్పష్టంగా అర్థమవుతున్నది. నాటోలో సభ్యత్వం కోసం ఉక్రెయిన్ పావులు కదుపుతున్నదని తెలియగానే 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ పై రష్యా దాడులు ప్రారంభించింది. అయినా 2022లో ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేయగా దాడులను మరింత ముమ్మరం చేసింది. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అగ్రరాజ్యాన్ని సైతం హెచ్చరించింది. అయితే సభ్యత్వం ఇవ్వాలా? వద్దా? అనేదానిపై నాటో దేశాలు ఇప్పటికీ తమ నిర్ణయాన్ని ప్రకటించకపోయినా రష్యా దాడులను అవి ఖండించాయి. రష్యా చర్యలను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా, ఐరోపా భద్రతకు ముప్పుగా అభివర్ణించాయి. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా చమురు, గ్యాస్, వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవద్దని ఇతర దేశాలపై ఒత్తిడి తెస్తున్నాయి. అంతేకాకుండా అమెరికాతోపాటు జర్మనీ, బ్రిటన్, నార్వే, డెన్మార్క్, స్వీడన్, నెదర్లాండ్స్, పోలాండ్,లిథువేనియా వంటి యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు, యాంటీ ట్యాంక్ క్షిపణులు డ్రోన్లు, ఇతర ఆయుధాలు సరఫరా



చేయడమే కాకుండా ఆర్థిక సహకారమందిస్తున్నాయి. మరోవైపు రష్యా ఆస్పత్రులు, పాఠశాలలపైనా దాడులు చేస్తున్నదని గగ్గోలు పెడుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన ఏడాదిన్నర తర్వాత అంటే 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ గాజా యుద్ధం ప్రారంభమైంది. అయితే ఇక్కడ ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. పాఠశాలలు, ఆస్పత్రులు, సామాన్య పౌరులు నివసించే ఇండ్లు అనే తేడా లేకుండా బాంబుల వర్షం కురిపిస్తున్నది. చిన్నారులు, మహిళలు, వృద్ధులను సైతం బలితీసుకుంటున్నది. మానవతా సహాయం అందకుండా అడ్డుగోడగా నిలిచి ఆకలి మరణాలకు కారణమవుతున్నది. కానీ ఇవేమీ అగ్రరాజ్యం అమెరికాకు కనిపించడం లేదు. అయితే గాజాపై దాడులను కనీసం ఖండించని అమెరికా మరోవైపు ఇజ్రాయెల్‌కు బిలియన్ డాలర్ల ఆయుధాలను సరఫరా చేస్తున్నది. యుద్ధ నేరాల విషయంలో రష్యా పట్ల కఠినంగా వ్యవహరించిన అమెరికా ఇజ్రాయెల్ విషయంలో మాత్రం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో వచ్చిన తీర్మానాలను వీటో చేసింది. ఇజ్రాయెల్ యథేచ్ఛగా అనేక ఉల్లంఘనలకు పాల్పడుతున్నా ఎటువంటి ఆంక్షలు విధించలేదు. కనీసం విమర్శించలేదు. గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. 2023 అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో సుమారు 6080 వేల మంది వరకు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. ఇందులో సుమారు 18వేల మంది చిన్నారులు ఉండగా, 15వేల కంటే ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. 19 లక్షల మంది నిర్వాసితులయ్యారు. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఉన్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టంచేసింది. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ 80 శాతం మంది చిన్నారులుండడం మనసులను కలచివేస్తున్నది. అదే ఉక్రెయిన్‌లో పౌరమరణాలు 11 వేలవరకు మాత్రమే ఉంటాయని ఒక అంచనా. అంటే గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. ఇలాంటి నీతి ప్రపంచానికి ఎప్పటికైనా ముప్పే. మానవ హక్కుల విషయంలో రష్యాను పదేపదే విమర్శిస్తున్న అమెరికా.. ఇదే ఇజ్రాయెల్ విషయంలో మాత్రం మౌనంగా ఉండడం అగ్రరాజ్యం ద్వందనీతికి నిదర్శనంగా నిలుస్తున్నది. అంటే మానవ హక్కులు అనేది రాజకీయ ప్రయోజనాలు సాధించేందుకు ఒక ఆయుధంలా మాత్రమే పని కొస్తున్నాయనేది స్పష్టమవుతున్నది. ఇప్పటికే బ్రెజిల్‌తో పాటు మరికొన్ని దేశాలు అమెరికా ద్వంద్వ వైఖరిని విమర్శించాయి. అగ్రరాజ్యం వహిస్తున్న ఈ ద్వంద వైఖరి అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ, నైతికతపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తున్నది. ఇది ప్రపంచ శాంతి,స్థిరత్వానికి ఎప్పటికైనా ముప్పే. అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులపట్ల అందరికీ సమానమైన విధానం అవలంభించడంద్వారా మాత్రమే అమెరికా అంతర్జాతీయంగా తన విశ్వసనీయతను నిరూపించుకోగలదు. •

# భారత్‌కు ప్రపంచ దేశాల శుభాకాంక్షలు

**వాషింగ్టన్, ఆగస్టు 15:** భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా, సింగపూర్, మాల్దీవుల నుంచి సందేశాలు అందాయి. భారత్‌తో తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకొంటామని ఆయా దేశాధినేతలు, మంత్రులు పేర్కొన్నారు.

తమ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని సగర్వంగా నిర్వహించుకుంటున్న భారత ప్రజలకు అమెరికా ప్రజల తరఫున శుభాకాంక్షలు అని ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన్య భారత్, ప్రపంచంలో పురాతన ప్రజాస్వామ్యమైన యుఎస్ మధ్య చారిత్రాత్మక సంబంధం కొనసాగుతోందని, ఉభయ దేశాల సంబంధాలు ఎంతో దృఢమైనవని ఆయన అన్నారు. భారత్, అమెరికా మరింత శక్తిమంతమైన ఒప్పందాలను చేసుకోవడం కోసం ఎదురుచూస్తున్నాయని రూబియో అన్నారు.



భారత ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు, న్యూఢిల్లీ సామాజిక-ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక, ఇతర రంగాల్లో విజయన్ని సాధిస్తూ.. శరవేగంగా ముందుకు సాగుతోందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. ప్రపంచ వేదికపై తగిన గౌరవాన్ని పొందుతోందన్నారు. అంతర్జాతీయ ఎజెండాలోని కీలక సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరిస్తోందని, భారత్‌తో ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని తాము విలువైనదిగా భావిస్తున్నామని ఆయన అన్నారు. తమ ఉమ్మడి ప్రయత్నాల ద్వారా బహుళ రంగాల్లో నిర్మాణాత్మక, ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నామని పుతిన్ అన్నారు.

భారత్‌కు ఇజ్రాయెల్ ఎంబసీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపింది. భారత్, ఇజ్రాయెల్ మధ్య ఉన్న స్నేహబంధం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నామని పేర్కొంది.

భారత ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. న్యూఢిల్లీ మాల్దీవులకు ఎల్లప్పుడూ విశ్వసనీయ అభివృద్ధి భాగస్వామిగా ఉంటుందని ఆకాంక్షిస్తున్నట్లు మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు తెలిపారు. ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి సంబంధాలు మరింత ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు.

భారత ప్రజలకు సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వారం ప్రారంభంలో న్యూఢిల్లీతో జరిపిన చర్చలు తమ ఉభయ దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేశాయన్నారు. మరిన్ని దౌత్య సంబంధాల కోసం ఎదురుచూస్తున్నామని ఆయన అన్నారు.

దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుక కోసం ఎర్రకోట పరిసరాల్లో 11 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. 'నయా భారత్' ఇతివృత్తంతో ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు.

## ఐఫోన్‌ను హ్యాక్‌చేస్తే రూ.17.52 కోట్ల రివార్డు

### సవాల్ చేసిన యాపిల్ సంస్థ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రపంచవ్యాప్తంగా ఇటీవలికాలంలో మొబైల్‌ఫోన్లను హ్యాకింగ్‌చేసే హ్యాకర్లు ఎక్కువయిపోయారు. సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయి. క్లిక్‌చేస్తేచాలు ఖాతాల్లో సొమ్ములు పోతున్నాయి. మొబైల్‌ఫోన్ సాయంతోనే మొత్తం అన్ని అక్రమాలు సాగిపోతున్నాయి. ఐఫోన్‌ను అయితే ఐఫోన్ మాత్రం ఇందుకు భిన్నంగా తయారవుతోంది. హ్యాకింగ్‌కు వీలుకాని వ్యవస్థలను తమ ఐఫోన్లలో నిక్షిప్తం చేస్తున్నట్లు చెపుతోంది. తమ ఐఫోన్లను హ్యాక్ చేస్తే రూ.17.52 కోట్లు రివార్డు ఇస్తామని యాపిల్ సంస్థ సవాల్‌చేసింది. కంపెనీ సెక్యూరిటీ బౌంటీ(బహుమతి) కార్యక్రమంలో భాగంగా తమ ఐఫోన్ సిస్టమ్స్‌ను బ్రేక్ చేసిన వారికి నగదు బహుమతులను అందిస్తామని ప్రకటించింది. భౌతికపరమైన యాక్సెస్ ద్వారా డివైస్ అటాక్ చేయగలిగితే రూ.1.31 కోట్లు, యూజర్ ఇంటరాక్షన్ ద్వారా నెట్‌వర్క్ అటాక్ చేస్తే రూ.2.18 కోట్లు అందిస్తారు.


# చర్చలు విఫలమైతే భారత్‌పై మరిన్ని సుంకాలు

### అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్

**వాషింగ్టన్, ఆగస్టు 15:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం అలాస్కాలో జరగనున్న చర్చలు విఫలమైతే భారత్‌పై అదనంగా మరోసారి అమెరికా ప్రభుత్వం సుంకాలు విధిస్తుందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ హెచ్చరించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ట్రంప్, పుతిన్ మధ్య అలాస్కాలో జరగనున్న చర్చలు అనుకూల ఫలితాలు సాధించడంలో విఫలమైన పక్షంలో భారత్‌పై అదనపు సుంకాలు వడ్డించక తప్పదని ఆయన అన్నారు.



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అదనంగా సుంకాలు విధించామని, పరిస్థితి తమకు అనుకూలంగా లేకపోతే భారత్‌పై మరోసారి అదనపు సుంకాలు విధించడమో లేదా ఆంక్షలు విధించడమో తమ ప్రభుత్వం చేపడుతుందని స్కాట్ హెచ్చరించారు. భారత్‌పై మొదట 25 శాతం సుంకాలు విధించిన అధ్యక్షుడు ట్రంప్ రష్యా నుంచి చమురును, ఆయుధాలను కొనుగోలు చేస్తున్నందుకు మరో 25శాతం సుంకాలను జరిమానాగా విధించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం సాగిస్తున్న రష్యాకు భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. అమెరికా విధించిన సుంకాలు మొత్తంగా 50 శాతానికి పెరిగి పోవడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇంత భారీ స్థాయిలో సుంకాలు విధించడాన్ని అన్యాయం, అసంబద్ధంగా భారత్ అభివర్ణిస్తూ తమ జాతీయ ఇంధన భద్రత కోసం చమురు దిగుమతులు అనివార్యమని సమర్థించుకుంది.



## పాక్‌తో అంట కాగుతున్న అమెరికా

### స్వాతంత్ర్యదినోత్సవం రోజున బంపర్ ఆఫర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌తో వాణిజ్య పరంగా మరింత ముందుకు వెళ్లాలని భావిస్తోంది. కీలకమైన ఖనిజాలు, హైడ్రోకార్బన్‌ల రంగాలలో పాకిస్తాన్‌తో తమ సహకారాన్ని బలోపేతం చేయ డానికి ఎదురు చూస్తున్నట్లు పేర్కొంది. ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఆర్థిక సహకారంపైనా దృష్టి సారించింది. పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పంపిన అభినందన సందేశంలో తమ ఉద్దేశాన్ని ప్రకటిస్తూ.. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. అమెరికా, పాకిస్థాన్ దేశాల మధ్య నిరంతర సహకార ప్రాముఖ్యతను రూబియో తన ప్రకటనలో హైలైట్ చేశారు. ఆగస్టు 14న పాకిస్తాన్ ప్రజలు తమ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా అమెరికా తరపున నేను వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను అని రూబియో చెప్పారు. యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు తమ అభిమతాన్ని వ్యక్తపరిచారు. కీలకమైన అంశాలలో, ముఖ్యంగా ఉగ్రవాద నిరోధం, వాణిజ్యంలో పాకిస్తాన్ అభిమతాన్ని కూడా ఆయన అంగీకరించారు. పాకిస్థాన్‌కు కీలకమైన ఖనిజాలు, హైడ్రోకార్బన్‌లు సహా వివిధ రంగాల్లో ఆర్థిక సహకారం అందించేందుకు, కొత్త రంగాలను అన్వేషించడానికి, డైనమిక్ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడానికి తాము ఎదురుచూస్తున్నామని రోబియో చెప్పుకొచ్చారు. అంతేకాదు, ఇది అమెరికన్లు, పాకిస్తానీలకు సంపన్న భవిష్యత్తును రూపొందిస్తుంది అని రూబియో అన్నారు. కాగా, జూలై ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. పాకిస్థాన్‌లో చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి సహకరిస్తామని, ఏదో ఒక రోజు ఇస్లామాబాద్ న్యూఢిల్లీకి చమురును విక్రయించవచ్చని ట్రంప్ చెప్పుకొచ్చారు. ప్రస్తుత రూబియో ప్రకటనకూడా దీనికి అనుగుణంగానే ఉంది.

# భారత్-పాక్ అణుయుద్ధాన్ని నేనే నివారించా..

### ట్రంప్ నోట మళ్లీ అదే పాతపాట

**అలాస్కా ఆగస్టు 15:** తనను తాను శాంతి దూతగా ప్రమోట్ చేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శతవిధాలా తపనపడుతున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచంలో చాలా యుద్ధాలను తానే ఆపినట్లు పదేపదే చెప్పుకుంటున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ పాక్ యుద్ధంపై కూడా పదేపదే కామెంట్స్ చేసారు. ఇరు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానని మీడియా ముందు చెప్పిన ట్రంప్, తాజాగా మరోసారి అదే కామెంట్ చేశారు. భారత్ పాకిస్థాన్ మధ్య సంభవించబోయే అణుయుద్ధాన్ని తానే నివారించానని ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అలాస్కాలో జరగబోయే సమావేశం గురించి నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ కామెం ట్స్ చేశారు. తన అధ్యక్ష పదవీకాలంలో ఆరు నెలల వ్యవధిలో ఆరు ప్రధాన యుద్ధాలు ముగిసాయని ట్రంప్ చెప్పారు. 37 ఏళ్లుగా కొనసాగుతున్న ఒక యుద్ధం, 31ఏళ్లుగా సాగుతున్న కాంగో-రువాండా ఘర్షణతో పాటు మరో నాలుగు యుద్ధాలను కేవలం ఆపడం మాత్రమే కాదు, శాంతిని కుదిర్చినట్లు తెలిపారు. భారత్ పాకిస్థాన్ మధ్య పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉండగా, ఆరు, ఏడు విమానాలు కూలాయని, ఈ క్రమంలో ఇరు దేశాలూ అణుయుద్ధానికి సిద్ధమవగా తానే ఆపినట్లు ట్రంప్ గొప్పలకు పోయారు. ట్రంప్ వాదనలను గతంలోనే భారత్ ఖండించింది. భారత్ పాకిస్థాన్ మధ్య ఎలాంటి మధ్యవర్తిత్వం అవసరం లేదని, ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల భారత ఎయిర్ చీఫ్ మార్షల్ స్టాఫ్ అమర్ ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లతో పాటు మరో పెద్ద విమానాన్ని భారత్ కూల్చివేసిందని వెల్లడించారు. అయితే పాకిస్థాన్ ఈ వాదనను తిరస్కరించింది.

# పిఓకేలో వరదలు: 154 మంది మృతి

**ముజఫరాబాద్, ఆగస్టు 15:** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతాల్లో కుండపోత వర్షాలతు భీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు భారీ ప్రాణనష్టం సంభవించింది. గడచిన 24 గంటల వ్యవధిలో 154 మంది మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. అనేకమందికి గాయాలయ్యాయన్నారు. పివోకేలోని గిల్గిత్ బాల్టిస్టాన్‌లో పలుభవనాలు ధ్వంసం అయ్యాయి. ఖైబర్ ఫక్తూంఖ్వా ప్రావిన్స్‌లోనే అధికమరణాలు సంభవించాయి. బునేర్‌జిల్లాలో 75 మంది మృతి చెందగా, మాన్సెహ్రా జిల్లాలో 17మంది బాజౌర్, బాటాగ్రామ్ జిల్లాల్లో 18 మంది చొప్పున మృతిచెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఖైబర్ ఫక్తూంఖ్వా ప్రావిన్స్‌లో పలు ప్రాంతాల్లో మేఘ విస్ఫోటనం, ఆకస్మిక వరదల ప్రభావంతో పలువురు చిన్నారులు సహా 125 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయక బృం దాలు సైన్యం స్థానికులు సహాయక చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అనేక మంది గల్లంతైనందున మృతులసంఖ్య గణనీయంగాపెరుగుతుందని ప్రాదేశిక ఉపద్రవ పర్యవేక్షక సంస్థ అధికారి ఫైజీ తెలిపారు. అనేక ఇళ్లు ధ్వంసం అయ్యాయి. వాహనాలు, స్కూళ్లు, ఆరోగ్యకేంద్రాలు కొట్టుకుపోయాయి. నీలమ్ వ్యాలీ వద్ద ఉన్న పర్యాటకులను సురక్షితంగా తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు. పలు వంతెనలు సైతం కొట్టుకునిపోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంకా అనేకమంది తప్పిపోయారని మరణాలసంఖ్య మరింతపెరిగే అవకాశం ఉందని ఫైజీ వెల్లడించారు.



# దుబాయ్ వ్యాపారి కిడ్నాప్‌ను ఛేదించిన కేరళ పోలీస్

**మలప్పురం, ఆగస్టు 15:** సొంత రాష్ట్రమైన కేరళకు సెలవుల కోసం వచ్చిన యూఏఈకి చెందిన భారత వ్యాపారి కిడ్నాప్ ఉదంతం సుఖాంతమైంది. ఆయన వద్ద గతంలో పనిచేసిన ఉద్యోగే ఈ కిడ్నాప్‌కు సూత్రధారి అని తేలింది. మలప్పురం, కొల్లాం పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, కేవలం రెండు రోజుల్లోనే వ్యాపారిని సురక్షితంగా కాపాడి, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. యూఏఈలో ఫార్మసీ స్టోర్ల చైన్ నడుపుతున్న వీపీ షమీర్ (36) మంగళవారం సాయంత్రం తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మలప్పురంలో రాత్రి 7:45 గంటల సమయంలో కొందరు దుండగులు ఆయనను బలవంతంగా ఒక టయోటా ఇన్నోవా కారులోకి ఎక్కించుకుని అపహరించారు. ఆ తర్వాత, షమీర్ ఫోన్ నంబర్ నుంచే దుబాయ్‌లోని ఆయన బిజినెస్ పార్ట్‌నర్‌కు కిడ్నాపర్లు ఫోన్ చేశారు. షమీర్‌ను విడిచిపెట్టాలంటే రూ.1.5కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులను ఆశ్రయించవద్దని ఆయన భార్యను కూడా బెదిరించారు.

రంగంలోకి దిగిన పోలీ సులు సీసీటీవీ ఫుటేజ్, లొకేషన్ ట్రాకింగ్ ఆధా రంగా దర్యాప్తు ప్రారంభించారు. కిడ్నాపర్ల కారు ఎర్నాకుళం వైపు వెళ్లినట్టు గుర్తించారు. వారికి కారు సమకూర్చిన వారిని ప్రశ్నించడంతో కీలక సమాచారం లభించింది. ఎర్నాకుళంలో షమీర్ ఫోన్ రెండుసార్లు ఆన్ అవ్వడం దర్యాప్తులో పోలీసులకు బాగా ఉపయోగపడింది. మలప్పురం, కొల్లాం పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో నిన్న ఉదయం 11:30 గంటలకు కొల్లాం జిల్లా కురువిక్కోణంలో షమీర్‌ను గుర్తించారు. తమిళనాడుకు తరలించేందుకు కిడ్నాపర్లు ప్రయత్నిస్తుండగా ఒక కారులో ఉన్న ఆయనను పోలీసులు కాపాడారు. ఈ కిడ్నాప్‌తో సంబంధం ఉన్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారిలో సూత్రధారి పుతువీట్టిల్ షంషీర్‌తోపాటు హాంషీర్, ఫయాస్, అఫ్జల్, మహమ్మద్ నైఫ్, షాహీర్ ఉన్నారు. పోలీసుల విచారణలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

షమీర్ వద్ద గతంలో పనిచేసిన షంషీర్ (30)ను ఉద్యోగం నుంచి తీసేయడంతో కక్షపెంచుకున్నాడు. గతంలోనే బెదిరింపులకు పాల్పడిన అతడు, పక్కా ప్లాన్‌తో ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. కిడ్నాప్ సమయంలో తనపై దాడి జరిగిందని షమీర్ చెప్పడంతో ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు.

## బతికుండగానే ఓటరు జాబితాలో చంపేసిన ఎన్నికల అధికారులు!

**పాట్నా,ఆగస్టు 15:** బీహార్‌కు చెందిన ఒక వ్యక్తి చనిపోయినట్లు ఎన్నికల అధికారి నిర్ధారించారు. ఓటరు జాబితా నుంచి ఆయన పేరు తొలగించారు. అయితే తాను బతికే ఉన్నానంటూ ఆ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు అలాగే ఎలక్షన్ కమిషన్ (ఈసీ)కు మొరపెట్టుకున్నాడు. భోజ్‌పూర్ జిల్లా అర్రా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మింటూ కుమార్ పాస్వాన్ మరణించినట్లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో బూత్ స్థాయి ఎన్నికల అధికారి నిర్ధారించారు. ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఆయన పేరు తొలగించారు. కాగా, బీహార్‌లో ఓటరు జాబితా సవరణ కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు మండి పడుతున్నాయి.

# విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మించిన ఫ్రెంచ్ బృందం



**ఉడుపి, ఆగస్టు 15:** ఫ్రెంచ్ విద్యార్థులు భారతదేశం పట్ల తమ ఇష్టాన్ని చాటుకున్నారు. రెండు నెలల ఇంటర్న్‌షిప్ కోసం వచ్చిన వారు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో మమేకమవ్వడమే కాకుండా ఇండియా పట్ల మమకారాన్ని చూపించారు. భారత్ నుంచి వెళ్లినప్పుడు ఒక జ్ఞాపకంగా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో తాము ఉన్న ఊరిలోని పాఠశాలకు అత్యవసరమైన మరుగుదొడ్ల సౌకర్యాన్ని నిర్మించి కానుకగా అందజేశారు. ఫ్రాన్స్‌కు చెందిన విద్యార్థుల బృం దం రెండు నెలల ఇంటర్న్‌షిప్ కోసం ఉడుపి జిల్లాలోని కన్యాణ గ్రామం కుద్రు తండాకు వచ్చింది. ఈ క్రమంలోనే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పడం, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని రోజువారీ లైఫ్‌స్టైల్‌తో కలిసిపో యారు. తాజాగా వారి ఇంటర్న్‌షిప్ పూర్తి కావ చ్చింది. దీంతో ఈ ఊరికి కేవలం ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోకూడదని ఆ బృందం భావించింది. ఎప్పటికీ ఆ గ్రామ ప్రజల మనసుల్లో నిలిచిపోవాలని తాపత్రయపడింది. ఈ క్రమం లోనే పాఠశాలకు అత్యవసరమైన సదుపాయాలను కల్పించాలని నిర్ణయించుకుంది. విద్యార్థుల కోసం పూర్తిస్థాయి మరుగుదొడ్ల సౌకర్యాన్ని సొంతంగా నిర్మించి పాఠశాలకు అందజేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఎల్కానీపేరుతో ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. అందులో ఫ్రెంచ్ విద్యార్థులు పిల్లలతో ఆడుతూ, పాఠాలు చెబుతూ స్నేహపూర్వకంగా మెలుగుతుండటం కనిపించింది. ఇది చూసి నెటిజన్లు ఫ్రెంచ్ విద్యార్థులపై ప్రశంసలు కురిపిస్తున్నారు. వారి సేవాభావం, పిల్లల పట్ల చూపిన మమకారం చూసి మురిసిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల లోపం వల్ల చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, ఈ చిన్న కానుక పెద్ద మార్పు తీసుకురావచ్చని స్థానికులు భావిస్తున్నారు. సరిహద్దులు దాటే దయకు ఇదే నిదర్శనమని కొనియాడుతున్నారు.



## 100 మీటర్ల జాతీయ పతాకంతో సైనికుల తిరంగా యాత్ర

**తవాంగ్(అరుణాచల్), ఆగస్టు 15:** హిమాలయ పర్వత శిఖరాలు జాతీయ జెండాలోని మూడు రంగులతో నిండిపోయాయి. 14,000 అడుగుల ఎత్తులో సైనికులు, స్థానిక గిరిజనులు కలిసి 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని చేతబూని కదం తొక్కారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లా చునా సరిహద్దు ప్రాంతంలో ఈ అద్భుతమైన, అపూర్వమైన దృశ్యం ఆవిష్కృతమైంది. భారత సైన్యానికి చెందిన గజరాజ్ కార్ప్స్ ఈ తిరంగా యాత్రకు నేతృత్వం వహించింది. ఈ యాత్రలో 160 మంది గోర్ఖా సైనికులు, 25మంది ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) సిబ్బందితో పాటు మాగో, చునావంటి మారుమూల పల్లెల నుంచి సుమారు 150మంది గ్రామస్థులు పాల్గొన్నారు. పసిపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ భుజం భుజం కలిపి నడవడంతో ఆ ప్రాంతమంతా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ వర్ణాలతో నిండి పోయింది. అసిస్టెంట్ కమిషనర్ ఛుటన్ వాంగ్చు నేతృత్వంలోని సివిల్ అడ్మినిస్ట్రేషన్ ఈ కార్యక్రమంలో గ్రామస్థులను భాగస్వాములను చేసింది. ఈయాత్రలో వారణాసిలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టిబెటన్ స్టడీస్‌కు చెందిన 23మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు కూడా పాల్గొనడం విశేషం. ఈ భారీ ప్రదర్శన అనంతరం దేశభక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను కూడా ప్రదర్శించారు. యాత్రలో పాల్గొన్న సైనిక, పౌరవిభాగాలు, గ్రామస్థులు కలిసి ప్లాస్టిక్‌రహిత జోన్ పేరుతో పరిశుభ్రతా కార్యక్రమంచేపట్టారు. ఆ ప్రాంతంలోని వ్యర్థాలను తొలగించి, సున్నితమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పారు. ఈకార్యక్రమంపై అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ హర్షం వ్యక్తం చేశారు. శిఖరాగ్ర ప్రాంతాల్లో ఇదే నిజమైన భారతస్ఫూర్తి అని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా మాగో, చునా గ్రామాల్లోని ప్రతిఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేసి స్థానికులు తమ దేశభక్తిని చాటుకున్నారు. స్వాతంత్రం అనేది అందరి సమష్టి బాధ్యత అని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది.

# చషోటి వరదల్లో మృతుల సంఖ్య 65

### ఇప్పటికీ ఆచూకీ తెలియని 500 మంది

### అన్నివిధాలా ఆదుకుంటామని మోడీ భరోసా

**శ్రీనగర్, ఆగస్టు 15:** జమ్ముకాశ్మీర్ కొండల్లో నెలకొన్న ఆకస్మిక వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 65కి పెరిగింది. ఆకస్మిక వరదల్లో ఇప్పటికీ 500 మందికిపైగా ఆచూకీ తెలియడంలేదని వెల్లడి అయింది. తీవ్ర గాయాలతో బాధపడుతున్న 167 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కిష్త్‌వార్‌జిల్లాలోని చషోటి గ్రామంలో సంభవించిన ఈ వరదలు ప్రకృతి భయానక వాతావరణాన్ని సృష్టించినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా 500 మందికిపైగా ఇప్పటికీ అ వరదల్లో చిక్కుకుని ఉంటారని చెపుతున్నారు. ఈ సంఖ్య సుమారు 1000ని దాటవచ్చని మరికొందరు చెపుతున్నారు. తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఒమర్ అబ్దుల్లా చషోటి గ్రామం విలయంపై ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోడీ ఇప్పటికే ఈ పరిస్థితిపై వాకబు చేసారని, తనతో ఫోన్‌లోమాట్లాడారని, జమ్ము కాశ్మీర్ విలయంనుంచి రాష్ట్రానికి అవసరమైనంత తోడ్పాటును అందిస్తామని చెప్పారు. మా ప్రభుత్వం, మారాష్ట్రప్రజలు ఈ మేఘవిస్ఫోటనంతో అపారనష్టం చవిచూసారని, అనేక మంది దుర్మరణం పాలయ్యారని, రాష్ట్రచరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా నష్టం సంభవించిందని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఆర్మీ సేవలతోపాటు స్థానిక వలంటీర్లుకూడా స్వచ్ఛందంగా సేవల్లోకి వస్తున్నట్లు తెలిపారు. జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం ఇందుకోసం ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేసింది. గుల్బర్గా పద్దార్‌వద్ద ఈ నంబర్లు ఏర్పాటుచేసింది. 300 మంది సైనిక బృందం సేవల్లో పాల్గొంటున్నది. మృతదేహాల్లో 21 మందిని ఇప్పటివరకూ గుర్తించారు. ఈ మేఘ విస్ఫోటనం కారణంగా మచైల్ మాతా దేవి దర్శనానికి వెళుతున్న యాత్రీకులు ఒక్కసారిగా వరదబారిన పడ్డారు. అనేకమంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు మరింతగా గల్లంతయ్యారు. పలు భవనాలు, దుకాణాలు తుడిచిపెట్టుకుపోయాయి. వరదల విషాదంతో మచైల్ మాతాదేవి యాత్రను నిలిపివేసారు.



# సంక్షిప్తంగా..

## చెన్నైలో వైభవంగా స్వాతంత్ర్యవేడుకలు

**చెన్నై, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో వైభవంగా జరిగాయి. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు వి గ్రహానికి నివాళులు అర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక సేవకులు వూరా ఆంజనేయులు హాజరయ్యారు. ఎంతో మంది త్యాగానికి ప్రతీకే ఈ స్వాతంత్ర్యం అని, వారిసేవలను మనం ఎప్పటికీ మరిచిపోకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం కమిటీ సభ్యులు జె.ఎం.నాయుడు, గుడిమెట్ల చెన్నయ్య, వూరా శశికళ, ఆచార్య విస్తారి శంకరరావు తది తరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. అందరికీ మిఠాయిలు పంచారు.



## దక్షిణ కొరియా 'సైన్యం'లో కలవరం



**సియోల్, ఆగస్టు 15:** దక్షిణ కొరియా సైనిక శక్తి గత ఆరేళ్లలో 20 శాతం తగ్గినట్లు అక్కడి రక్షణ శాఖతాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ జననాల రేటు ఉన్న దేశంలో సైనిక సేవల నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోందని తెలిపింది. సైనిక సేవలందించే వారి సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడం అధికారుల సంఖ్యలోనూ తగ్గుదలకు కారణమవుతోందని రక్షణ శాఖ వెల్లడించింది. తద్వారా కార్యకలాపాల నిర్వహణ ఇబ్బందిగా మారినట్లు అభిప్రాయపడింది. దక్షిణకొరియా సైన్యంలో చేరేందుకు కనీస వయస్సు 20 యేళ్లు. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో ఈ వయసున్నవారి సంఖ్య 2019-25 మధ్యకాలంలోనే 30 శాతం తగ్గినట్లు అంచనా. 2000 సంవత్సరం మొదట్లో సైన్యం సంఖ్య 6.9 లక్షలుగా ఉండగా ప్రస్తుతం అది 4.5 లక్షలకు తగ్గింది. గడిచిన ఆరేళ్లలోనే సైన్యంలో 20 శాతం (దాదాపు 1.3లక్షలు) క్షీణత కనిపించింది. 2019లో ఈ సంఖ్య 5.63 లక్షలుగా ఉంది. అపే ఉత్తర కొరియాకు మాత్రం భారీ సైనిక శక్తి ఉంది. రక్షణ శాఖ వివరాల ప్రకారం.. 2022లో కిమ్ దాదాపు 12 లక్షల సైన్యాన్ని కలిగి ఉన్నట్లు అంచనా.

## మూడేళ్లుగా ఆస్పత్రిలోనే థాయిలాండ్ యువరాణి



**బ్యాంకాక్, ఆగస్టు 15:** థాయిలాండ్ యువరాణి బజ్రకిటియభా మూడేళ్ల కిందట ఒక్కసారిగా కుప్పకూలి అస్వస్థతకు గురయ్యారు. ఆమెను ఆ స్పత్రిలో చేర్చగా ఇప్పటికీ చికిత్స పొందుతు న్నారు. అసలు ఆమెకు ఏమైందో ఎవరికీ తెలి యదు. తాజాగా యువరాణి ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వర్గాలు, రాయల్ ప్యాలెస్ ప్రకటన విడుదల చేశాయి. ఆమె ఊపిరితిత్తులు, కిడ్నీలు పూర్తిగా చెడిపోయాయని, వాటిని వైద్య పరికరాల సాయంతో పనిచేసేలా చేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించగా బజ్రకిటియభా రక్తంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తేలిం దన్నారు. చికిత్స కొనసాగుతోందని పేర్కొ న్నారు. డిసెంబరు 2022లో ఓ కార్యక్రమంలో భాగంగా పెంపుడు శునకాలకు శిక్షణ ఇస్తోన్న సమయంలో బజ్రకిటియభా ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. దీంతో ఆమెను బ్యాంకాక్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మూడేళ్ల తర్వాత మళ్లీ హెల్త్ బులెటిన్ బయటి కొచ్చింది.

## ఆస్ట్రేలియాలో రెచ్చిపోయిన ఖలిస్థానీలు

**కాన్‌బెర్రా, ఆగస్టు 15:** ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించుకుంటున్నారు. ఆస్ట్రేలియాలోని కాన్సులేట్ కార్యాలయంలో కూడా వేడుకలు నిర్వహణకు సిద్ధం కాగా అక్కడకు వచ్చిన ఖలిస్థానీయులు రెచ్చిపోయారు. మెల్‌బోర్న్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించేందుకు భారతీయులు కాన్సులేట్ వద్ద హాజరయ్యారు. దేశభక్తి గీతాలు పాడుతుండగా కొందరు ఖలిస్థానీలు చొరబడ్డారు. తర్వాత తమ జెండా ఊపుతూ నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీ సులు జోక్యం చేసు కుని ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకు న్నారు.

కాగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ భారతీయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ కాలంగా భారత్‌తో తమ స్నేహం కొనసాగు తోందని, న్యూ ఢిల్లీ విజయాన్ని తాము కూడా నిర్వహించుకుం టున్నామని చెప్పారు.

# గాంధీ, నెహ్రూ త్యాగఫలం నేటి స్వాతంత్య్ర ఫలం

## గాంధీభవన్‌లో పతాకావిష్కరణ కార్యక్రమంలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** గాంధీ, నెహ్రూలాతో పాటు ఎందరో వీరుల త్యాగఫలం నేటి మన స్వాతంత్ర్య ఫలం అని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పతాకవిష్కరణ చేసిన మహేష్ కుమార్‌గౌడ్ తెలంగాణ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం శుభా కాంక్షలు తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, చిత్తరంజన్‌దాస్ వంటి వీరుల సాహసోపేత సాహసాలతో స్వాతంత్ర కాంక్ష ప్రజల్లో బీజం పడిందని అన్నారు. దేశంలో కాంగ్రెస్, గాంధీ కుటుంబం లేకపోతే స్వాతంత్ర్యం లేదని అన్నారు. గాంధీ నేతృత్వంలో నెహ్రూ 9 ఏళ్ల జైలు జీవితం గడిపారు. వారి త్యాగాలు గుర్తు చేసుకోవాలి. బ్రిటిష్ పాలకుల అడుగులకు మడుగులు వత్తిన వారు బిజెపి నాయకులు. స్వాతంత్రం వచ్చిన అనంతరం బిజెపి వాళ్లు, అధికారాలు పరమా వధిగా కుర్చీ కోసం విచ్చిన్న కరమైన రాజకీయాలు చేస్తున్నారని విభజించు, పాలించు అనే బ్రిటిష్ వారి విధానంతో ఈ దేశాన్ని బిజెపి పాలిస్తున్నారని అన్నారు. పెద్దల కోసం పేదల నడ్డి విరుస్తున్నారు. డీజిల్ పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయి. పెత్తందారుల కోసం పాలన చేస్తున్నారని ఆరోపించారు. గాడ్సే వారసులు దేశంలో రాజ్యాంగం కాలరాస్తూ ప్రజలపై ఆంక్షలు పెడుతూ చేయకూడని విధంగా నేడు రాజ్యాంగ వ్యవస్థలను హననం చేస్తూ పాలన చేస్తున్నారని ఆవేదన చెందారు.విపరీతంగా ఓట్ల దొంగ తనం జరిగిం దని రాహుల్‌గాంధీ నిరూపించారని తెలిపారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్ల ను తొలగిం చారు. సుప్రీంకోర్టు కేంద్రానికి మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. మహారాష్ట్రలో పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన మనం అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు ఓడి పోయామో అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. ఒక సింగిల్ బెడ్ రూమ్ ఇంట్లో 45 ఓట్లు ఎలా ఉంటాయని అడిగారు. రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. భారత్ జోడో యాత్ర చేసి ప్రజల సమస్యలు రాహుల్ తెలుసుకున్నారు. జనాభా వాటా ప్రకారం రిజర్వేషన్ దక్కాలని డిమాండ్ రాహుల్ చేమడంతో ఇప్పుడు అన్ని పార్టీలు కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నాయని అన్నారు. కులగణన చేసి బిసి బిల్లు తీసుకు రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధి నిరూపించుకున్నారని ఆయన వివ రించారు. సన్న బియ్యం చరిత్రాత్మకమని, డబుల్‌బెడ్ ఇళ్ల పేరుతో వచ్చిన కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నామని తెలిపారు. ప్రజల కళ్లలో ఆనందం చూస్తే ఇందిరమ్మ పాలనకు ఒకళ్లరు కలుగుతోందని ఆయన అన్నారు.అన్ని రంగాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందని చెప్పారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం, పార్టీ ముందుకు వెళ్తుంది. బీద ప్రజల శ్రేయస్సు కోసం సంక్షేమం అందుతుంది. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ ను తీర్చి దిద్దటమే కాంగ్రెస్ లక్ష్యమని ఆయన తెలిపారు. పతాకావిష్కరణలో జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ హనుమంతరావు, పీసీసీ సలహా కమిటీ సభ్యులు కుసుమ కుమార్, సేవదళ్ చైర్మన్ జితేందర్ కార్పొరేషన్ చైర్మన్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## అరణ్యభవన్‌లో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** అటవీశాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి.. అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారిణి సువర్ణ జాతీయ జెండాను ఆవిష్క రించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం రావటం సంతోషంగా ఉందని, 200 ఏళ్ల బ్రిటిష్ ఏలుబడిలో ఉన్న మన దేశం అన్ని రంగాల్లో దోపిడీకి గురైందని వాటన్నింటినీ అధిగమించి 79 ఏళ్ల స్వాతంత్రంతో ప్రపంచ అగ్ర దేశాలతో పోటీపడి అభివృద్ధి లో ముందుందని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం కూడా దేశంలో నంబర్ వన్ రైజింగ్ స్టేట్ గా నిలిచిందన్నారు..పర్యావరణ రక్షణకు అధిక ప్రాధాన్యతను ఇస్తోందని ఆమె గుర్తు చేశారు.దీనిని శాఖలో పని చేస్తున్న ప్రతీ ఒక్కరూ గుర్తు పెట్టుకుని నిబద్ధతతో విధులు నిర్వ హించాలన్నారు. విధినిర్వహణలో మంచి ప్రతిభ చూపిన ఉద్యోగులకు పుర స్కారాలను సీనియర్ అధికారులు చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖకు చెందిన సీనియర్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్దఎత్తున పాల్గొని అమరవీరులకు నివాళి అర్పించారు.

## డిజిపి జితేందర్‌కు మాతృవియోగం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపి జితేందర్‌కు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి కృష్ణగోయల్ (85) శుక్రవారం ఉదయం మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణగోయల్ జూబ్లీహిల్స్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడే ఆమె తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానం లో ఆమె అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా డిజిపి జితేందర్ తల్లి మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులతోపాటు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు తీవ్రసంతాపం వ్యక్తం చేశారు.

## ఎఐఎఫ్‌టిఓ ఉపాధ్యక్షుడుగా చిత్తలూరి ప్రసాద్ నియామకం

### అభినందనలు తెలిపిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఏఐఎఫ్‌టివో)ఉపాధ్యక్షులుగా సీనియర్ ఉపాధ్యాయులు చిత్త లూరి ప్రసాద్ నియామితులయ్యారు. అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులుగా చిత్తలూరి ప్రసాద్‌ను నియమిస్తూ ఏఐఎఫ్‌టివో సెక్రటరీ జనరల్ సిఎల్ రోజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబం ధించిన ఉత్తర్వులను పిఆర్‌టియు టిఎస్ కార్యాలయానికి పంపించారు. ఈ నియామకాన్ని ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా చిత్తలూరి ప్రసాద్‌కి శుక్రవారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాకి చెందిన పిఆర్‌టియు టిఎస్ సీనియర్ నాయ కులైన చిత్తలూరి ప్రసాద్‌కి ఏఐఎఫ్ టివో ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఏఐఎఫ్‌టివో జాతీయ నాయ కులుగా ప్రసాద్ నియమితులు కావడం పట్ల నల్గొండ-వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అభినలు తెలిపారు. చిత్తలూరి ప్రసాద్ జిల్లా నాయకులుగా 6 సంవత్సరాలు, 20 సం వత్సరాలు రాష్ట్ర నాయకులుగా కొనసాగుతున్నారు. పిఆర్‌టియు టిఎస్ నిర్వ హిస్తున్న అధికార మాసపత్రికలో సంపాదకవర్గ సభ్యునిగా, ఉపసంపా దకులుగా పనిచేసిన తన సేవలను గుర్తించి తనకు ఏఐఎఫ్‌టివో ఉపాధ్యక్షుడుగా నియమించిన సంఘం సెక్రటరీ జనరల్ సిఎల్ రోజ్‌కి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

### సహకార సంఘాలు, బ్యాంకుల

## పాలకవర్గాల కాలపరిమితి మరోసారి పెంపు


**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డిసి సిబి), తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టిజి క్యాబ్) పర్సన్ ఇన్ ఛార్జి (పిఐసి)గా వ్యవహరిస్తున్న పాలక వర్గాల కాలపరిమితిని మరోసారి పెంచుతూ రాష్ట్రసర్కార్ నిర్ణయం తీసుకుంది. మరో 6 నెలల పాటు పాలకవర్గాల కాలపరిమితిని పొడిగిస్తూ సహకార శాఖ కార్యదర్శి ఎం రఘునాద్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం ఈ నెల 14వ తేదీ నుండి అమల్లో ఉంటాయని అందులో పేర్కొన్నారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలోని పిఎసిఎస్, డిసిసిబి, టిజి క్యాబ్ పాలకవర్గాల కాలపరిమితి ఫిబ్రవరి 16వ తేదీతో ముగిసింది. పాలకవర్గాలకు పదవీ కాలం ముగియడంతో వాటిని ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సాధారణంగా పాలక వర్గాల పదవీ కాలానికి ఆరు నెలల సమయం ఉండగానే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. అయితే కొత్త పాలకవర్గాలకు ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత కనపరచకపోవడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించేందుకు సహకార శాఖ సిద్ధమైంది. అయితే పాత పాలక వర్గానికే పర్సన్ ఇన్‌చార్జిగా నియమిం చాలనే డిమాండ్ తెరముందుకు వచ్చింది. దీంతో ప్రభుత్వం పాత పాలక వర్గాలకే పర్సన్ ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించింది. ఆ సమయంలో వీరి పదవీ కాలం 6 నెలల పాటు పొడిగించింది. ఈ కాలపరిమితి నేటితో ముగియడంతో మరోసారి పొడిగించింది.

## మాచారంలో ఘోరప్రమాదం

### లారీని ఢీకొన్న వోల్వో బస్సు..

### నలుగురు మృతి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జడ్చర్ల, ఆగస్టు 15, ప్రభాతవార్త :** కడప నుంచి హైద రాబాద్ బయలుదేరిన సీజీఆర్ ట్రావెల్స్ బస్సు మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం వద్ద అతివేగంతో వెనకాల నుంచి లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలు గురు మృతి చెందారు.. వివరాలిలా ఉన్నాయి.




గురువారం రాత్రి 35 మంది ప్రయాణికులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప నుంచి హైదరాబాద్ బయలుదేరిన బస్సు శుక్రవారం తెల్లవారుజామున మాచారం బ్రిడ్జి వద్ద తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో అతి వేగంతో వెనకాల నుంచి లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ నరసింహతో పాటు హైదరాబాదుకు చెందిన మరో ఇద్దరు మహిళలు గుర్రం రాధిక, లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను మహబూబ్నగర్ జిల్లా దావకానకు తరలించగా చికిత్స పంతో మరో వ్యక్తి నరసింహా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ అజాగ్రత్త అతివేగంవల్లే ప్రమాదం జరిగినట్లు తోటి ప్రయాణికులు తెలిపారు. కెమెరాకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జడ్చర్ల సిఐ కమలాకర్ వెల్లడించారు.

## స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను మర్చిపోవద్దు

### ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉన్నత విద్యాలయాల్లో, విశ్వవిద్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ, రాష్ట్రంలో ఉన్న సాంకేతిక విశ్వవిద్యాలయమైన జేఎన్‌టియులో, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలోనూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమములో తెలంగాణ ఉన్న త విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాల కిష్టారెడ్డి జాతీయ జెండాను ఎగురవేయడం జరిగింది.

కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, సెక్రటరీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాం వెంకటేష్ తెలంగాణ ఉన్నత విద్యామండలి ఉద్యోగులు, తెలంగాణ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టిఏఎఫ్ఆర్‌సి) ఉద్యోగులు పాల్గొన్నారు. తెలం గాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మనం మర్చిపోకూడదన్నారు. భారతదేశంలో అతిపిన్న వయసు కలిగిన తెలం గాణ రాష్ట్రం ఉన్నత విద్యారంగంలో విప్లవా త్మకమైన మార్పులను తీసుకొచ్చి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా అవతరిస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి రానున్న సంవత్సరాలలో రైజింగ్ తెలంగాణ, తెలంగాణ ఉన్నత విద్యా మండలి తెలంగాణ రైజింగ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు, నిరంతరం మారుతున్న పోటీ ప్రపంచంలో యువత సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను వారికి అందించేందుకు కృషి చేస్తుందన్నారు.

## సంక్షేమ ఫలాల అమలు ఘనత కాంగ్రెస్ సర్కారుదే



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### అనంతగిరిని వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తాం

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ప్రపంచ వేదికపై తెలంగాణ ను సగర్వంగా నిలబెట్టే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జిల్లా సాయుధబలగాల గౌరవవందనం స్వీకరించి, అనంతరం జాతీయ జెండా ను ఆవిష్కరించి మాట్లాడారు. చరిత్రలో ఆగస్టు 15వ తేదీకి విశిష్టమైన స్థానం ఉందని, మహానుభావుల నాయకత్వంలో, ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం లభిం చిందన్నారు. బి.ఆర్.అంబేద్కర్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగం, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచేలా భారతదేశాన్ని నిలబెట్టిందని తెలిపారు. సంక్షేమ ఫలాల అమలు లో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రను తిరగరాసిందని పేర్కొన్నారు. యేడాది న్నరలోనే 1 లక్ష 13 వేల కోట్ల రూపాయల ఒ ఖర్చు చేసిందన్నారు. గత యేడాది ఇదే ఆగస్టు 15న రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టి 25 లక్షల 35వేల మంది రైతులకు 20 వేల 616 కోట్ల రుణమాఫీ చేసి ప్రభుత్వం కొత్త చరిత్ర రాసిందన్నారు. కోటి మంది మహిళల ను కోటీశ్వ రుల ను చేయాలనే లక్ష్యంతో మహిళా శక్తి క్యాంటీ న్లు ఏర్పాటు చేయించడం జరిగిందని గుర్తు చేశారు. వికారాబాద్‌లో రైతులు, వినియోగదారుల సౌకర్యం కోసం 50 లక్షలతో రైతు బజారు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా యువత ను తీర్చిదిద్దేందుకు తాండూరు, వికారా బాద్, మర్పల్లి ఐటిఐల ఒ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ వారి సహకారంతో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చడానికి 23 కోట్లతో నిర్మిస్తున్న భవనాలు పూర్తి దశలో ఉన్నాయని తెలిపారు. పర్యాటక అభివృద్ధి కోసం జిల్లా పరిధిలో రూ. 10 కోట్ల నిధులతో అనంత గిరి, కోట్‌పల్లి, గొట్లపల్లి అంతారం, బొంరాస్‌పేట్, జాఫర్‌పల్లిలో 5 పట్టణ ఉద్యాన వనాలు మంజూరయ్యాయని తెలిపారు. అనంతగిరిగుట్టను వెయ్యి కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని ఈ ప్రాజెక్టు ద్వారా 3 వేల మందికి ఉద్యోగాలు లభించడంతో పాటుగా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తా యని ఆయన తెలిపారు. అనంతగిరి స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా అనంతగిరి, కోట్‌పల్లి ప్రాజెక్టు, సర్పన్ పల్లి, బుగ్గ రామలింగేశ్వరం 110 కోట్లు రూపాయలతో పర్యా టక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేశామ న్నారు. వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం కోసం 235 కోట్ల రూ పాయలు మం జూరు చేయగా, ఈ పనులు శరవేగంగా కొనసా గుతు న్నాయని ఆయన తెలిపారు. విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిం చాయి. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ అధికారులకు సభాపతిచేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో పరిగి, తాండూర్ శాసన సభ్యులు టి. రామ్మోహన్‌రెడ్డి, బి. మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ కె.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్, బొగ్గు, బ్యాంకుల్లో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు కర్ణాటకలోని కొంత భాగానికి విస్తరించి ఉన్న సికింద్రాబాద్‌లోని పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్1 ప్రాంతీయ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోమన్ యాదవ్ ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన స్వాతంత్ర్య యోధులు కేవలం విదేశీ పాలన నుండి విముక్తి మాత్రమే కాదని, ప్రతి ఒక్కరికి న్యాయం, సమాన అవకాశాలు, మంచి జీవితం కలిగిన దేశంగా ఉండాలని కలలుగన్నారని చెప్పారు. భారత్ అనేక భాషలు, మతాలు, సంస్కృతులతో నిండి ఉందన్నారు. ఒకరినొకరు గౌరవించి, అర్థం చేసుకుంటే, కలిసి ఎదగగలుగుతామని వెల్లడించారు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని నయా భారత్ అనే థీమ్ తో జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో సిజిఎంలు ఏ.సి. శంకరయ్య, అరుణ్ కుమార్, ప్రవీణ్ కుమార్, వెంకట ఎస్.వి., బి.బి. రాథ్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**ట్రాన్స్‌కోలో..**

తెలంగాణ లిమిటెడ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో)లో 79వ స్వా తంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలోని సంస్థ ప్రధాన కార్యలయంలో సిఎండి ఎస్. హరీష్ జాతీయ జెండాను ఎగురవేశారు.

**సింగరేణిలో..**

సింగరేణిలో ఆ సంస్థ సిఎండి బలరామ్ జాతీయ జెండాను ఎగురవేశారు. దీన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడతూ సంస్థ దేశ, తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును అందించడమే కాక మరో నాలుగు రాష్ట్రాల విద్యుత్ అవసరాలు తీర్చడం కోసం తగినంత బొగ్గును సరఫరా చేయటం జరుగుతుందని వివరించారు. అలాగే 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు, మరో 245.5 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే బొగ్గు ఉత్పత్తిని అనతి కాలంలోనే 100 మిలియన్ టన్నులకు పెంచాలని, థర్మల్ విద్యుత్‌ను 3,000 మెగావాట్లకు, సోలార్ విద్యుత్‌ను 5,000 మెగావాట్లకు పెంచాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అంతే కాకుండా కీలక ఖనిజాల రంగంలోకి కూడా ప్రవేశించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇతర సంస్థలు బొగ్గు ధరలను తక్కువకు అందిస్తున్నాయని, దీంతో సింగరేణి భవిష్యత్ ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడి పెద్ద సవాల్ అయిందన్నారు. బొగ్గు ధర తగ్గాలంటే ఉత్పత్తి ఖర్చు తగ్గించుకోవాలని, అందుకు యంత్రాలు, పని గంటల సమయాన్ని వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తి పెరుగడంతో పాటు, రేట్లు తగ్గుతయాని పేర్కొన్నారు.

**స్టేట్ బ్యాంక్‌లో..**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరా బాద్ సర్కిల్ కోఠిలోని ప్రధాన కార్యాలయంలో సిజిఎం ఎస్ రాధాకృష్ణన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం ఇప్పుడు ఆహార ధాన్యాలను ఎగుమతి చేసి ఆర్థిక స్థితిస్థాపకతను సాధించే దశకు చేరుకుందన్నారు. పరిశ్రమలు, సేవల నుండి విద్య, ఆరోగ్య సంరక్షణ వరకు, స్టేట్ బ్యాంక్ దేశ అభివృద్ధికి మూలస్తంభంగా ఉందని చెప్పారు. అతి పెద్ద వాణిజ్య బ్యాంకుతో పాటు, లాభదాయకంగా, ప్రపంచవ్యాంగా అత్యంత విశ్వసనీయ బ్రాండ్లలో ఒకటిగా ఎస్‌బిఐ ఉందన్నారు. తెలంగాణలో 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది ప్రతి జిల్లాలో మార్కెట్ వాటాను 1 శాతం పెంచాలని నిర్ణయించినట్లు చెప్పారు.

## ఈ ఖరీఫ్‌లో 1.08 కోట్లకు చేరిన సాగు

### అత్యధికంగా 45.20 లక్షల ఎకరాల్లో వరి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఖరీఫ్ సాగు జోరం దుకుంది. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 81.92 శాతం మేర 1,08,49,125 ఎకరాల్లో సాగయ్యాయి. గత సంవత్సరం ఇదే కాలానికి పోల్చి చూస్తే 17,27,748 ఎకరాలు ఎక్కువగా ఈసారి సాగైంది. గత ఏడాది ఖరీఫ్‌లో ఇదే సమయానికి 91,21,377 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించింది. ఈ ఖరీఫ్‌లో వరి, మొక్కజొన్న, జొనన, కంది తదితర ఆహార ధాన్యాల సాగు 57,03,978 ఎకరాల్లోను, వేరుశెనగ, సోయాబీన్ తదితర ఆయిల్ పంటలు సాగయ్యాయి. వీటిలో అత్యధికంగా వరికి సంబంధించి 45,20,974 ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేయగా, రెండో స్థానంలో 44,63,517 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అలాగే 5,96,892 ఎకరాల్లో మొక్కజొన్న, 4,70,273 ఎకరాల్లో కంది, 3,59,055 ఎకరాల్లో సోయాబీన్ పంటలు వేశారు. కాగా రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 8,39,252 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అత్యల్పంగా మల్కాజిగిరి జిల్లాలో 14,297 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు వేశారు.

## ఓట్ల తస్కరణతోనే బిజెపి మూడుసార్లు అధికారం

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** బిజెపి ఎన్నికలకమిషన్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసి దొంగ ఓట్లతో ఎలా అధికారంలోకి ఎలా వచ్చిందో ఆ విషయాన్ని రాహుల్‌గాంధీ అని బయటకు తెచ్చాడని కాంగ్రెస్ సినియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ బిజెపి మూడు సార్లు అధికారంలోకి రావడానికి ఓట్ల దొంగతనం కారణం అని ఆరోపించారు. ఇద్దరు కూడా ఉండలేని ఇంట్లో వంద మంది ఓటర్లు నమోదు చేశారని ఆయన ఆవేదన చెందారు. బిజెపి నాయకత్వం ఇంత అక్రమాలు చేస్తున్నా ఎన్నికల కమిషన్ నిద్రపోతుందా..? ఎందుకు నివారించడం లేదు అని ప్రశ్నించారు. చనిపోయినట్లు చూపి తొలగించిన ఓటర్లు కూడా రాహుల్ గాంధీ దగ్గరికి వచ్చారని ఆయన తెలిపారు. బిజెపి ప్రభు త్వానికి కాలి కింద భూమి కదులుతుందని ఎన్ని కల కమిషన్ బిజెపి కి తొత్తులుగా మారారని ఆయన అన్నారు. ఓట్ల చోరీ గురించి రాహుల్ గాంధీ గురించి మాట్లాడుతుంటే సమాధానం చెప్ప కోలేని బిజెపి నేతలు సోనియాగాంధీ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. అటల్ బిహారీ వాజ్ పాయ్..అద్వానీ లాంటి విలువలతో నడుస్తున్న బిజెపి కాదుఅన్నారు.బిజెపి సోనియా, రాహుల్ గాంధీ కుటుంబంపై బురదజల్లడం పనిగా పెట్టు కుందని అన్నారు. దేశ ప్రజలకు భద్రతతో కూడిన పాలన రాహుల్‌గాంధీ కుటుంబం అందించిందని ఆయన తెలిపారు. దేశం కోసం త్యాగాలు చేయని వాళ్లు త్యాగాల కుటుం బంపై నిందలు వేస్తుందని ఇది బాధాకరమైన అంశమని అన్నారు. స్వతంత్ర ఉద్యమాలలో బిజెపి నేతల పాత్రనే లేదని ఆయన అన్నారు.


మోడీ, అమిత్‌షా వాళ్ల తల్లిదండ్రులను అడిగితే గాంధీ కుటుంబం గొప్పతనం చెప్తారు. ధర్మం గురించి మాట్లాడే బిజెపినేతలు వారి వారసత్వం ఎట్లా ఉంటుందో తెలియదా?అని ప్రశ్నించారు. భర్త ఏ కులమైతే భార్యది అదే కులమవుతుందనే తెలివి కూడా లేదా? అని నిలదీశారు. ఏం మనుషులయ్యా మీరు రాహుల్ గాంధీ కుటుంబం కాశ్మీర్ బ్రాహ్మణ కుటుంబమని జగ్గారెడ్డి ధ్రువీకరించారు.

బిజెపి నేతలు మూర్ఖులు.. రాహుల్‌గాంధీది బ్రాహ్మణ కుటుంబమని ప్రజలు గుర్తించాలని కోరారు. సోనియాగాంధీని భారతీయ మహిళగానే దేశ ప్రజలు కూడా ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. ఈ దేశ సంప్రదాయాలకు కట్టుబడి ఉంది సోనియా గాంధీ అని ఆయన చెప్పారు. రాజీవ్‌గాంధీ చనిపోయాక ఏడేళ్లు సోనియాగాంధీ అజ్ఞాత జీవితం గడిపారని ప్రజలు కోరుకుంటే సోనియా గాంధీ రాజకీయాల్లోకి వచ్చారని ఆయన వివరించారు. దేశంలో పార్టీలురాజకీయాలు అధ్యయనం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల ఆలోచన మేరకు సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షురాలుగా పనిచేశారని తెలి పారు. మిత్రపక్షాలు కోరినా ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయలేదని, సోనియా గాంధీ మన్మోహన్ సింగ్‌నే పదేళ్ళు ప్రధానమంత్రిగా కొనసాగించారని ఆమె తలుచు కొంటే రాహుల్‌ను 2009లోనే ప్రధానిగా చేసే వారని ఆయన తెలిపారు.

## ద.మ.రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

## స్వాతంత్య్రం కోసం ఎందరో సమరయోధుల జీవితాలు అంకితం

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 15, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని సికింద రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఘనంగా జరుపుకున్నది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనే జర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ జాతీయ జెండాను ఎగురవేసి, ఆర్‌పిఎఫ్ బృందంచే జాతీయ గౌరవ వందనం స్వీకరిం చారు. ఈ వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమి షనర్ అరోమాసింగ్ ఠాకూర్, సీనియర్ రైల్వే అధికా రులు, సిబ్బంది, కుటుంబసభ్యులు, రైల్వే పాఠశాల, కళాశాల నుండి విద్యార్థులు కూడా పాల్గొన్నారు. స్వాతం త్ర్య వేడుకలను పురస్కరించుకుని రైల్వే డిగ్రీ కళాశాల, జూని యర్ కళాశాల రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ విద్యార్థుల సాం స్కృతిక కార్యక్రమం,రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నిర్వహించిన కమాండో షో, డాగ్‌షో ప్రేక్షకులను అబ్బుర పరిచేలా ప్రదర్శించారు. స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వ హించారు. జీఎం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధులు, దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఎందరో కీర్తించబడని వీరుల అపు రూపమైన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. జోన్ 2025 ఏప్రిల్ నుండి జూలై వరకు, 6,960 కోట్ల స్థూల ఆదా యాన్ని నమోదు చేసి, గత సంవత్సరం ఇదే కాలంలో సాధించిన.. 6,894 కోట్లను అధిగమించింది. సరుకు రవాణా లోడింగ్లో మునుపెన్నడూ లేని విధంగా 49 మిలియన్ టన్నుల రికార్డు స్థాయి నమోదు చేసింద న్నారు. మన జోన్ చరిత్రలో ఏ ఆర్థిక సంవత్సరం లోనైనా మొదటి నాలుగు నెలలకు ఇదే అత్యధికం. సరకు రవాణా ఆదాయం.. 4,601 కోట్లు కాగా, 96 మిలియన్ల ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చి ప్రయా ణికుల విభా గంలో రూ. 1,990 కోట్ల ఆదా యం తో గుర్తించదగిన విజయాన్ని నమోదు చేసుకుందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి జోన్‌లో కొనసాగుతున్న ప్రధాన డబ్లింగ్, ట్రిప్లింగ్ ప్రాజెక్టులైన కాజీపేట విజయ వాడ, కాజీపేట బల్హార్షా విజయవాడ గూడూరు ట్రిప్లింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా మన్నారు. దీనితోపాటు, అనేక కొత్త ప్రాజెక్టులు అమలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కాజీపేట రైలు తయారీ యూనిట్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తవు తుందని, 2026 చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దక్షి ణ మధ్య రైల్వే సెలవు దినాల్లో ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి, 1,117 ప్రత్యేక రైలు సర్వీసులను నడిపిందని జనరల్ మేనేజర్ తెలియజేశారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

# ప్రపంచ మార్కెట్లను మనమే శాసించాలి

## పంద్రాగస్టు ప్రసంగంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రపంచ మార్కెట్‌లో నాణ్యమైన ఉత్పత్తులతో మన శక్తిసామర్థ్యాలు నిరూపించుకోవాలని ప్రధాని మోడీ పిలుపు నిచ్చారు. చరిత్రను లిఖించాల్సిన తరుణం ఇదేనని మనం ప్రపంచ మార్కెట్‌ను శాసించాలని, ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకోవాలని, నాణ్యమైన ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్‌లో మన సామర్థ్యం నిరూపించుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. తక్కువదర, అధిక నాణ్యత అని లక్ష్యంగా పెట్టుకోవాలని, ఆర్థిక స్వార్థం పెరుగుతోందని లక్ష్యాలుచేరుకోడానికి ముందు సాగాలని మోడీ అన్నారు. మనశక్తిని ఇతరులు తక్కువచేసి మాట్లాడటంతో వృధాచేయవద్దని మనల్ని మనం బలోపేతంచేసుకోవడంపై ఫోకస్ పెంచాలన్నారు. దేశంలోని వ్యాపారులు, దుకాణ దారులు స్వదేశీ ఉత్పత్తుల అమ్మకాలపై దృష్టిపెట్టాలన్నారు. ప్రపంచం మన పురోగతిని గమనిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలతో మార్పులు అవసరమైతే తెలియజేయాలని పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేకవిధానాలు సహించబోమని రైతులు మన ఆర్థికవ్యవస్థకు ఎంతో తోడ్పడతారన్న మోడీ అన్ని సందర్భాఆల్లో వారికి అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. ఇంధనరంగంలోను దేశాన్ని స్వయంసమృద్ధి దిశగా నడిపంచాలని సోలార్, గ్రీన్, హైడ్రోజన్‌వైపు దేశం ముందుకుపోవాలన్నారు. అణుఇంధనంవైపుకూడా దేశం వేగంగా అడుగులువేస్తోందన్నారు. అణువిద్యుత్‌లో ప్రైవేటు పెటుబడులను ఆహ్వానిస్తున్నామన్నారు. డీజిల్, పెట్రోలు దిగుమతులపై రూ. లక్షల కోట్లు ఖర్చుచేస్తున్నామని, కొత్త ఇంధనాల అభివృద్ధితో పెట్రోలియం ముడిచమురు దిగుమతులు తగ్గించాలన్నదే మన లక్ష్యమన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 12వసారి జాతీయజెండాను ఆవిష్కరించిన మోడీ ఎర్రకోట బురుజుపైనుంచి ఏకంగా 103 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించారు. గతేడాది ఇదేరోజు 98నిమిషాలపాటు ప్రసంగించారు.

# అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి సర్కార్ నోటిఫికేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు15:** స్వాతంత్ర దినోత్సవ కానుకగా తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ తెలిపింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా రాష్ట్రంలో 118 పోస్టులను భర్తీ చేయనుంది. అయితే ఈ నియామకాలకు రాత పరీక్ష నిర్వహిస్తామని, అందులో మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొంది. కాగా, జోన్ల వారీగా పోస్టులు, అర్హతలు,వేతనాల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు రిక్రూట్‌మెంట్ బోర్డు పేర్కొంది.

# 22న ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

## ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త :**తెలంగాణలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతీష్టాత్మకంగా ప్రారంభించింది. ప్రజా పాలనలో భాగంగా.. వీటికి దరఖాస్తులు స్వీకరించారు. వీరిలోని అర్హులను ఎంపిక చేసి.. లిస్ట్ 1, లిస్ట్ 2, లిస్ట్ 3లుగా విభజించారు. ప్రస్తుతం సొంత స్థలం ఉండి.. దానిలో ఇంటిని నిర్మించే వారిని మొదటి లిస్ట్ కింద విభజించారు. ప్రస్తుతం చాలామంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున నిధులు కూడా జమ అయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు కూడా పూర్తి చేసి.. గృహ ప్రవేశానికి రెడీగా ఉన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు శుభవార్త అందించనుంది. ఈ నెలలోనే కొన్ని ఇళ్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.శ్రావణ మాసం ఈ నెల 22తో ముగుస్తుండటంతో. గృహ ప్రవేశాలు చేయించాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు సమాచారం. సహజంగా భాద్రపద మాసాన్ని శుభకార్యాలకు శూన్యమాసంగా పరిగణిస్తారు కాబట్టి.. శ్రావణ మాసంలోనే ఈ కార్యక్రమాలను పూర్తి చేయాలని చూస్తున్నారు.ఈ పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట సెగ్మెంట్ పరిధిలోని చంద్రుగొండ మండలంలో ఇప్పటికే సుమారు 50 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వీటిని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాణ పనులలో పారదర్శకత కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ పథకం కోసం ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రతి ఇంటి నిర్మాణ స్థలాన్ని జియోట్యాగింగ్ చేసి, యాప్‌లో పొందుపరిచారు. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లు అందేలా పకడ్బందీ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ పథకం నిర్మాణ వేగాన్ని పెంచడానికి, ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు, నిర్మాణ పనులు వేగంగా పూర్తవుతున్నాయి. కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు చివరి దశకు చేరుకోగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రభుత్వం ఇళ్లను ప్రారంభించడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో.. పథకంపై ప్రజల్లో ఆశలు పెరుగుతున్నాయి ఇందిరమ్మ ఇళ్ల పథకం గత ప్రభుత్వం అమలు చేసిన డబుల్ బెడ్‌రూమ్ పథకం మాదిరిగా కాకుండా, నిధులు నేరుగా లబ్ధిదారులకే అందిస్తారు. లబ్ధిదారులకు రూ. 5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వ లక్ష్యం. త్వరలో లిస్ట్ 2 జాబితాలో అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను అందించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సొంత స్థలం లేని వారికి ప్రభుత్వం స్థలంతో పాటు.. రూ.5 లక్షలను అందించనుంది. వీరు కూడా లిస్ట్ 2లో భాగంగా ఉంటారు.

# ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు

## 10 మంది మృతి, 35 మందికి గాయాలు

**కోల్‌కతా, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం రోజున విషాద ఘటన చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి 19లోని నాలా ఫెర్రీ ఘాట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం వేకువజాము బర్ధమాన్ నుంచి దుర్గాపూర్ వెళ్తున్న ప్రైవేట్ ప్యాసింజర్ బస్సు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు మృతి చెందగా 35 మందికి గాయాలయ్యాయి. ప్రయాణికులంతా బీహార్ వాసులని తెలిసింది. వీరంతా గంగా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి తిరిగి వెళ్తున్నారు. ఈ ప్రమాద సమయంలో మొత్తం 45 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు. చనిపోయిన వారిలో ఎనిమిది మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. అలాగే గాయపడ్డ వారిలో ఆరుగురు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోనూ ఇవాళ(శుక్రవారం) ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ట్రక్కును కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాగ్నాడి పోలీస్ స్టేషన్ పరిధి చిర్చారి గ్రామం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 25 నుంచి 34 ఏళ్ల మధ్య వయస్సు గల ఏడుగురు స్నేహితులు.మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి అంతర్రాష్ట్ర పర్యటనకు బయలుదేరారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశాలోని పూరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. డ్రైవర్ నిద్రలోకి జారుకోగానే వాహనం డివైడర్‌ను దూకి ఎదురుగా ఉన్న లేన్‌లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. దీంతో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరొకరుస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌కు చికిత్స అందిస్తున్నారు.

# అన్నగా ఇచ్చే వరం 'ఉచిత బస్సు'

## 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించిన ఏపి సీఎం చంద్రబాబు.. మహిళలకు ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం


## 'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా కొత్త పథకం అమలు.. పాల్గొన్న ఏపి డిసిఎం పవన్, మంత్రి లోకేష్ ప్రభృతులు

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు మహర్దశ కల్పించేందుకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా శుక్రవా రం మరో పథకానికి అంకుర్పాణ చేసారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం 'స్త్రీ శక్తి పథకం' శ్రావణ శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. దీంతో రాష్ట్రంలో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మానవనరులశాఖా మంత్రి నారా లోకేష్ పాతి నిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లి గుహల వద్ద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు పాల్గొన్నారు. మహిళల ఉచిత ప్రయా ణానికి జీరో ఫేర్ టికెట్ జారీని సీఎం ప్రారంభించారు. ఈ బస్సులో సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర చీప్ మాధవ్‌లు టిక్కెట్లు కొనుక్కొని ప్రయా ణించారు. మొదట టిక్కెట్లు పవన్ కల్యాణ్ కండెక్టరు డబ్బు చెల్లించారు. అయితే ఆ డబ్బు వెనక్కు ఇచ్చేయమని చెప్పి, లోకేష్ తాను ఫేయిర్ చెల్లించారు. అనంతరం మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్‌లు కండెక్టర్ ఇచ్చారు. వారితో కలిసి విజయవాడ పండిట్ నెహ్రూ ఆర్టీసీ బస్‌స్టేషన్ సిటీ టెర్మినల్ వరకూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లు బస్సులో ప్రయాణించారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపేం దుకు మహిళలు భారీగా తరలివచ్చారు.

**ఉండవల్లి నుంచి విజయవాడ వరకు:**అడుగడుగునా మంగళ హారతులతో మహిళలు ఘనస్వాగతం పలికారు. డీజే, తీన్ మార్ నృత్యాలతో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు జరిపి కార్యకర్తలు పక్కా జాతర చేశారు. ఉండవల్లి గుహలు, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి ప్యాలెస్, తాడేపల్లి సెంటర్, కనకదుర్గ వారధి మీదుగా సిటీ టెర్మినల్ వరకూ చంద్రబాబు, పవన్, లోకేశ్ బస్సు ప్రయాణం సాగింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ బస్సు ప్రయాణ మార్గంలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. బస్సు ప్రయాణించే ప్రయాణించే మార్గంలో మూడు పార్టీల జెండాలతో ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ప్రతీ సెంటర్‌లో థాంక్యూ సీఎం సర్ అంటూ మహిళల నినాదాలతో మంగళగిరి నియోజక వర్గం మార్మోగింది. మహిళలు తాడేపల్లి ప్యాలెస్ వద్దకు పెద్దఎ త్తున చేరుకుని చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లు ప్రయా ణించే బస్సుకు ఘన స్వాగతంపలికారు. తాడేపల్లి జగన్ నివాసం సమీపంలో చంద్రబాబు, నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు నేతలు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.

ఇక విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ప్రయాణించేందుకు నిర్దేశించిన నూతన బస్సులను డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌తో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ బస్సులకు ఆయన జెండా ఊపి ప్రయాణానికి ముందుకుపంపించారు. గతప్రభుత్వ హయాంలో ఇంటా, బయట ప్రజలకు ఆనందం లేకుండా పోయింద న్నారు. మీ సత్యాగ్రహంతో ఆ ప్రభుత్వం కొట్టుకుని పోయిందన్నారు. తమ ప్రభుత్వ






శుక్రవారం ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిన ఓ మహిళకు తొలి టిక్కెట్ ఇస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్,సూపర్ హిట్ అయిందన్నారు.తమ కీలక వాగ్దానాల్లో మహిళ ఉచిత బస్సు ప్రయాణాన్ని నేటి నుంచి అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు.

**ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను గౌరవించండి:** ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను మనం గౌరవించాలని, ఏంచేసినా వెనక్కి లాగేందుకు చాలామంది చూస్తున్నారని విమర్శించారు. అమరావతిని ఎడారి అన్నారుని, శ్మశానం అన్నారని మండిపడ్డారు. అమరావతిని గొప్ప నగరంగా తీర్చిదిద్దుతున్నామన్న సీఎం చంద్రబాబు, త్వరలోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు కేంద్రం రూ.12,500 కోట్లు ఇచ్చిందన్న సీఎం, ప్రభుత్వ కార్యక్రమాలకు పూర్తిగా సహకరించిన బాధ్యత మీదేనని అన్నారు. పులివెందులలో 30 ఏళ్ల తర్వాత ఓటేశానని ఒకరు కాగితం రాశారని, పులివెందుల ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామన్న తృప్తి ఉందన్న సీఎం, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అన్ని సేవలూ అందు బాటులోకి వచ్చాయని తెలిపారు.

**8,458 బస్సుల్లో ఈ పథకం అమలు: డీసీఎం పవన్ కల్యాణ్:** ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్ మాట్లాడుతూ తమది ఇచ్చిన మాట మీద నిలిచే ప్రభుత్వమన్నారు. 8,458 బస్సుల్లో ఈ పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏటా రూ.2,000 కోట్లు ప్రభుత్వం భరించనుందన్నారు. ఎన్నికలహామీని నిలబెట్టుకున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తమ కీలక ఎన్నికల హామీని నెరవేర్చే దిశగా కీలక ముందడుగు వేసిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని మహిలలకు మంచిచేయాలనే లక్ష్యంతో తీసుకుని వచ్చామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.

# యేడాదిలో 4లక్షల50వేల ఇళ్లు పూర్తి చేస్తాం

## 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ

## ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 15, ప్రభాతవార్త:** తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇందుకు రూ.22,500 కోట్లు వెచ్చించి ఒక్క ఏడాదిలో నాలుగు లక్షల 50 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయబోతున్నామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందని, నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న మహనీయుల ఆశయ సాధనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. ఈ ఏడాది జూలై 14 నుంచి రాష్ట్రం వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామని, పదేళ్ల తర్వాత చేతిలో రేషన్ కార్డుతో... రేషన్ షాపుల వద్ద సందడి కనిపిస్తోందన్నారు. గత ఏడాది ఇదే ఆగస్టు 15న రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి ఈ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం రాయని కొత్త చరిత్ర రాశామన్నారు. గత పాలకుల పాపాలు శాపాలై వెంటాడు తున్నా... రైతుల విషయంలో రాజీ పడలేదన్నారు. రాష్ట్రం లోని 70 లక్షల, 11 వేల, 184 మంది రైతులకు పంట సాయం అందించా మన్నారు. రాష్ట్రంలో 7,178 కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేసి చివరి గింజ వరకు ధాన్యం కొన్నాం.

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వ్యవసా యానికి ఉచిత విద్యుత్ లో భాగంగా 29 లక్షల పంపు సెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీని కోసం రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్తు సంస్థలకు చెల్లిస్తున్నాం.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యవసాయ చరిత్రను తిరగ రాసి అన్నదాతల సంక్షేమానికి రూ.1 లక్ష 13 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశాం. స్థానిక సంస్థలలో..విద్యా, ఉద్యోగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లులను ఈ ఏడాది మార్చి 17న రాష్ట్ర శాసనసభ ఆమోదించిందని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలోని ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించి గ్రూప్ 1 లో 15, గ్రూప్ 2 లో 18, గ్రూప్ -3 లో 26 కులాలను చేర్చామన్నారు. ఆరోగ్య శ్రీ కాంగ్రెస్ బ్రాండ్ స్కీం అని, మసకబారిన ఈ పథకానికి పూర్వవైభవం తెచ్చామన్నారు. 2047 నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పం అన్నారు. 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చే మహత్తర లక్ష్య పత్రంగా తెలంగాణ రైజింగ్ - 2047 ఉంటుందన్నారు.

# పంద్రాగస్టు వేడుకలకు రేవణ్ణ, దర్శన్‌లు దూరం!

## తీవ్ర డిప్రెషన్‌లో బారక్‌లకే పరిమితం

**బెంగళూరు, ఆగస్టు 15:** దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతుండగా, ఇద్దరు కన్నడ ప్రముఖులు మాత్రం జైలులో ఆ వేడుకలకు దూరంగా ఉన్నారు. అభిమాని హత్య కేసులో అరెస్టయిన కన్నడ నటుడు దర్శన్, అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెంగళూరు సెంట్రల్ జైలులో జరిగిన వేడుకల్లో పాల్గొనలేదు. తీవ్రమైన డిప్రెషన్‌లో ఉండటంతో వారు తమ బ్యారక్‌లకే పరిమితమైనట్లు జైలు వర్గాలు శుక్రవారం తెలిపాయి. అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో సుప్రీంకోర్టు బెయిల్ రద్దు చేయడంతో దర్శన్‌ను గురువారం పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. జైలుకు వచ్చినప్పటి నుంచి దర్శన్ తీవ్రమైన మనోవేదనతో ఉన్నారని, రాత్రంతా సరిగ్గా నిద్రపోలేదని సమాచారం. జైలు అధికారులు ఆయనకు ఖైదీ నంబర్ 7314ను కేటాయించారు. ఇదే కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న ఆయన భాగస్వామి పవిత్ర గౌడకు ఖైదీ నంబర్ 7313 ఇచ్చారు.

గతంలో దర్శన్ అరెస్ట్ అయినప్పుడు ఆయన ఖైదీ నంబర్‌తో అభిమానులు పచ్చబొట్లు వేయించుకోవడం వివాదాస్పదమైంది. ప్రస్తుతం దర్శన్‌తో పాటు మరో ముగ్గురు నిందితులను ఒకే బ్యారక్‌లో ఉంచారు. మరోవైపు, అశ్లీల వీడియోలు, అత్యాచారం కేసులో మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణకు ఆగస్టు 1న ప్రత్యేక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ పరిణామాలతో ఆయన కూడా మానసికంగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై నటి, మాజీ ఎంపీ రమ్య స్పందించారు. దర్శన్ తన జీవితాన్ని తానే పాడుచేసుకున్నాడని విచారం వ్యక్తం చేశారు. "నేను దర్శన్‌తో కలిసి సినిమాల్లో నటించాను. ఒకప్పుడు స్టేజి లైట్ బాయ్‌గా కెరీర్ మొదలుపెట్టి స్టార్‌గా ఎదిగిన ఆయన కథ విని గర్వపడ్డాను. కానీ ఇప్పుడు ఆయన ప్రవర్తన నన్ను నిరాశపరిచింది. జీవితంలో ఒక స్థాయికి వచ్చాక బాధ్యతగా ఉండాలి. ఆయన చుట్టూ మంచి స్నేహితులు లేరేమో అనిపిస్తోందని ఆమె అన్నారు. రేణుకాస్వామి కుటుంబానికి న్యాయం జరగాలని తాను సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినప్పుడు దర్శన్ అభిమానులు తనను తీవ్రంగా ట్రోల్ చేశారని రమ్య గుర్తుచేసుకున్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసింది. ఈ తీర్పు సమాజానికి ఒక మంచి సందేశం పంపుతుంది. ఓ నిరుపేద కుటుంబానికి చెందిన రేణుకాస్వామికి చివరికి న్యాయం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

# గంటపాటు ఫామ్‌హౌజ్‌లోనే ఎమ్మెల్సీ కవిత

## కెసిఆర్‌తో కలిసి లంచ్.. ఆ తర్వాత కీలక చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు15:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ఎర్రవల్లిలోని తన తండ్రి కెసిఆర్ ఫాంహౌజ్‌కు వెళ్లారు. తన చిన్న కుమారుడు ఆర్యను గ్రాడ్యుయేషన్‌లో చేర్పించేందుకు అమెరికాకు వెళ్తున్న నేపథ్యంలో తాత ఆశీర్వాదం కోసం ఫాంహౌజ్ చేరుకున్నారు. అక్కడే సుమారు గంటపాటు కవిత ఉన్నారు. ముందుగా తన తండ్రితో భేటీ అయి మాట్లాడగా... తర్వాత తల్లితో మాట్లాడారు. కుమారుడిని అమెరికాలో గ్రాడ్యుయేషన్‌లో చేర్పించ బోతున్న సందర్భంగా శనివారం అమెరికాకు వెళ్లనున్నందున కవిత ఆర్యలు కలిసి కెసిఆర్ దంపతుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం అక్కడే లంచ్ చేశారు. తన కుమారుడికి తాత ఆశీర్వాదం తీసుకున్న అనంతరం పలు విషయాలు చర్చించినట్లు తెలిసింది.

అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. అయితే... ఆమె వెళ్తున్న క్రమంలోనే హరీశ్‌రావు ఫాంహౌజ్‌కు వస్తుండటం గమనార్హం. కాగా, చిన్న కుమారుడు ఆర్యను కాలేజీలో చేర్పించేందుకు కవిత అమెరికాకు వెళ్తున్నారు. శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి అమెరికాకు ప్రయాణం కానున్నారు.

15 రోజుల పాటు అమెరికాలో ఆమె ఉండనున్నారు. అమెరికా పర్యటన ముగించుకుని సెప్టెంబర్ 1వతేదీన తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. కాగా, కవిత అమెరికా పర్యటనకు ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. న్యాయస్థానం పాస్‌పోర్ట్ రిలీజ్ చేసింది.

# నా తెలంగాణ కోటి రత్నాల వీణ

## అమరుల త్యాగఫలం మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం

## ఎకో టూరిజంకు కేరాఫ్‌గా నిలిచిన భద్రాద్రి కొత్తగూడెం

## మూడు విడతల్లో 455 కోట్ల 33 లక్షలు రుణమాఫీ

## కొత్తగూడెంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**కొత్తగూడెం, ఆగస్టు 15 - ప్రభాతవార్త:** బ్రిటీష్ పాలన నుంచి విముక్తి కోసం స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన వేలాది మంది అమరుల త్యాగఫలం మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అని, మహాత్మా గాంధీ నాయకత్వంలో సాగిన పోరు బాటలో నేల కొరిగిన అమరులకు నివాళి అర్పిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 79వ భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కార్పోరేషన్ పరిదిలోని ప్రగతిమైదానంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం గౌరవ వందనం చేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ...నా తెలంగాణ కోటి రత్నాల వీణ అలాగే నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శ్రీ రాముడు సీతమ్మ తల్లితో కలిసి త్రేతాయుగంలో నడయాడిన పుణ్య భూమి సిరులు తల్లి సింగరేణి పుట్టినిల్లు జాతికి వెలుగులు అందించే పాల్వంచ కే టీ పీ ఎస్ దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో కీలకమైన హెవీ వాటర్ ప్లాంట దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన ఐ.టీ.సీ పేపర్ కర్మాగారం, గోదారమ్మ కిన్నెరసాని పరవళ్ళతో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అత్యధిక అటవీ విస్తీర్ణంతో దేశ మూల వాసులైన ఆదివాసులు ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పారిశ్రామికంగా మాంచెస్టర్ ఆఫ్ తెలంగాణగా ఏకో టూరిజం కేరాఫ్ గా నిలిచింది భద్రాద్రి కొత్తగూడెం. 1969 తొలి తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊది రణం చేసిన వీర భూమి.కాంగ్రెస్ ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భద్రాద్రి కొత్తగూడెం అబివృద్ధి ఇలా...ఉమ్మడి ఖమ్మం జిల్లా సశ్య శ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు ను గత ఆగస్ట్ 15 న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది.

పెండింగ్ పనులు కోసం సవరించిన అంచనాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గోదావరి కృష్ణ నదుల అనుసంధానంగా రాజీవ్ లింక్ కెనాల్ ప్రారంభోత్సవం చేశామని అన్నారు.



## అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా జాతీయజెండా ఆవిష్కరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు15:** భారత దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో జాతీయ జెండాను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎగురవేశారు. అంతకు ముందు శాసనమండలి ఆవరణలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ డా.వి.నరసింహాచార్యులు,అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేడ్కర్,జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



# జాతీయ జెండా ఆవిష్కరణ

**జాతీయ జెండాను** ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హైదరాబాద్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో ఘనంగా జరిగాయి. మెగాస్టార్ చిరంజీవి వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా వందన కార్యక్రమంలో అల్లు అరవింద్, సాయి ధరమ్ తేజ్, సుస్మిత, మెగా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశారు.ప్రతి భారతీయుడికి 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మన పూర్వీకులు సాధించిన ఈ విలువైన స్వాతంత్ర్యాన్ని ఆనందంగా జరుపుకుందాం. ఈ స్వేచ్ఛ మన ప్రతిభ, అభివృద్ధికి బలాన్ని ఇచ్చి, మన దేశం ఎప్పటికీ ముందుకు సాగడానికి దోహదం చేయాలి. జై హింద్ .

# సైమా 2025 గ్రాండ్ ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్




**సైమా** సక్సెస్ ఫుల్ గా 13వ ఎడిషన్‌కి చేరుకోవడం చాలా ఆనందంగా వుంది. నేషనల్ అవార్డ్ విన్నర్స్‌ని సైమా సత్కరించడం అభినందనీయం: సైమా 2025 గ్రాండ్ ప్రెస్ మీట్ లో నిర్మాత అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మక సైమా 2025 (సైబా సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) అవార్డ్స్ వేడుక సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబాయ్‌లో అంగరంగవైభవంగా జరగనుంది. ఈ వేడుకలకు సంబంధించిన ప్రెస్ మీట్ హైదరాబాద్‌లో గ్రాండ్ గా జరిగింది.ఈ సందర్భంగా నేషనల్ అవార్డ్ విజేతలైన దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి(భగవంత్ కేసరి), దర్శకుడు సాయి రాజేష్, సింగర్ రోహిత్ (బేబీ) దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ వెంకట్ (హనుమాన్)లని సైమా ఘనంగా సత్కరించింది. ప్రెస్ మీట్‌లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ,అందరికీ ధన్యవాదాలు. విష్ణు, బృందాకి కంగ్రాజులేషన్స్ .12 ఏళ్లుగా ఈ వేడుకని విజయవంతంగా నిర్వహిస్తూ ఇప్పుడు 13వ ఎడిషన్‌కి శ్రీకారం చుట్టడం చాలా ఆనందంగా ఉంది. తెలుగు పరిశ్రమకు ఏడు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఇండస్ట్రీ స్పందించక ముందే సైమా వారు స్పందించి వారందరినీ ఒక స్టేజి మీద తీసుకొచ్చి సత్కరించాలని అనుకోవడం నిజంగా అభినందనీయం. ఈ సందర్భంగా నేషనల్ అవార్డు విజేతలు అందరికీ అభినందనలు. నిజంగా దీన్ని ఒక పండగ లాగా జరుపుకోవాలి. సైమా దీన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళుతున్నందుకు వారికి మరోసారి కంగ్రాచ్యులేషన్స్. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. భగవత్ కేసరి నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిలిం. సినిమాకి జాతి స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. సైమా విష్ణుతో నాకు చాలా మంచి అనుబంధం ఉంది. నాఫస్ట్ మూవీ పటాస్ సినిమాకి ఆయన అవార్డు ఇవ్వడం ఇప్పటికీమర్చిపోలేను. ఆ ఫస్ట్ అవార్డు నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. లాస్ట్ ఇయర్ భగవంత్ కేసరి సినిమాకి బెస్ట్ ఫిల్మ్ కేటగిరీలో అవార్డు తీసుకున్నాను.. ఇది కేవలం అవార్డులు వేడుకే కాదు నాలుగు భాషల సినీ టాలెంట్ ని కనెక్ట్ చేస్తుంది. డిఫరెంట్ టాలెంట్స్ అన్నీ ఒక వేదిక మీద కలవడం చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. చాలా అద్భుతంగా ఈవెంట్ ని సెలబ్రేట్ చేస్తారు. ఈ ఏడాది కూడా అద్భుతంగా జరగబోతుంది. ఈ సందర్భంగా నేషనల్ అవార్డ్స్ విజేతలందరికీ అభినందనలు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ.. ఈ సినిమాకి నేషనల్ అవార్డు వస్తుందని. సినిమాపై అంత నమ్మకం ఉంచినందుకు వారికి కృతజ్ఞతలు. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ నేషనల్ అవార్డు వచ్చిన తర్వాత ఇది తొలి సత్కారం. అందరూ నేషనల్ విన్నర్స్‌ని కలవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా విష్ణుకి బృందాకి సైమాకి ధన్యవాదాలు. అవార్డు వచ్చిన వారికే కాదు సినిమా కోసం పని చేసిన అందరికీ అభినందనలు తెలుపుతున్నాను. సైమా టాలెంట్ ని సెలబ్రేట్ చేసుకునే చాలా గొప్ప వేదిక. ఎన్నో గొప్ప సినిమాలు రావడానికి కారణం అవుతున్నందుకు ఈవెంట్ ని ఇంత బాగా ఆర్గనైజ్ చేస్తున్నందుకు బృందా కి విష్ణుకి కంగ్రాజులేషన్స్.

నాకు సౌత్ ఇండియాలో ఉన్న దాదాపు 80 కొలాబరేషన్స్ సైమా వేడుక ద్వారానే వచ్చాయి. సైమా ప్రతి ఏడాది గొప్పగా ముందుకు వెళుతుంది.. అలా అందరికీ తెలిసిన ప్రెస్టీజియస్ అవార్డ్స్‌లో సైమా ముందుంటుంది అది మన తెలుగు రాష్ట్రాల్లో పుట్టడం మనందరికీ ఆనందదాయకం. వేడుకలో పాలుపంచుకోవడం గర్వంగా భావిస్తున్నాను బృందాకి విష్ణుకి కంగ్రాజులేషన్స్ వేడుకల కోసం ఎదురుచూస్తున్నాను. హీరోయిన్ వేదిక మాట్లాడుతూ, ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. సౌత్ ఇండియన్ టాలెంట్ ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇది అవార్డు వేడుక మాత్రమే కాదు సెలబ్రేషన్స్ ఆఫ్ కల్చర్. ఈ ఏడాది నేను పెర్ఫార్మ్ చేస్తున్నాను. హీరోయిన్ ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ, చాలా ఎక్సైటెడ్ గా ఉన్నాము. దుబాయ్‌లో సినిమాని సెలబ్రేట్ చేయడం మోస్ట్ ఎక్సైటింగ్ థింగ్. హీరోయిన్ మంచు లక్ష్మీమాట్లాడుతూ,అందరికి నమస్కారం. సైమా13వ ఎడిషన్ ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. విష్ణు, బృందాకి కంగ్రాచ్యులేషన్స్. సైమా చైర్ పర్సన్ బృందా మాట్లాడుతూ అందరికి నమస్కారం. మరో రీయూనియన్ కి సైనా సిద్ధమైంది. 13 ఏళ్లంటే లాంగ్ జర్నీ. చాలా బ్యూటిఫుల్ మెమొరీస్ మైల్ స్టోన్స్ ఉన్నాయిసైమా ప్రతి ఏడాది ఇంకా అద్భుతంగా ముందుకుకొనసాగుతోంది. మమ్మల్ని గొప్పగా బిలీవ్ చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. సైమా కేవలం అవార్డు వేడుక కాదు. టాలెంట్ ని కల్చర్ ని సెలబ్రేట్ చేసుకునే గ్లోబల్ స్టేజ్. ప్రతి ఏడాది మేము కొత్త బెంచ్ మార్క్ ని సెట్ చేస్తున్నాము. 13వ ఎడిషన్‌కి చేరుకోవడం చాలా ఆనందంగా ఉంది.

# 'భీమవరం టాకీస్' లో15 చిత్రాలు విడుదల

అంగరంగ వైభవంగా అతిరధమహారధుల సమక్షంలో భీమవరం టాకీస్ 15 చిత్రాలు ప్రారంభం కిక్కిరిసిన సారధి స్టూడియోస్ వెల్లువెత్తిన అభినందనలు భీమవరం టాకీస్ పతాకంపై ఇప్పటికే 114 చిత్రాలను నిర్మించి ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ... ప్రపంచ సినిమా చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఒకేసారి 15 చిత్రాలకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ లోని సారధి స్టూడియోలో కిక్కిరిసినసినీ అభిమానుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన అతిరధ మహారధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




మురళీమోహన్, రేలంగి నరసింహారావు, సుమన్, శ్రీకాంత్, జె.డి.చక్రవర్తి, తనికెళ్ళ భరణి, 30 ఇయర్స్ పృథ్వి, అజయ్ ఘోష్,సి.కళ్యాణ్, తమ్మా రెడ్డిభరద్వాజ, తుమ్మల ప్రసన్నకుమార్, చదలవాడ శ్రీనివాసరావు, భరత్ భూషణ్, వల్లూరిపల్లి రమేష్ బాబు, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్రప్రసాద్, కె.ఎల్.స్టూడియో అధినేత కొంతం లక్ష్మణ్, గజల్ శ్రీనివాస్, చీకటి ప్రవీణ్, ఇమ్మడి రమేష్, వంశీ రామరాజు, కె.ధర్మారావు, శ్రీమతి గిడుగు కాంతి కృష్ణ తదితర దిగ్గజాలు హాజరై రామసత్యనారాయణను అభినందించారు.

15 చిత్రాలదర్శకుల వివరాలు!..

1) జస్టిస్ ధర్మ: (యండమూరి వీరేంద్రనాథ్), 2) నాగపంచమి :(ఓం సాయిప్రకాష్)

3) నా పేరు పవన్ కల్యాణ్ : (జె.కె.భారవి), 4) టాపర్:(ఉదయ్ భాస్కర్), 5) కె.పి.హెచ్.బి. కాలని : (తల్లాడ సాయికృష్ణ), 6) పోలీస్ సింహం : (సంగకుమార్), 7) అవంతిక 2 (శ్రీరాజ్ బళ్ళా), 8) యండమూరి కథలు: (రవి బసర),9) బి.సి.(బ్లాక్ కమాండో): (మోహన్ కాంత్), 10) హనీ కిడ్స్ (హర్ష) 11) సావాసం, (ఏకరి సత్యనారాయణ)12) డార్క్ స్టోరీస్:(కృష్ణ కార్తీక్),13) మనల్ని ఎవడ్రా ఆపేది (బి.శ్రీనివాసరావు),14) ది ఫైనల్ కాల్: (ప్రణయ్ రాజ్ వంగరి),15) అవతారం: (డా: సతీష్) ఈ 15 చిత్రాలకు 15 కెమెరాలతో క్లాప్, స్విచ్చాన్, గౌరవ దర్శకత్వం చేయించడం విశేషం. తెలుగు సినిమాకు ప్రపంచరికార్డు సాధించేలా ఒకేసారి 15 చిత్రాలు మొదలు పెట్టిన రామసత్యనారాయణను అతిధులంతా అభినందించారు. 2025, ఆగస్టు 15న కొబ్బరికాయలు కొట్టిన ఈ 15 చిత్రాలకు 2026 ఆగస్టు 15కి పూర్తి చేసి గుమ్మడికాయలు కొట్టేందుకు అన్ని సన్నాహాలు చేస్తున్నామని రామసత్యనారాయణ పేర్కొన్నారు. ఈ 15 చిత్రాలకు రేలిస్టూడియోను 25 డిస్కౌంట్ తో ఇస్తున్నందుకు కొంతంకు కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా పేరొందిన 9 సంస్థలు ఈ ప్రారంభోత్సవాన్ని వరల్డ్ రికార్డ్ బుక్స్ లో నమోదు చేశాయి. ఒకేరోజు మొదలై ప్రపంచ రికార్డ్స్ లో నమోదైన ఈ 15 చిత్రాలకు సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ అప్పాజీ పి.ఆర్.ఓ. కావడం విశేషం!!

# "శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబ్బా




'అభయ్ చరణ్ ఫౌండేషన్స్ ,'శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఒక చారిత్రక మహాకావ్యాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక టైటిల్‌ను తాజాగా అనౌన్స్ చేశారు. "శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబ్బా" పేరుతో అనిల్ వ్యాస్ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుండగా, కథ, స్క్రీన్ ప్లే , దర్శకత్వం ముకుంద్ పాండే వహిస్తున్నారు.

ఇస్కాన్-ఢిల్లీకి చెందిన సీనియర్ ప్రీచర్ జితామిత్ర ప్రభు శ్రీ ఆశీస్సులతో ఈ నవ్య కావ్యం రూపొందుతోంది. ఇది 1112వ శతాబ్దాల నాటి 'మహోబ్బా సాంస్కృతిక వైభవాన్ని, అలాగే భగవాన్ శ్రీ కృష్ణుడి దివ్యత్వాన్ని, ధీరత్వాన్ని, ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపించాబోతుంది. చలన చిత్ర పరిశ్రమలో తొలిసారిగా శ్రీ కృష్ణుడిని ఒక యుద్ధవీరుడి పాత్రలో చూపించబోయే సినిమా ఇది. 'శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబ్బా ఒక పాన్‌వరల్డ్ ప్రాజెక్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతోంది. ప్రపంచస్థాయి టెక్నీషియన్లతో తెరకెక్కుతున్న ఈ చిత్రం, చరిత్ర, సాంస్క ృతిక వారసత్వం, ఆధ్యాత్మికతను కలగలుపుతుంది. ఈ ప్రకటనలో టైటిల్, నిర్మాణ సంస్థలు, మరియు క్రియేటివ్ టీమ్ వివరాలు వెల్లడించారు. నటీనటులు, సాంకేతిక బృందం, ఇతర వివరాలు త్వరలో ప్రకటించబడతాయి.

శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా వివరాలు

నిర్మాణ సంస్థలు: అభయ్ చరణ్ ఫౌండేషన్, శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్, నిర్మాణ నిర్వహణ: అనిల్ వ్యాస్‌కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: ముకుంద్ పాండే ఆశీస్సులు: జితామిత్ర ప్రభు శ్రీ (ఇస్కాన్ – ఢిల్లీ)

సినిమా నేపథ్యం: 1112వ శతాబ్దాల నాటి మహోబా సాంస్క ృతిక వైభవం ,శ్రీ కృష్ణుడి పాత్ర .

# వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో కొత్త చిత్రం ప్రారంభం

**సినీ ప్రియులంతా** ఎంతగానో ఎదురుచూస్తున్న వెంకటేష్‌త్రివిక్రమ్ కలయికలో చిత్రానికి మొదటి అడుగు పడిందివిక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో చిత్రం కోసం తెలుగు సినీ అభిమానులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తెలుగు సినిమా రంగంలో తమదైన ముద్ర వేసిన ఈ ఇద్దరు ప్రసిద్ధులు ఎట్టకేలకు కొత్త సినిమా కోసం చేతులు కలిపారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభించబడింది. దీంతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచే చిత్రానికి తొలి అడుగు పడింది.సినీ వర్గాలతో పాటు, ప్రేక్షకులలో కూడా వెంకటేష్‌త్రివిక్రమ్ కలయికలో సినిమా పట్ల ఎంతో ఆసక్తి ఉంది. త్రివిక్రమ్ యొక్క ప్రత్యేకమైన కథా శైలి ద్వారా రూపుదిద్దుకున్న పాత్రలో వెంకటేష్ ను చూడటం ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందించనుంది. స్వచ్ఛమైన వినోదం, లోతైన భావోద్వేగాలతో నిండిన కుటుంబ కథా చిత్రాలను అందించడంలో త్రివిక్రమ్ పేరుగాంచారు. ఇప్పుడు త్రివిక్రమ్ మరో ఆకర్షణీయమైన, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే చిత్రాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు.సుప్రసిద్ధ హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది.ప్రముఖ నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచ్ ఆన్ చేయడం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇది అరుదైన, మాయాజాల కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్నాయి. త్రివిక్రమ్ శైలి కథలో వెంకటేష్ ను వెండితెరపై చూడటానికి అభిమానులు, సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు .



# హిందీ రైట్స్ సొంతం చేసుకున్న 'మిరాయ్'

**సూపర్ హీరో** తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని, టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్ ఇండియా ఫిల్మ్ 'మిరాయ్ హిందీ రైట్స్ సొంతం చేసుకున్న బాలీవుడ్ లీడింగ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్

హనుమాన్ సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న సూపర్ హీరో తేజ సజ్జా, ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్‌లో సూపర్ యోధగా అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న మిరాయ్ ఈ సంవత్సరం బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్‌లలో ఒకటిగా మారనుంది.ఉత్సాహాన్ని మరింత పెంచుతూ బాలీవుడ్ లీడింగ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ 'మిరాయ్ లోకి వచ్చారు. తన ప్రతిష్టాత్మక బ్యానర్ ధర్మ ప్రొడక్షన్స్, మిరాయ్ హిందీ థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ రైట్స్ సొంతం చేసుకుంది. మిరాయ్ నార్త్ లో మ్యాసివ్ గా రిలీజ్ కానుంది. బాహుబలి, దేవర వంటి తెలుగు బ్లాక్‌బస్టర్‌లతో ధర్మ ప్రొడక్షన్స్ కు సక్సెస్ ఫుల్ ట్రాక్ రికార్డ్ వుంది. ఈ కొలాబరేషన్ మిరాయ్ పై మరింత ఎక్సయిట్మెంట్ పెంచింది. ఈ చిత్రం గ్లింప్స్, టీజర్‌కు నేషనల్ వైడ్ గా అద్భుతమైన స్పందన వచ్చింది. మొదటి సింగిల్ వైబ్ ఉంది చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. మిరాయ్‌లో మనోజ్ మంచు విలన్‌గా, శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మిరాయ్ దర్శకత్వం వహించడమే కాకుండా, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అలాగే స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించారు. మణిబాబు కరణం రచన, సంభాషణలకు కీలకంగా పని చేశారు. గౌర హరి సంగీతం, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సుజిత్ కుమార్ కొల్లి పని చేస్తున్నారు. మిరాయ్ 2డి , 3డి ఫార్మాట్‌లలో ఎనిమిది భాషల్లో సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇది ట్రూ పాన్‌ఇండియన్ విజువల్ వండర్‌గా ఉండబోతుంది. తారాగణం: సూపర్ హీరో తేజ సజ్జ, మనోజ్ మంచు, రితికా నాయక్, శ్రియశరణ్, జయరామ్, జగపతి బాబు.






# ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు

**మాహిష్మతి ప్రొడక్షన్స్** బ్యానర్ పై తోట రామకృష్ణ దర్శకనిర్మాతగా రూపొందిస్తున్న చిత్రం ఒక పార్వతి ఇద్దరు దేవదాసులుయువతను ఆకట్టుకునేలా ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు కథ. పార్వతి దేవదాసుల ప్రేమ కథకు ఎంతటి క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈసారి ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు టైటిల్ తో ఓ విభిన్నమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

మాహిష్మతి ప్రొడక్షన్స్ బ్యానర్ పై తోట రామకృష్ణ దర్శక నిర్మాత గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సిద్దార్థ మీనన్, దిలీప్ హీరోలుగా రాశి సింగ్ హీరోయిన్ గా నటించారు. రఘు బాబు, కశి రెడ్డి రాజ్ కుమార్, వీర శంకర్, గౌతం రాజు, రాకెట్ రాఘవ, గుండు సుదర్శన్, రవితేజ, రజిత ఇతర కీలక పాత్రలు పోషించారు.

రీసెంట్ గా ఈ సినిమాకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయింది.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదొక కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో జరిగే ట్రయాంగిల్ లవ్ స్టోరీ. యువతను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు దర్శకనిర్మాత తోట రామకృష్ణ తెలియజేశారు. సంగీత దర్శకుడు మోహిత్ రహమానియాక్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ తో పాటు సుద్దాల అశోక్ తేజ, భాస్కరభట్ల ఆకట్టుకునే సాహిత్యం అందించారు.

చిత్రం : ఒక పార్వతి ఇద్దరు దేవదాసుల.

నటీ నటులు : సిద్దార్థ మీనన్, దిలీప్, రాశి సింగ్, రఘు బాబు, కశి రెడ్డి రాజ్ కుమార్, వీర శంకర్, గౌతం రాజు, రాకెట్ రాఘవ, గుండు సుదర్శన్, రవితేజ, రజిత. బ్యానర్ : మాహిష్మతి ప్రొడక్షన్స్

రచన, దర్శకత్వం, నిర్మాత : తోట రామకృష్ణ

మ్యూజిక్ డైరెక్టర్ : మోహిత్ రహమానియాక్

సినిమాటోగ్రాఫర్ : శ్రీనివాసరాజు,

ఎడిటర్ : గన్, గీత రచయితలు : చంద్ర బోస్ (ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్), సుద్దాల అశోక్ తేజ, భాస్కర భట్ల,

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శరత్ వర్మ,

పిఆర్ఓ : బీరే (గణేష్, కుమార్) తదితరులు.

# బివిసి బ్యానర్లపై 'మటన్‌సూప్' విడుదల

**రామకృష్ణ వట్టికూటి** సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు(బివిసి) బ్యానర్లపై రామచంద్ర వట్టికూటి తెరకెక్కిస్తున్న 'మటన్ సూప్‌ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసిన ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మటన్ సూప్ విట్‌నెస్ ది రియల్ క్రైమ్ ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మాతలుగా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు విడుదల చేశారు.ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఆగస్ట్ 15న ఈ నూతన సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు మాట్లాడుతూ,పర్వతనేని రాంబాబు సారథ్యంలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో రాబోతోన్న చిత్రం 'మటన్ సూప్. టైటిల్ పోస్టర్ బాగుంది. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్. సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నారు.చిత్ర నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ,మా మటన్ సూప్ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసిన లెజెండరీ ప్రొడ్యూసర్ కె.ఎస్.రామారావుకి ధన్యవాదాలు. మా టీం అందరికీ ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు. త్వరలోనే మేం ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాం. మంచి చిత్రంతో రాబోతోన్న మా అందరినీ ఆడియెన్స్ ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు. హీరో రమణ్ మాట్లాడుతూ, నా ఫ్రెండ్ రామచంద్ర మంచి కథతో 'మటన సూప్ తెరకెక్కిస్తున్నారు. మా టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్ అద్భుతంగా వచ్చింది. సినిమా అద్భుతంగా వస్తోంది. పగలు రాత్రి అన్న తేడా లేకుండా మేం అంతా కష్టపడుతున్నాం. మేం తీస్తున్న ఈ మంచి చిత్రాన్ని అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు.చిత్ర దర్శకుడు రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ,రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై పర్వతనేని రాంబాబు సారథ్యంలో నేను తెరకెక్కిస్తున్న చిత్రం 'మటన సూప్. నిర్మాత రామకృష్ణ సనపల మాట్లాడుతూ,రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా చేసుకుని మటన్ సూప్ సినిమాను రూపొందించాం. త్వరలోనే విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నాం. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు, నిర్మాత అరుణ్ చంద్ర వట్టికూటి, లైన్ ప్రొడ్యూసర్ కొమ్మా రామ కృష్ణ, ఎడిటర్ లోకేష్ కడలి, నటుడు గోవింద్ రాజ్ నీరుడి తదితరులు పాల్గొని కె.ఎస్. రామారావుగాకి ధన్యవాదాలు తెలియజేశారు. నటీనటులు: రమణ్, వర్ష విశ్వనాథ్, జెమినీ సురేష్, గోవింద్ శ్రీనివాస్, శివరాజ్, ఎస్ఆర్‌కే, చరణ్, కిరణ్, గోపాల్ మహర్షి, సునీత మనోహర్, మాస్టర్ విహార్ తదితరులు.



# నల్లనయ్యకు నైవేద్యం



### తియ్యటి అటుకులు

**కావలిసినవి :** అటుకులు- రెండు కప్పులు, కొబ్బరిపాలు- రెండు కప్పులు, పంచదార- కప్పు, ఆకుపచ్చ ఫుడ్ కలర్-కొద్దిగా.

**తయారీ :** ముందుగా కొబ్బరిని గ్రైండ్ చేసి, అందులోంచి కొబ్బరి పాలు తీయాలి. సన్న సెగ మీద ఈ పాలు మరిగిస్తూ అందులో పంచదార వేయాలి. అది కరిగాక అటుకులు, ఫుడ్ కలర్ వేసి కలియతిప్పి కొద్దిగా ఉడికించి దించేయాలి. ఈ తియ్యటి అటుకుల పైన కాస్త కొబ్బరి కోరుచల్లితే.. రుచి పెరగడమే కాకుండా, మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

### కేసరి..

**కావలసినవి :** అటుకులు, చక్కెర-కప్పు చొప్పున, నెయ్యి-అర కప్పు, యాలకుల పొడి-అర చెంచా, జీడిపప్పు, కిస్మిస్-అర కప్పు, కుంకుమ పువ్వు.



**తయారీ :** ముందుగా కడాయిలో నెయ్యి వేసి అటుకులు వేయించాలి. వేడి తగ్గాక కొంచెం బరకగా పొడి చేసుకోవాలి. ఇందులో నెయ్యి, కొద్దిగా నీళ్లు పోసి ఉండలు రాకుండా ఉడికించాలి. పంచదార వేస్తూ కలియ బెట్టాలి. దగ్గరగా అయ్యాక.. నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్మిస్, కుంకుమ పువ్వు వేసి కలపాలి. అంతే.. కేసరి సిద్ధం.

### మోదకం

**కావలసినవి :** అటుకులు- రెండు కప్పులు, నెయ్యి- కప్పు, బెల్లం- పావు, యాలకుల



పొడి-అర చెంచా, జీడిపప్పు, కిస్మస్-అర కప్పు, నచ్చిన ఫుడ్ కలర్ -కొద్దిగా

**తయారీ :** కడాయిలో కొద్దిగా నెయ్యి వేసి అటుకులు వేయించుకోవాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. జీడిపప్పు, కిస్మిలో నేతిలో వేయించాలి. బెల్లం పాకం పట్టి-అందులో అటుకులు పొడి, యాలకుల పొడి, జీడిపప్పు, కిస్మిస్, ఫుడ్ కలర్ వేసికలపాలి. ఆ మిశ్రమంతో మోదకాలు చుట్టుకోవాలి. ఇవి రుచీ, ఆరోగ్యం కూడా.

# మహా దౌత్యవేత్త శ్రీకృష్ణుడు



'కృష్ణ' అన్న పేరు పరమ పవిత్రమైంది. అతి విశిష్టమైంది. కృష్ణ అన్న పదంలోని 'క' కారం బ్రహ్మ వాచకం. 'ఋ'కారం విష్ణు వాచకం, 'ష'కారం శివ వాచకం. 'ణ' కారం ధర్మవాచకం. ఆ పేరులో సకల దేవతలూ నిక్షిప్తమై ఉన్నారు. ఒక్క కృష్ణ నామస్మరణం సర్వదేవతా ప్రార్థనా పుణ్య ప్రసాదితమై, ధర్మమార్గ ప్రబోధితమై, సకల పాపహరణమై నిలిచి, తలచిన వారికి ముక్తిని ప్రసాదిస్తుంది.

కృతయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో యజ్ఞం వల్ల, ద్వాపరయుగంలో పూజలు, వ్రతాల వల్ల పొందే ఫలితాలన్నీ కలియుగంలో కేవలం హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే అన్న నామమంత్ర స్మరణతో పొందగలుగుతారు. దీన్ని స్వయంగా బ్రహ్మదేవుడు నారదుడికి వివరించాడని పురాణ వచనం. మహావిష్ణువు మహోన్నత అవతారమైన శ్రీకృష్ణుడు... అసంఖ్యాక రాక్షసుల అరాచకాలను భరించలేక, ఆ దుష్టుల భారాన్ని మోయలేక, శరణు కోరిన భూదేవి కోరికను మన్నించాడు. భూమిపై అవతరించాడు. శ్రీముఖ నామ సంవత్సరం, శ్రావణమాసం, బహుళ అష్టమి తిథి. రోహిణీ నక్షత్రం, వృషభ లగ్నంలో అత్యంత శుభ ముహూర్తాన జన్మించాడు. కంసుడి బారినపడకుండా వాసుదేవుణ్ణి గోకులంలో దించాడు వసుదేవుడు. అక్కడ పూతన, శకటాసుర, వృత్రాసుర, ధేనుకాసుర, బకాసురాది ఎందరో రాక్షసులను బాల్యంలోనే సంహరించాడు మాధవుడు. బాలకృష్ణుడి గా, చిలిపి కృష్ణుడిగా, రాధాకృష్ణుడిగా దర్శనమిచ్చాడు. శ్రీకృష్ణ లీలలంటే ఇష్టపడని వాళ్లు. కానీ ఆ లీలలు వివరించే కథలు కేవలం కాలక్షేపం కోసం కాదు. జ్ఞాన వైరాగ్యాలతో కూడుకుని, భక్తి శ్రద్ధలకు నెలవైనవి. అందులో నివృత్తి మార్గం వివరించడం విశేషం.



ఈ విశ్వానికి ఆద్యుడు శ్రీకృష్ణుడు సర్వం తెలిసిన వ్యక్తి. తాత్విక వేత్త ఎప్పుడు ఎలా మసలుకోవాలో, ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో బాగా తెలిసిన నేర్పరి మంచి రాజనీతివేత్త కురు, పాండవుల మధ్య సమరం జరుగరాదని, జరిగితే వచ్చే నష్టాన్ని కళ్ళకు కట్టనట్లుగా సుయోధనునికి తెలిపిన జ్ఞాని. పాండవులకు ముఖ్య సలహాదారుడిగా అన్నిటా తానై ఉండి సంరక్షించిన మహా మనిషి. ద్రౌపది వస్త్రపహరణం జరిగిన వేళ చీరెలు ఇచ్చి చెల్లెలికి రక్షణగా నిలబడిన వ్యక్తి. మాయ జూదంలో పాండవులు ఓడి పోతారని, అది వారికే లాభాదాయకమని ముందే పసిగట్టిన భవిష్యత్ విధాత శ్రీకృష్ణుడు. అర్జునునికి రథ సారధిగా ఉండి యుద్ధ మెలకువలు తెలిసిన వ్యక్తి. సూర్యాస్తమయంలోగా సైంధవుడిని సంహారిస్తానని చెప్పినప్పుడు, కాలాన్ని మార్చి వేసిన లోక దారి. అర్జునిని ప్రతిజ్ఞ సఫలం కావడానికి శ్రీకృష్ణుని లీలనే ప్రధానం అలానే శిశు పాలుని నూరు తప్పులు క్షమిస్తానని అత్తకు మాట ఇచ్చి నూటొక్క తప్పులు చేయబోతున్నప్పుడు మాట ప్రకారం సుదర్శన చక్రంతో శిశుపాలుని శిరము ఖండించి వేసే మాట జవదాటని వీరుడు. వాస్తవాలు గమనించి పాండవుల పక్షాన చేరమని జన్మ రహస్య కర్ణుడికి చెప్పిన తత్వవేత్త. శకుని మాయో పాయములు తెలిసిన సూత్రదారి. కౌరవుల పంచనే ఉండి, వారిని పాండవుల పైకి రెచ్చగొట్టి, సుయోధనుని పతనం, శకుని కుయుక్తులు తెలిసిన సర్వగ్నుడు కృష్ణుడు. అష్ట మహిషులను ఒకటిగా చూసిన రసగ్నుడు. సత్యభామ కోపాన్ని శాంతింప జేసిన శాంతిదాత. రుక్మిణిని ఆసాంతం తన హృదయంలో నిలుపుకున్న హృదయాలోలుడు. గోపికలచే నృత్యాలు చేస్తు ఆడుతూ, పాడుతూ వారి మనసును గెలిచిన ప్రేమ మూర్తి చిన్న తనంలోను, పెద్ద తనంలోను వెన్న అంటే మహాఇష్టముగా జుర్రుకున్న వెన్న దొంగ విధురుని భక్తిని స్వయంగా చూసిన భక్తి పరుడు. విశ్వరూపాన్ని చూపి తన ధర్మాన్ని నిర్వర్తించమని పార్థునికి భగవద్గిత బోధించిన శ్రీకృష్ణుడు నాటికి, నేటికీ మనకు ఆద్యుడు పూజ్యుడు మహా పురుషుడు. నన్నే పూజిస్తూ నాకు తృణమో, ప్రణమో అర్పించిన వారిని నేను ఈతి బాధల నుండి తీరం చేరుస్తానని సత్యం చెప్పిన సర్వగ్నుడు మన శ్రీకృష్ణుడు. ఇన్ని మంచి కార్యములు చేసిన కపట నాటక సూత్రధారి అని పేరు పడినా, మంచి చేయి వారికి సహాయంగాను, చెడు చేసిన వారిని శిక్షించిన వ్యక్తిగా లోక ప్రసిద్ధుడుగా, కోరిన వారికి వరాలు నొసంగే. దయమూర్తి శ్రీకృష్ణుడుబలరామునికి చేదోడుగా ఉండి ఆదర్శ సోదరునిగా మెలగిన శ్రీకృష్ణుడు సర్వదా మనకు ఆరాధనీయుడు. □

# పరికిణి ఓణీ జత కుదిరింది..




ఫ్యాషన్ ఫ్యాషన్

పెళ్లి వేడుకంటే ఒకప్పుడు యువతులంతా లంగా ఓణీల్లో సిద్ధమైపోయే వారు. అసలు సందడంతా వాళ్లదే. అది చూసి 'ఎవండీ ఆ అమ్మాయి' అంటూ ఆరాలూ మొదలయ్యే కానీ అమ్మాయిలకే పరికిణీ ఓణీ అన్న ముద్ర ఉండేది. మరి ఇప్పుడో? వయసు భేదాలే ముఖ్యంగా వధువుల బ్రైడల్ అటైర్లో ఒక్కటైనా పరికిణీ ఓణీ ఉండాల్సిందే! పెళ్లి కూతురు చేసేటప్పుడో, మెహందీ సమయంలోనూ లేదంటే రిసెప్షన్‌లో అయినా ఇది లేనిదే వేడుక రాదని కూడా.



సమస్యల్లా ఏది ఎంచుకోవాలంటే? పరికిణీ ఓణీ అనగానే సరిపోయిందా! పట్టు పరికిణీనా ఫ్యాన్సీదా? ఓణీలు మాత్రం తక్కువా? ఎంబ్రాయిడరీ, సిల్రాస్ట్, పట్టు, నెట్... జాబితా రాయలే కానీ ఆప్షన్లు బోలెడు. ఎన్ని ఉన్నా తమకంట ప్రత్యేకత ఉండాలనుకుంటున్నారు నేటి వధువులు. వాళ్ల మనసు పడుతోంది దేనికి మీదో తెలుసా? ప్రతి కొన్నేళ్లకే ఫ్యాషన్ చక్రం వెనక్కి తిరుగుతుంది అంటుంటారు ఫ్యాషనిస్టులుఅంటే... గత డిజైన్లే మళ్లీ తెరమీదకి వస్తాయన్నమాట. ఒకప్పుడు అంచున పట్టు సరిగా ఉంటే బ్లౌజు, రంగు వేరైనా అంచుతో కూడిన ఓణీ... మహాలక్ష్మల్లా ఉండేవాడా కాదనగలమా? అదే అందాలను కోరుకుంటున్నారు నేటి వధువులు.





### చెలి చిట్కా

ఎక్కువ రకాల కూరగాయలు తరిగేటప్పుడు చాపింగ్ బోర్డ్ మీద విడివిడిగా బోర్డ్ విత్ కంటెయినర్స్ దీనికి నాలుగు అరలుంటాయి. క్యారెట్, క్యాప్సికం, ఉల్లి, టొమాటో, ఇలా ఏవైనా కావచ్చు.

పాదాలను నీళ్ళలోనే ఉంచి ప్యూమిక్ స్టోక్‌తో పాదాల మీద మడమల మీద పగుళ్లను మూడు- నాలుగు నిమిషాలపాటు రుద్దండి. దీని వలన పాదాలపై పేరుకొన్న మట్టి వచ్చేస్తుంది. □

# కూరల కోసం అరలు..



ఒక్కో దాన్నీ తరగగానే ఒక్కో అరలో వేసేస్తే.. కలిసిపోకుండా విడిగా ఉంటాయి. అన్నీ కట్ చేశాక.. తాలింపులో ఒకదాని తర్వాత ఒకటి చొప్పున తేలిగ్గా వేసేయొచ్చు. బాగుంది కదూ! □

### ఆరోగ్య భాగ్యం

# పుదీనా ప్రయోజనం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఇది మొదలు జపాన్, చైనా, యూరోప్‌లో పురాతన కాలం నుండి సాగుచేయబడుతూ ప్రపంచ వ్యాప్తంగా అందరికి చౌకగా అందుబాటులో ఉండే పురాతన మొక్కల్లో ఒకటి అని చెప్పవచ్చు. పుదీనా అనే పదం లాటిన్ పదం మెంత లేదా మెంటా నుండి వచ్చింది. మిన్థా లామిమేసి అనేది దీన శాస్త్రీయ నామం సంస్కృతంలో దీన్ని పూతిహ అంటారు. పూతి అంటే వాసన చేసేది అని అర్థం. దీన్ని స్పియర్‌మింట్, పిప్పర్‌మెంట్, బ్రేన్‌మింట్ గార్డెన్ మింట్, లేడీస్‌మింట్, మార్ష్‌మింట్, పూతీహ, పొదినాక పూదినో అని వివిధ పేర్లతో వ్యవహరిస్తారు. దీన్ని అన్ని రకాల వంటకాల్లో ఎక్కువగా ఉపయోగించే సువాసన గల పురాతన మూలిక అని చెప్పవచ్చును. ఇది ఏడాది పొడవునా తడినేలలో వేగంగా పెరిగే సుగంధ మూలిక. దీంట్లో 13-24 రకాల జాతులున్నాయి. దీని ఆకులు విలక్షణంగా పచ్చగా, మందంగా, మృదువుగా ఉంటాయి. ఇది ఒక రకమైన ఆకుకూర. ప్రత్యేకమైన ఔషధ గుణాలు కల్గి పిప్పర్‌మెంట్ వాసన వచ్చే దీన్ని నేరుగా నమిలి తినొచ్చు. ఇది తీపి, ఘాటైన రూచితో చక్కని సువాసనతో ఆహారంగా, హోమ్‌రెమిడీగా, ఆంటి సెప్టిక్‌గా పనిచేసే ఆదర్శవంతమైన మొక్క. ఇది అనేక విటమిన్స్, మినరల్స్, ఆంటి ఆక్సిడెంట్స్, పాలీ ఫెనాల్స్, ఫైటో న్యూట్రియెంట్స్‌తో కూడిన స్టోర్ హౌస్ అని చెప్పవచ్చు. దీన్ని హోమియో ఆయుర్వేదంలో, యునాని వంటి సంప్రదాయ వైద్య చికిత్సలో, కాస్మోటిక్స్ లో కూడా వాడే మొక్క. ఎండిన లేదా తాజా ఆకుల్ని చాలా వాటిలో ఫ్లేవర్ ఏజెంట్‌గా పనిచేస్తాయి. ఇది శరీరంలోని వేడిని తగ్గించి చలువ చేసే సహజ శీతల కరణి. **పోషకాలు:** 100 గ్రాముల. పుదీనా ఆకుల్లోని పోషక విలువలు : కేలరీలు - 70, తేమ : 85-6 గ్రా. పిండి పదార్థాలు: 6-8గ్రా. ప్రోటీన్స్-3.8 గ్రా. పీచు: 0.26గ్రా, సోడియం: 31 మి.గ్రా, కాల్షియం : 200 మి.గ్రా. పోటిషియం : 569 మి.గ్రా. ఐరన్: 11.9 మి.గ్రా, ఫాస్ఫరస్-60 మి.గ్రా, జింక్ 1.09 మి.గ్రా, మెగ్నీషియం-63 మి.గ్రా, మిటమిన్ ఎ: 203 యుజి. మిటమిన్ సి-27 మి.గ్రా. ఫోలేట్-105 యు.జి., కెరోటిన్ : 1620 మి.గ్రా. 5 వేల 480 గ్రాముల విటమిన్లు బీటా కెరోటిన్ రూపంలో ఉంటాయి.

**ఆరోగ్య ప్రయోజనాలు :** పుదీనాలో వెలకట్టలేని ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. పుదీనాని ఔషధాల ఖజానా అన చెప్పవచ్చు. ఇది జీర్ణ క్రియని మెరుగు పరుస్తుంది. ఇది ఆకలిని, నోటిలోని లాలా జలగ్రంథుల్ని జీర్ణకోశ ఎంజైమ్‌ల స్రావాన్ని ప్రేరేపిస్తుంది. జీర్ణక్రియ ప్రక్రియ వల్ల మెటబాలిజమ్. పెరిగి జీర్ణక్రియని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల పొట్ట ఆరోగ్యం, గట్‌హెల్త్‌కి, ప్రోటీన్ల జీర్ణక్రియకి, వికారం, ఎసిడిటీ, వాంతులు, అజీర్ణం, కడుపులో మంట నొప్పి, త్రేన్పులు, గ్యాస్ట్రయిటిస్, ఐబిఎస్‌కి మంచిది. కేలరీలు, ప్రోటీన్, క్రొవ్వు తక్కువగా ఉండి పోషకాహార నిల్వలు ఎక్కువగా ఉండడం వల్ల ముక్కు, గొంతు, శ్వాసనాళాలు, ఊపిరితిత్తులు ఆరోగ్యానికి చాలా మంచిది. జలుబు, ముక్కు కారడం, ముక్కులు మూసుకొని పోవడం, సైనాసైటీస్ గొంతునొప్పి, ముక్కు, గొంతులో ఇరిటేషన్ ఛాతీ బరువు నొప్పి ఎలర్జీలు, హై ఫీవర్, న్యూమోనియా, క్షయ, బ్రాంకైటిస్, ఆస్థా వ్యాధులకి రిలాక్సెంట్‌గా, ఆంటి ఇన్‌ఫ్లమేటరీగా పని చేస్తుంది. వాతావరణ కాలుష్యాల వల్ల, పొగ, మంచు, దుమ్ము, ధూళి, వల్ల పొగ త్రాగేవారికి వచ్చే ఊపిరితిత్తుల వ్యాధుల్లో ఊపిరితిత్తుల్ని శుభ్రపరుస్తుంది. నొప్పుల్ని తగ్గించడం: ఆంటిస్పాస్‌మెడిక్ లక్షణాల వల్ల మైగ్రేన్ తలనొప్పి, ఒత్తిడి, కండరాల, నరాల నొప్పుల్ని, కీళ్ళనొప్పుల్ని పంటినొప్పిని తగ్గిస్తుంది. దీనిలోని ఆంటి సెప్టిక్ గుణాల వల్ల తాజాశ్వాసను కల్గిస్తుంది. చిగుళ్ళు దంత వ్యాధుల్ని, వాపుల్ని తగ్గించి, దంతాలు గార పట్టకుండా పసుపుపచ్చగా మారకుండా తెల్లగా ఉంచుతుంది. చిగుళ్ళ, దంతాల్ని శుభ్రం చేసి నోటి దుర్వాసన లేకుండా నోటిలోని బాక్టీరియాని తగ్గించి నోటిపూత, పుండ్లని నయం చేస్తుంది. □

# అలా వదిలేయకండి..

ఈతరం అమ్మానాన్నలిద్దరిదీ ఉరుకుల పరుగుల జీవితమే. ఇంటికి వచ్చాకైనా అది ఆగుతుందా అంటే... లేదు. దాంతో తొందరగా అన్నం తినిపించాలని అమ్మ, కదా మీటింగ్ పూర్తిచేయొచ్చని నాన్న, పిల్లలకు ఫోన్ ఇస్తుంటారు. మీదీ ఆ పరిస్థితేనా? అయితే, జాగ్రత్త పడాలంటున్నారు. మనం కాస్త సమయమే అనుకుంటాం కానీ, అది చాలానే... అంటున్నాయి. తాజా ఎయిమ్స్ రాయపూర్ పరిశోధనలు, మన దేశంలో ఐదేళ్ల వయసు లోపు పిల్లలు రోజుకి 2.22గం. స్క్రీన్ చూడటంలోనే గడిపేస్తున్నారట. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సూచించిన దానికంటే రెండురెట్లు ఎక్కువ. వీళ్లేకాదు, రెండేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు కూడా రోజుకి సరాసరి 1.23గం. తెరకి కళ్లప్పగించేస్తున్నారట. ఈ వయసు పిల్లలకు డబ్ల్యూహెచ్ సూచించింది జీరో టైం అధిక తెర సమయం వల్ల పిల్లల్లో భాషా నైపుణ్యాలు, కాగ్నిటివ్ సామర్థం తగ్గడం కాదు, ప్రవర్తన లోపాలు, ఊబకాయం, నిద్రలేమి, ఏకాగ్రత లోపించటం వంటి అనేక సమస్యలూ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు నిపుణులు అయితే, పిల్లలు చుట్టూ ఉన్న వాతావరణం నుంచే 1 నేర్చుకుంటారు. కాబట్టి తల్లిదండ్రులూ తర విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. వాళ్లకు పూర్తిగా స్క్రీన్‌ని దూరం చేయడం కష్టం. కానీ, టెక్ ఫ్రీ ఏర్పాటుచేయటం, స్క్రీన్ సమయం విషయంలో పక్కాగా ఉండటం, ఆటలకు సమయం కేటాయించడం, ముఖ్యంగా తినేటప్పుడు ఫోన్ ఇవ్వకపోవటం, ఈ ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉన్న జోన్ నిపుణులు నిపుణులు. మరి.. మీ పిల్లలకు ఎంత స్క్రీన్ సమయం ఇస్తున్నారో చెక్ చేస్తున్నారా? □



# 'తులసి'తో అందంగా !

మచ్చలేని సౌందర్యాన్ని సొంతం మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులు కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉంటే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి.



**మొటిమలకు..**

✦. తాజా తులసి ఆకులను తినడం వల్ల మొటిమలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. తాజా ఆకులను మెత్తగా చేసుకొని మొటిమలపై రాసినా ఫలితం ఉంటుంది. ✦ తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్ కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు.. ముఖం కాంతివంతంగా మారుతుంది.

✦తులసి పొడిని రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మం రంధ్రాలు తెరుచుకొని మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలుక్రమంగా తగ్గుముఖం పడతాయి.

✦ తులసి రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముకానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమంనం కలుగుతుంది.

**నల్లమచ్చలుంటే..!**

ముఖంపై నల్ల మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకో సారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్ల మచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతి వంతంగా మారుతుంది. □

# ఉల్లాసంగా, ఉత్సాహంగా..



నేటి తరం మహిళలకు ఆరోగ్య స్పృహ ఎక్కువే. నిత్యం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటానికి చేసే ప్రయత్నాలూ అనేకం. మరి అలా ఉండాలంటే డైట్ పరంగా ఏం చేయాలో తెలుసా. మనం తినే ఆహారమే మనల్ని నిర్ణయిస్తుందంటారు. అది అక్షర సత్యం. మనం ఎంత ఆహారం తీసుకుంటున్నామనే దానిమీద అంటే అందులోని కెలోరీల పరిమాణంపై మనం జీవన కాలం ఆధారపడి ఉంటుందట. తక్కువ కెలోరీలు తీసుకునే వారిలో బ్రెయిన్ ఏజింగ్ ఆలస్యమవటమే కాకుండా వయసు పెరిగేకొద్దీ వచ్చే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటివీ తొందరగా రాకుండా ఉంటాయి. దాంతో పాటు ఆరోగ్యం మెరుగుపడి ఆయుష్షూ పెరుగుతుందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే నీళ్లు ఎక్కువగా తాగటం, పంచదారతో తయారు చేసిన పదార్థాలకు దూరంగా ఉండటం, తక్కువ కార్బోహైడ్రేట్లూ ఎక్కువ ప్రోటీన్లూ ఉండే ఆహారాన్ని తీసుకోవటంతో పాటు నిత్యం వ్యాయామం చేయటం ద్వారా కెలొరీలనూ తగ్గించుకుంటే ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండొచ్చు. □

# భారత్, పాక్ మధ్య భీకర పోరు



## సెప్టెంబరు 14న హై ఓల్టేజ్ మ్యాచ్

## ఆసియా కప్‌లో ఆధిపత్యమెవరిదో?

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025కు ఇంకా ఒక నెల కన్నా తక్కువ సమయం మాత్రమే ఉంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభమవుతుంది. నిరసనలు, బహిష్కరణ పిలుపులు, సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య, భారత్ వర్సెస్ పాకిస్తాన్ సెప్టెంబర్ 14న తమ మొదటి మ్యాచ్‌లో తలపడనున్నాయి. రెండు జట్లు సూపర్ 4కు చేరుకుంటే, ఆ మ్యాచ్ కూడా యుఎఇలోనే జరుగుతుంది. అక్కడి నుంచి ఫైనల్‌కు చేరుకుంటే, ఈ మైదానం మూడోసారి ఇరు జట్ల మధ్య జరిగే మూడో మ్యాచ్‌కు సాక్ష్యంగా నిలుస్తుంది. 8 జట్ల టోర్నమెంట్ విజేతను సెప్టెంబర్ 28న నిర్ణయిస్తారు. ఈ టోర్నమెంట్ యుఎఇలో టి20 ఫార్మాట్‌లో జరగనుంది. ప్రతి ఈవెంట్ లాగానే, భారత్ వర్సెస్ పాకిస్తాన్ ఇందులో కూడా ఒకే గ్రూప్ (ఎ)లో ఉన్నాయి. యుఎఇ లేదా ఒమన్ ఓటమిని చవిచూడకపోతే, ఇరు జట్లు సూపర్4 రౌండ్‌లో కూడా తలపడటం దాదాపు ఖాయం. రెండు జట్లు సూపర్4లో కూడా మొదటి, రెండవ స్థానంలో నిలిచినట్లయితే, ఫైనల్‌లో కూడా తలపడతారు. ఇక ప్రస్తుత ఫామ్‌ను పరిశీలిస్తే, గత ఏడాదిలో టి20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీం ఇండియా పైచేయి సాధించినట్లు కనిపిస్తోంది. బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి జట్లను ఓడించింది. మరోవైపు, పాకిస్తాన్ ప్రదర్శన ఒడిదుడుకులతో నిండి ఉంది. రెండు జట్ల మధ్య గ్రూప్ దశతో సహా అన్ని మ్యాచ్‌లు దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతాయి. ఇక్కడ పాకిస్తాన్ స్వల్ప పైచేయి సాధించింది. ఈ స్టేడియంలో భారత్, పాక్ మధ్య మొత్తం 3 టి20 మ్యాచ్‌లు జరిగాయి. వాటిలో పాక్ 2 గెలిచింది. భారత జట్టు ఒక మ్యాచ్ గెలిచింది. మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఆసియా కప్‌లో, భారత్ వర్సెస్ పాకిస్తాన్ ఈ మైదానంలో రెండుసార్లు తలపడ్డాయి. ఒక్కొక్క మ్యాచ్ గెలిచాయి. పాక్ గెలిచిన ఒక అదనపు మ్యాచ్ 2021 టీ20 ప్రపంచ కప్‌లో ఇండియాను ఓడించింది. యాదృచ్ఛికంగా, ఆ ప్రపంచ కప్, ఆ తర్వాత ఆసియా కప్‌లో ఇండియా ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. అయితే సూర్యకుమార్ నాయకత్వంలో, గౌతమ్ గంభీర్ శిక్షణలో ఉన్న భారత జట్టు బలాన్ని చూస్తే, పాత రికార్డు దానిపై ఎలాంటి ప్రభావం చూపదని అనిపిస్తుంది. ఈ జట్టు గత ఏడాదిలో విభిన్న సామర్థ్యాలు, విభిన్న పరిస్థితులలో ఉన్న జట్లను ఓడించింది. ఇటువంటి పరిస్థితిలో, మరోసారి భారత జట్టు టైటిల్ కోసం పోటీదారుగా ఉంటుంది.



## మహిళల 50 ఓవర్ల సిరీస్ భారత్‌దే

### ఆస్ట్రేలియాపై 2 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** మహిళల 50 ఓవర్ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాపై టీమిండియా విజయం సాధించింది. బ్రిస్బేన్‌లో శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన రెండో మ్యాచ్‌లో యాస్టికా భాటియా, రాధా యాదవ్, తనూజా కన్వర్ అర్ధ సెంచరీలు చేయడంతో రెండు వికెట్ల తేడాతో టీమిండియా కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న అలిస్సా హీలీ 87 బంతుల్లో 91 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 265/9 పరుగులు చేసింది. మిగిలిన బ్యాటింగ్ లైనప్ అత్యుత్తమ ప్రదర్శనలు ఇవ్వలేదు భారత్ తరఫున, ఆఫ్‌స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ మిన్ను మణి (3-46), పేసర్లు సైమా ఠాకూర్ (2-30) అత్యుత్తమ వికెట్లు పడగొట్టగా, రాధా, తనూజ, ప్రేమ రావత్, టిటాస్ సాధు తలా ఒక వికెట్ తీసుకున్నారు. ఇక 266 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, యాస్టికా భాటియా 71 బంతుల్లో 66 పరుగులు చేసి నిలదొక్కుకుంది. ఇది ఈ సిరీస్‌లో ఆమె వరుసగా రెండో అర్ధ సెంచరీ. కానీ షఫాలీ వర్మ, తేజల్ హసబ్నిస్, రాఘవ్వీ బిస్ట్ 37 పరుగులు సాధించడంతో, ఇండియా 39వ ఓవర్‌లో 193/7కి పడిపోయింది.కెప్టెన్ రాధా 78 బంతుల్లో 60 పరుగులు చేసి ఔటవడంతో, భారత ఓటమి ఖాయమని చాలామంది భావించారు. కానీ తనుజ, ప్రేమ 8వ వికెట్‌కు 62 బంతుల్లో 68 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. తనుజ 57 బంతుల్లో కీలకమైన 50 పరుగులు చేసి స్క్వేర్ షాట్‌లకు మద్దతును అందించగా, ప్రేమ 33 బంతుల్లో అజేయంగా 32 పరుగులు చేసి ఆటను మలుపు తిప్పింది. దీంతో ఒక బంతి మిగిలి ఉండగానే టీమిండియా 49.5 ఓవర్లలో 266/8తో గెలుపొందింది.

## ప్రపంచ క్రీడల్లో.. ఆనంద్‌కు తొలి రోలర్ పతకం



**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రీడలు-2025లో భారత దేశపు మొట్ట మొదటి రోలర్ స్పోర్ట్స్ పతకాన్ని ఆనంద్‌కుమార్ వెల్‌కుమార్ గెలుచుకున్నాడు. శుక్రవారం చైనాలోని చెంగ్డులో జరిగిన ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ ట్రాక్ ఈవెంట్‌లో కాంస్యం సాధించడం ద్వారా ఆనంద్ చరిత్ర సృష్టించాడు. దీంతో ప్రపంచ క్రీడల్లో భారతదేశం తొలిసారిగా రోలర్ స్కేటింగ్ పతకాన్ని గెలుచుకున్న రికార్డు నమోదు చేసింది. పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్ ఈవెంట్‌లో ఆనంద్ 1:22.482 సెకన్లసమయంతో పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ మెడల్‌తో భారతదేశం యొక్క పతకాల సంఖ్యను 3 పతకాలకు (1 రజతం, 2 కాంస్య) తీసుకువెళ్లాడు. ఒకే ఎడిషన్‌లో భారత్ సాధించిన అత్యధిక పతకాల సంఖ్య ఇది. ఆనంద్ 1:22.151 సెకన్ల సమయంతో ప్రాథమిక రౌండ్‌లో మూడవ స్థానంలో నిలిచి, తోటి భారత ఆటగాడు ఆర్యన్‌పాల్ సింగ్ ఘుమాన్‌తో కలిసి సెమీఫైనల్‌కు చేరాడు. ఆ తర్వాత అతను సెమీఫైనల్స్‌లో తన సమయాన్ని మెరుగుపరుచుకుని, మొదటి హీట్‌లో అద్భుతమైన 1:20.355 సెకన్లతో రెండవ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. తదుపరి అదే హీట్‌లో 6వ స్థానంలో నిలిచిన ఆర్యన్‌పాల్ పోటీ నుండి నిష్క్రమించాడు. ఆనంద్‌కుమార్ చాలా వ్యూహాత్మకంగా ఫైనల్ రేసును చేరుకున్నాడు. అక్కడ అతను ఇద్దరు కొలంబియన్లు, ఒక స్పానిష్ స్కేటర్ తరువాత 4వ స్థానంలోనిలిచాడు. కానీ అదృష్టం అతనికిఅనుకూలంగాఉండటంతో, కొలంబియన్ స్కేటర్లలో ఒకరైన జువాన్ జాకోబో మాంటిల్లా పినిల్లా అనర్హుడిగా ప్రకటించబడ్డాడు. దీంతో ఆనంద్‌కుమార్ కాంస్య పతక విజేతగా ఎంపికయ్యాడు.

## పురుషుల హాకీ నేషనల్స్.. చండీఘర్, ఉత్తరాఖండ్ విజయం

### హిమాచల్, కాశ్మీర్ డ్రా



**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్‌లో డివిజన్ బి మ్యాచ్‌లలో చండీగఢ్, ఉత్తరాఖండ్‌లు విజయం సాధించగా, హిమాచల్, జమ్మూ కాశ్మీర్‌లు డ్రాతో సరిపెట్టుకున్నాయి. హిమాచల్, జమ్మూ కాశ్మీర్ మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్ 5-5తో డ్రాగా ముగియగా, ఇరు జట్లు ఒక పాయింట్‌ను పంచుకున్నాయి. కాశ్మీర్ తరపున కెప్టెన్ రాజ్‌వీర్ సింగ్ (1, 19, 34) స్కోరింగ్ ఫామ్‌లో ఉండి హ్యాట్రిక్ సాధించాడు. అతని జట్టులో రోహన్‌ప్రీత్ సింగ్ (51), గమన్‌ప్రీత్ సింగ్ (56)లు కూడా గోల్స్ చేశారు. హిమాచల్ తరపున గౌరవ్ కుమార్ (43, 53) రెండు గోల్స్ సాధించగా, అనుజ్ (15), ప్రన్షు చౌదరి (18), సుఖ్‌మన్‌ప్రీత్ సింగ్ (27) కూడా స్కోర్‌షీట్‌లో ఉన్నారు. రెండవ మ్యాచ్‌లో చండీగఢ్ పూల్ ఎ మ్యాచ్‌లో అరుణాచల్‌పై 4-3 తేడాతో స్వల్ప విజయం సాధించింది. విజేత జట్టుకు రిషవ్ (8), ముహమ్మద్ జాయిద్ (19), ఫతే సింగ్ (31), ప్రభ్జోత్ సింగ్ (33) గోల్స్ చేశారు. కెప్టెన్ అమర్‌జీత్ సింగ్ (17, 36, 53) హ్యాట్రిక్ గోల్స్ చేయడం ద్వారా అద్భుత నైపుణ్యాలను ప్రదర్శించాడు. అయితే, నాలుగు క్వార్టర్లలో అరుణాచల్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. ఈ రోజు జరిగిన చివరి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్, అస్సాంపై 8-1 తేడాతో ఆధిపత్య విజయం సాధించింది. ఉత్తరాఖండ్ తరపున మహేంద్ర సింగ్ బిష్ట్ (33, 37), రోహిత్ ఐరీ (32, 45), సూరజ్ కుమార్ (55, 60), విశాల్ కుమార్ (2), నవీన్ ప్రసాద్ (14) గోల్స్ సాధించారు. అస్సాం తరపున రోహన్ ఎక్కా (29) ఏకైక గోల్ చేశాడు.

## స్టీపుల్‌చేజ్‌లో..స్వర్ణంతో మెరిసిన అంకిత



**న్యూఢిల్లీ:** డబ్ల్యూఎటిసి-సిల్వర్ లెవల్ మీట్, గ్రాండ్‌స్లామ్ జెరూసలేంలో ఒలింపియన్ అంకితా ధ్యాని 2000 మీటర్ల మహిళల స్టీపుల్‌చేజ్ జాతీయ రికార్డును బద్దలు కొట్టి బంగారు పతకాన్ని గెలుచుకుంది. శుక్రవారం జరిగిన ఈవెంట్‌లో అంకిత 6:13.92 సెకన్ల సమయంతో టైటిల్‌ను గెలుచుకుని, పరుల్ రికార్డును 0.46 సెకన్ల తేడాతో అధిగమించింది. దీంతో ఆమెను ఈ విభాగంలో ఆల్‌టైమ్ ఆసియా టాప్ లిస్ట్‌లో రెండవ స్థానానికి చేర్చింది. ఈసారి ఆమెను 2025లో టాప్ 10 అత్యుత్తమ ర్యాంకుకు తీసుకువెళుతుంది. ఈ విజయం మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేస్ ఈవెంట్‌లో రోడ్ టు టోక్యో రేసుకు భారీ ర్యాంకింగ్ పాయింట్లను పొందడంలో ఆమెకు సహాయపడుతుంది. దాదాపు 1,200 పాయింట్ల లాభంతో, అంకిత రోడ్ టు టోక్యో ర్యాంకింగ్స్‌లో 35వ స్థానానికి ఎగబాకుతుందని అంచనా. ఈ టోర్నమెంట్ ఈ నెలాఖరులో ముగియనుంది. కాగా అంకిత ఈ సంవత్సరం అసాధారణ ఫామ్‌లో ఉంది. ఈ సంవత్సరం తన 3000 మీటర్ల స్టీపుల్‌చేస్ వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన నుండి దాదాపు ఒక నిమిషం తక్కువ చేసి 2025 ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో చారిత్రాత్మక రజత పతకాన్ని సాధించింది.

## అక్టోబరునాటికి ఇండో-యుఎస్ వాణిజ్య ఒప్పందం

### 25న అమెరికా బృందం భారత్‌కు రాక: వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వల్



**న్యూఢిల్లీ,ఆగస్టు 15:** అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందం చివరి దశకు వచ్చింది. ఇరు దేశాల మధ్య ఒప్పందం సెప్టెంబర్, అక్టోబర్ నాటికి పూర్తవుతుందని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వల్ తెలిపారు. ఇందుకోసం అమెరికా ముమ్మరంగా చర్చలు చేస్తున్నట్లు చెప్పారు. తదుపరి చర్చల కోసం అమెరికా బృందం ఆగస్టు 25న భారత్‌కు వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఐదు సార్లు వాణిజ్య ఒప్పంద చర్చలు జరిగాయి. తాజాగా ఆరో విడత చర్చల కోసం ఆగస్టు చివరి వారంలో అమెరికా బృందం భారత్‌కు రానుంది. భారత్‌తో వాణిజ్య చర్చలపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేసిన తరుణంలో భారత్ ఈ మేరకు స్పందించింది. అంతకుముందు అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భారత్ కాస్త మొండిగా వ్యవహరిస్తోందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ వ్యాఖ్యానించారు. సుంకాలు విధించినప్పటికీ వాణిజ్య చర్చల విషయంలో భారత్ కాస్త కూడా వెనక్కి తగ్గడం లేదని అన్నారు. దీనివల్ల చర్చలు నెమ్మదిగా సాగుతున్నట్లు వెల్లడించారు. స్విట్జర్లాండ్, భారత్ సహా ఇంకా కొన్ని పెద్ద వాణిజ్య ఒప్పందాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అక్టోబర్ నాటికి సుంకాలకు సంబంధించిన చర్చలను ముగించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకు అనుగుణంగా ట్రంప్ యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారత్‌పై 50శాతం సుంకాల భారాన్ని మోపారు. ముందుగా 25శాతం సుంకాలను విధించిన ఆయన, ఆ తర్వాత దానిని మరో 25 శాతం పెంచి 50 శాతానికిచేశారు. అయితే, ట్రంప్ టారిఫ్‌లకు భారత్ కూడా దీటుగా స్పందించింది. దేశంలోని రైతులు, పాలఉత్పత్తుల రంగం, మత్స్య కారుల ప్రయోజ నాలే తమకు ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అవసరమైతే ఆ భారాన్ని తామే మోస్తామని భరోసా ఇచ్చారు. టారిఫ్‌ల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొనసాగు తున్నప్పటికీ భారత్‌తో పూర్తిస్థాయి చర్చల్లో పాల్గొంటామని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ ఇప్పటికే స్పష్టం చేశారు. అమెరికా తాజాగా పెంచిన సుంకాలు అమల్లోకి రాకముందే ఆదేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల కోసం ప్రధాని నరేంద్ర మోడీ త్వరలో అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు అధికార వర్గాలు చెప్పాయి.



## జిఎస్టీలో ఇక రెండే శ్లాబులు!

### దీపావళినాటికి అమలుచేసే లక్ష్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** నిత్యావసరాల ఉత్పత్తుల్లో కొనుగోలుచేసే వస్తువులపై జిఎస్టీ రేట్లు తగ్గిస్తామని ప్రధాని మోడీ ప్రకటించారు. దీపావళి నాటికి రేట్లు తగ్గించి పండగ ఆనందం రెట్టింపు చేస్తామన్నారు. ఆర్థిక మంత్రిత్వశాఖ కూడా జిఎస్టీపై కీలకప్రకటనచేసింది. జిఎస్టీలో ఇకపై రెండు శ్లాబులే ఉంటాయని కొన్ని ఉత్పత్తులకు మాత్రమే ప్రత్యేక రేట్లు వర్తిస్తాయని తెలిపింది. ప్రస్తుతం 5,12,18,28 శాతం శ్లాబులున్నాయి. గత ఎనిమిదేళ్లలో జిఎస్టీపరంగా తమ ప్రభుత్వం అనేకసంస్కరణలు తెచ్చిందని ప్రధానిమోడీ ఎర్రకోట బురుజుపైనుంచి ప్రసంగిస్తూ చెప్పారు. మలివిడత సంస్కరణలు తెస్తున్నామని సామాన్యులకు ఉపశమనం కలుగుతుందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా మేలుజరుగుతుందన్నారు. నిత్యం వినియోగించే వస్తువులు ధరలు తగ్గడంవల్ల దేశ ఆర్థికవ్యవస్థ మరింతశక్తివంతం అవుతుందని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్రాలకు చెందిన మంత్రులతో కూడిన బృందాన్ని జిఎస్టీ కౌన్సిల్ ఏర్పాటు చేసింది. వీటిలో స్టాండర్డ్, మెరిట్ వంటి రెండురేట్లు మాత్రమే ఉంటాయని వివరించింది.

## 27.35 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్యలోటు!

వాణిజ్యం




**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత్ ఎగుమతులు రెండునెలలుగా క్షీణత నమోదుచేసిన తర్వాత జులైలో మళ్లీ పుంజుకున్నాయి. 7.29శాతం వృద్ధితో 37.24 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 8.6శాతంపెరిగి 64.59 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్యలోటు 8 నెలల గరిష్టమైన 27.35 బిలియన్ డాలర్లుగా ఉంది. గత ఏడాది నవంబరులో 31.77 బిలియన్ డాలర్ల లోటు తర్వాత ఇదే అత్యధిక వాణిజ్యలోటు. ఏప్రిల్ జులై నెలలమధ్యలో ఎగుమతులు 149.2 బిలియన్ డాలర్లు ఉంటే దిగుమతులు 125.52 బిలియన్ డాలర్లకుపెరాగాయి. గత ఏడాదితోపోలిస్తే ఎగుమతులు 3.07శాతం, దిగుమతులు 5.36శాతం చొప్పున పెరిగాయి. వాణిజ్యలోటు 94.81 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత్ వస్తుసేవల ఎగుమతులు మెరుగైన వృద్ధిని సాధించాయని వాణిజ్యకార్యదర్శి సునీల్‌వర్త్వాల్ అన్నారు. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రత్నాభరణాలు, ఔషధ,రసాయనాల రంగాలు ఇందుకుదన్నుగా నిలిచాయి. అంతర్జాతీయ ఎగుమతుల వృద్ధికంటే మన ఎగుమతుల వృద్ధి అధికంగా ఉంది. జులైలో ఇంజినింగ్ 13.75శాతం వృద్ధితో 10.42 బిలియన్‌డాలర్లు ఎలక్ట్రానిక్స్ 34శాతం వృద్ధితో 3.76 బిలియన్ డాలర్లు, రత్నాభవరణాలు 29శాతంపెరిగి 2.4బిలియన్ డాలర్లు, ఔషధాలు 14శాతంపెరిగి 2.7 బిలియన్ డాలర్లు, రసాయనాలు 7.19శాతం పెరుగుదలతో 2.46 బిలియన్ డాలర్లు నమోదుచేసాయి. ఇక పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 25శాతం తగ్గి 4.34 బిలియన్ డాలర్లకుచేరాయి. ముడిచమురు పసిడి దిగుమతులు వరుసగా 7.46శాతం, 13.83శాతం పెరిగి 15.57 బిలియన్ డాలర్లు, 3.93 బిలియన్‌డాలర్లుగా ఉన్నాయి.సేవలరంగంలో ఎగుమతులు జులైలో 30.60 బిలియన్ డాలర్లుకాగా ఈఏడాది గతనెలలో 31.03 బిలియన్ డాలర్లు అయ్యాయి. అలాగే సేవలరంగ దిగుమతులు కూడా 15.40 బిలియన్ డాలర్లవరకూ ఉన్నట్లు అంచనా. జులైలో అమెరికాకు 19.94శాతంపెరిగి 8.01 బిలియన్ డాలర్ల ఎగుమతులుజరిగితే దిగుమతులు 13.78శాతంపెరిగి 4.55 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. చైనాకు ఎగుమతులు 27.39శాతంపెరిగి 1.34బిలియన్ డాలర్లు, దిగుమతులు 19.97శాతం పెరిగి 5.75 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.

## వారాంతంలో స్వల్పంగా తగ్గిన పసిడి!



**ముంబయి, ఆగస్టు 15:** వారాంతంలో పసిడిధరలు కొంతమేర తగ్గాయి. లక్ష రూపాయలు దాటిన బంగారం ధరలు మళ్లీ కిందకు దిగివస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల ప్రభావం బులియన్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఈ రోజు 100 గ్రాముల పసిడి ధర రూ.1100 తగ్గింది. ఇండియా అమెరికా దేశాల మధ్య జరుగుతున్న సుంకాల వార్ దెబ్బకి పసిడి ధరల్లో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆగస్టు తొలి వారంలో 10 గ్రాముల ధర దాదాపు రూ. 7 వేలకు పైగానే పెరిగింది. వచ్చే పండుగ సీజన్ నేపథ్యంలో ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు 15 శుక్రవారం బంగారం ధరలను పరిశీలిస్తే 24 క్యారట్ల గ్రాము బంగారం 11 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.10,124 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,280 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.7,593 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1100 తగ్గి రూ. 10,12,400 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.1000 తగ్గి రూ. 9,28,000 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల బంగారం ధర రూ.800 తగ్గి 100 గ్రాములు రూ.7,59,300 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,930 గా నమోదైంది. విజయవాడ విషయానికి వస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,930 గా నమోదైంది. చెన్నైలో బంగారం ధరలను పరిశీలించినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.76,700 గా నమోదైంది. ముంబైలో బంగారం ధరలను పరిశీలించినట్లయితే10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,930 గా నమోదైంది.

## ఎస్ అండ్ పి గ్లోబల్.. భారత్ రేటింగ్ 'ట్రిపుల్ బి'



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత్ సార్వభౌమ క్రెడిట్‌రేటింగ్ ట్రిపుల్ బికి పెరిగింది. ఎస్ అండ్ పి గ్లోబల్‌రేటింగ్స్ 18 ఏళ్ల తర్వాత మన దేశ క్రెడిట్‌రేటింగ్ సవరించింది. బలమైన ఆర్థికవృద్ధి ఉందని, భవిష్యత్ అంచనాను స్థిరత్వంగా సవరించింది. ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటి అని వెల్లడించింది. ఐదారేళ్లనుంచి ప్రభుత్వ వ్యయాల్లో ఉన్నత ప్రమాణాలున్నాయని వెల్లడించింది. అమెరికా ట్యారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థికవ్యవస్థపై అంతగా ప్రభావం చూపించవని కూడా స్పష్టంచేసింది. అమెరికాకు మన దేశ ఎగుమతులపై 50శాతంసుంకాలు విధించినా వృద్ధి మందగించబోదని వాణిజ్యంపై భారత్ తక్కువ ఆధారపడిందని, సుమారు 60శాతం ఆర్థికవృద్ధి దేశీయ వినియోగంనుంచే వస్తోందని వెల్లడించింది. రేటింగ్ సవరణపై ఆర్థిక మంత్రిత్వశాఖ సంతోషం వ్యక్తంచేసింది. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో మన దేశ ఆర్థికవ్యవస్థ చురుగ్గా ముందుకుసాగుతోందని ఎస్అండ్‌పి తన సోషల్‌మీడియాలోపోస్టుచేసింది.

## భారీ రుణభారంలో అమెరికా!

### 37 లక్షలకోట్ల డాలర్లకు చేరిన రుణం

**న్యూయార్క్, ఆగస్టు 15:** ప్రపంచదేశాలపై సుంకాలు విధించి అమెరికా తన ఆర్థికలోటును తగ్గించుకోవాలని చూస్తున్నప్పటికీ రుణభారంలో అగ్రగామిగా నిలిచింది. మొత్తం రుణదాతలకు అమెరికా ఇప్పటివరకూ 37 లక్షలకోట్ల డాలర్లు చెల్లించాల్సి ఉంది. అమెరికా జిడిపిలో 122శాతానికి సమానం. మూడునెలలకు రుణభారం సుమారు లక్షలకోట్ల డాలర్లుపెరుగుతోంది. 2020 కొవిడ్‌సమయంలో అత్యధికంగా రుణాలు, జిడిపి నిష్పత్తిలో రుణాలు 133శాతానికి చేరింది. ప్రపంచంలోనే ఈనిష్పత్తి అధికంగా ఉన్న మొదటి పదిదేశాల్లో అమెరికా కూడాఉంది. అమెరికా ఆర్థికవ్యవస్థ పరిమాణం 30.3 లక్షలకోట్లు డాలర్లుకాగా ఆదేశ రుణభారం అంతకుమించి 37 లక్షలకోట్ల డాలర్లుగా ఉంది. పన్నువసూళ్ల కంటే వ్యయాలు అధికంగాచేస్తే లోటు వస్తుంది. ఈ లోటు భర్తీకి రుణాలపైనే ఆధారపడాలి. ప్రస్తుతం రుణపరిమితిని అమెరికా కాంగ్రెస్ నిర్దేశిస్తుంది. పరిమితి చేరుకున్న తర్వాత కాంగ్రెస్ పెంచకపోతే ప్రభుత్వ రుణాలు తీసుకోవడం సాధ్యంకాదు. 37 లక్షలకోట్ల డాలర్లలో 27 లక్షలకోట్లు డాలర్లు దేశీయంగా తీసుకున్నవే. మొత్తంరుణాల్లో అమెరికా ప్రైవేటు పెట్టుబడిదారులు 42శాతం వాటాగా ఉంటే ప్రభుత్వసంస్థలు ట్రస్టుల వాటా 20శాతంగాను ఫెడ్‌రజర్వువాటా 13శాతంగాను విదేశీ పెట్టుబడి దార్ల వాటా 25శాతంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.